ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తాడేపల్లిగూడెం : fb.com/vaartha Digital

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

5-9-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 215 పేజీలు: 10+4 వెల: 6.50



చవితి వేడుకల్లో అపశ్రుతి డ్యాన్స్ చేస్తూ 22 యేళ్ల యువకుడు మృతి! 2

భారత్, సింగపూర్ సంబంధాలు బలోపేతం 5


# ప్రజలందరికి ఆరోగ్య బీమా

## ప్రతి కుటుంబానికి రూ.25లక్షల ఆరోగ్యసేవలు

### సిఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రి మండలి సమావేశం కీలక నిర్ణయం

### మొత్తం 3,257 చికిత్సల క్లెయిమ్‌లు ఇన్సూరెన్స్ కంపెనీల పరిధిలోకి వచ్చేలా కొత్త విధానం

### రాష్ట్రంలో కొత్తగా 10 వైద్య కళాశాలల ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం

### గ్రామీణ మంచినీటి సరఫరా నిర్వహణ, పర్యవేక్షణ పాలసీలకు గ్రీన్‌సిగ్నల్



**విజయవాడ,సెప్టెంబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ప్రజలందరికి ఆరోగ్య బీమాను ఏపీ ప్రభుత్వం కల్పించింది. ఈ మేరకు ఏపీ మంత్రి మండలి సమావేశం కీలక నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఏపీ సచివాలయంలో గురువారం కేబినెట్ సమావేశం జరిగింది. ఈ భేటీలో సుమారు 30 అంశాలకుపైగా ఎజెండాగా కేబినెట్ చర్చించింది. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఆమోదించే పలు బిల్లులు, చట్ట సవరణలకు ఆమోదం తెలిపింది. ఈ క్రమంలోనే ఆయుష్మాన్ భారత్- ఎన్టీఆర్ వైద్య సేవా పథకం కింద యూన్సివరల్ హెల్త్ పాలసీకి మంత్రివర్గం. ఆమోదం తెలిపింది. దీని ద్వారా ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ.25లక్షల వరక ఉచిత చికిత్సలు అందేలా కొత్త విధానానికి ఆమోదముద్రవేసింది. ఆర్దిక స్థితిగతులతో సంబంధం లేకుండా అందరికి హెల్త్ పాలసీ అమలయ్యేలా నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని 1.63 కోట్ల కుటుంబాలకు ఆరోగ్య బీమా అందేలా ప్రభుత్వం కార్యచరణ రూపొందించింది. 2,493 నెట్ వర్క్ ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్యసేవలు పొందేలా ఎన్టీఆర్ వైద్యసేవ హైబ్రిడ్ విధానాన్ని ప్రభుత్వం అమలు చేయనుంది. మొత్తం 3,257 చికిత్సల క్లెయిమ్‌లు ఇన్సూరెన్స్ కంపెనీల పరిధిలోకి వచ్చేలా కొత్త విధానం రూపొందించారు. రూ.2.5లక్షల నుంచి రూ.25లక్షల వరకు వ్యయాన్ని ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ భరించనుంది. 1.43 కోట్ల పేద కుటుంబాలు, 20లక్షల మంది ఇతర కుటుంబాలకు వర్తించేలా నూతన విధానాన్ని తీసుకుని వస్తున్నారు. ఇందుకు మంత్రివర్గ ఆమోదం తెలిపింది, ఆతిథ్య హోటళ్లకు ప్రోత్సాహకాలు ఇచ్చే అంశంపై చర్చించింది, ఆ దిశలో కీలక నిర్ణయం తీసుకుంది. వాహన పన్ను చట్ట సవరణ బిల్లుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.. గ్రామీణ మంచినీటి సరఫరా నిర్వహణ, పర్యవేక్షణ పాలసీపై చర్చించి తీర్మానం చేసింది.. ప్రైవేటు విశ్వవిద్యాలయాల చట్టంలో పలు సవరణలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏబీ

>>2

# 80 పోస్టుల భర్తీకి ఎపిపిఎస్సీ సన్నాహాలు

### నెలాఖరులోగా నోటిఫికేషన్లు జారీ

### గ్రూప్1, 2 ఫలితాల జాప్యంపై స్పష్టత ఇచ్చిన ఎపిపిఎస్సీ

### స్పోర్ట్స్ కోటా జాబితా అందకపోవడమే ఆలస్యానికి కారణమని వెల్లడి

### 7న అటవీ శాఖ ఉద్యోగాలకు స్క్రీనింగ్ టెస్ట్

**విజయవాడ,సెప్టెంబరు4,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో ప్రభుత్వ ఉద్యో గాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ఏపీపీఎస్సీ శుభవార్త అందించింది. రాష్ట్రంలోని పలు ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న సుమారు 80 పోస్టుల భర్తీకి త్వరలోనే 20 నోటిఫికేషన్లు జారీ చేయ నున్నట్లు ప్రకటించింది. ఇదే సమయంలో వేలాది మంది అభ్యర్థులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న గ్రూప్1, గ్రూప్2 ఫలితాల జాప్యంపైనా స్పష్ట త ఇచ్చింది. విజయవాడలోని ఏపీపీఎస్సీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో కమిషన్ కార్యదర్శి పి. రాజాబాబు ఈ వివరాలు వెల్లడించారు. ఈ నెలాఖరు నాటికి కొత్త నోటిఫికేషన్లు విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పోస్టుల సంఖ్య తక్కువగా ఉన్నందున, ఈ ప్రకటనలన్నింటికీ కలిపి ఒకే ఉమ్మడి పరీక్ష నిర్వహించే ఆలోచనలో ఉన్నట్లు ఆయన సూచనప్రాయంగా తెలిపారు.

గ్రూప్1, గ్రూప్2 తుది ఫలితాల జాప్యంపై రాజాబాబు మాట్లాడుతూ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) నుంచి స్పోర్ట్స్ కోటా అభ్యర్థుల తుది జాబితా ఇంకా అందకపోవడమే ప్రధాన కారణమని పేర్కొన్నారు. ఆ జాబితా అందిన వెంటనే ఫలితాలను విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. స్పోర్ట్స్ కోటా మినహా మిగిలిన ప్రక్రియ మొత్తం పూర్తయిందని

>>2

# 3 నెలల ముందే స్థానిక ఎన్నికలు!

### పురపాలక, పంచాయతిరాజ్ కమిషనర్లకు ఎస్ఇసి లేఖలు





**విజయవాడ,సెప్టెంబరు 4,ప్రభాతవార్త ప్రతినిధి:** స్థానిక సంస్థల ఎన్నికలు మూడు నెలల ముందుగా 2026 జనవరిలో నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నాహాలు చేస్తోంది. ఐదేళ్ల పదవీకాలం ముగియడానికి మూడు నెలల ముందుగా ఎన్నికల నిర్వహణకు చట్టంలో ఉన్న వెసులుబాట్ల మేరకు ఏర్పాట్లు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమీషనర్ నీలం సాహ్ని పంచాయితీరాజ్, పురపాలక శాఖల కమీషనర్లకు బుధవారం లేఖలు రాశారు. ప్రస్తుత సర్పంచుల పదవీ కాలం వచ్చే ఏడాది ఏప్రిల్‌లో...నగరపాలక, పురపాలక సంస్థలు, నగర పంచాయితీల్లో కార్పొరేటర్లు, కౌన్సిలర్ల పదవీ కాలం వచ్చే ఏడాది మార్చితో ముగియనుంది. ఆలోగానే జనవరిలో ఎన్నికల నిర్వహణకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమీషనర్ లేఖలో పేర్కొన్నారు. ఈ లేఖ ప్రకారం ఎన్నికల నిర్వహణకు షెడ్యూలు ఇలా ఉండవచ్చునంటున్నారు. 2025 అక్టోబరు 15 లోగా వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలి. అక్టోబరు 16 నుంచి నవంబరు 15 లోగా వార్డుల వారీగా ఓటర్ల జాబితాలు సిద్ధం చేసి, ప్రచురించాలి. నవంబరు 1 నుంచి 15 లోగా ఎన్నికల

>>2

# శ్రీశైలం నుంచి భారీగా లీకేజి

### 3,10 గేట్ల నుంచి దిగువకు వృధాగా పోతున్న నీరు



**హైదరాబాద్,సెప్టెంబరు4,ప్రభాతవార్త:** శ్రీశైలం ప్రాజెక్టు కు చెందిన 3,10నంబరు గేట్లులీక్ కావడంతో దిగువకు వృధాగా నీరు పోతున్నది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిర్వహణలో ఉన్న శ్రీశైలం డ్యామ్‌కు వర్షాకాలం ఆరంభంలో మరమ్మతులు చేశారు. గేట్లకు లక్షల రూపాయలు వ్యయంచేసి రబ్బరు సీళ్ళు బిగించారు. రెండునెలలుకూడా కాకముందే లీకేజి అరికట్టాల్సిన రబ్బరు సీళ్ళు విఫలమైనాయి. ఇంజనీర్ల పర్యవేక్షణ లేకవడంతో తూతూ మంత్రంగా ఆపరేషన్ అండ్ మేంటనెన్స్ పనులు చేయడంతో ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగమైంది. శ్రీశైలం డ్యామ్ ఉనికి ప్రమాదంగా లీకేజి మారింది. ఈ సంవత్సరం శ్రీశైలం జలాశయం త్వరగా నిండింది. కానీ ఆ నీటిని నిలుపుకోలేని పరిస్థితి నెలకొంది. శ్రీశైల జలాశయానికి జూరాల నుంచి ఈ ఏడాది జూన్ 1 నుంచి, సుంకేసుల నుంచి జులై 5 నుంచి వరద ప్రవాహం ప్రారంభమైంది. బుధవారం నాటికి 1133.57 టీంఎంసీల వరద నీరు వచ్చి చేరింది. 43 రోజుల పాటు శ్రీశైల జలాశయం గేట్లు ఎత్తారు. వరద

>>2

### నేడు విశాఖ, విజయవాడలో

# సిఎం పర్యటన

**విజయవాడ, సెప్టెంబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబు శుక్రవారం విశాఖ, విజయవాడల్లో పర్యటించనున్నారు. విశాఖలో జరిగే ఇంటర్నేషనల్ మీడియేషన్ కాన్ఫరెన్సుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరు కానున్నారు. శుక్రవారం ఉదయం 7.30 గంటలకు క్యాంపు కార్యాలయం నుంచి హెలికాప్టర్ లో సీఎం విశాఖ బయల్దేరి వెళ్లనున్నారు. విశాఖలోని రాడిసన్ బ్లూ హోటల్ లో ఉదయం 10 గంటలకు జరిగే ఏసీఐఎఎం ఇంటర్నేషనల్ మీడియేషన్ కాన్ఫరెన్సుకు ముఖ్యమంత్రి హాజరు కానున్నారు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ జస్టిస్ లో భాగంగా ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిజల్యూషన్ (ఏడీఆర్) పై ముఖ్యమంత్రి ప్రసంగించనున్నారు. ఈ సమావేశంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి న్యాయ నిపుణులు పాల్గొంటారు. సమావేశం అనంతరం ఆయన అమరావతికి తిరిగి రానున్నారు. సాయంత్రం 6 గంటలకు విజయవాడలో జరిగే ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో సీఎం పాల్గొననున్నారు. ఉత్తమ పని తీరు కనబరిచిన 175 మంది టీచర్లకు అవార్డులు ప్రదానం చేయనున్నారు.

# తురకపాలెంకు కదిలిన అధికార యంత్రాంగం

### మరణాలకు దారితీసిన అంశాల నమోదుకు చర్యలు

### రాష్ట్ర వైద్య,ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీర పాండియన్ వెల్లడి

### గ్రామంలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మితోపాటు అధికార యంత్రాంగం పర్యటన



గురువారం మీడియాతో మాట్లాడుతున్న గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తదితరులు

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, సెప్టెంబర్ 4:** గుంటూరు రూరల్ మండలం తురకపాలెంలో మరణాలకు దారితీసిన అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి కారణాల నమోదుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీర పాండియన్ తెలిపారు. గురువారం గుంటూరు రూరల్ మండలం తురకపాలెం గ్రామంలో గత రెండు నెలలలో 20 మరణాలకు దారితీసిన కారణాలను పరిశీలించడానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీర పాండియన్ జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మితో కలసి గ్రామంలో పర్యటించారు. తొలుత గ్రామంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్ ను పరిశీలించి అక్కడ బాధితులకు అందిస్తున్న వైద్య సేవలను, పరీక్షల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీర పాండియన్ మీడియా వారితో మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని శాఖల నుండి మెకానిజంను ఏర్పాటు చేయడం జరిగిందని, జిల్లా కలెక్టర్ అధ్వర్యంలో ప్రతి రోజు సమీక్షించడం జరుగుతుందన్నారు. ఇది ఒకే గ్రామంలో జరగడం వలన దినపత్రికలల్లో, టీవీ న్యూస్ ఛానెల్స్‌లో ప్రసారం అవుతున్నందున ఇందుకు గల కారణాలను తెలుసుకోవడానికి నిపుణుల బృందాన్ని రెండు రోజుల క్రితం ఏర్పాటు చేయడం జరిగిందని, బృందం ప్రాథమిక నివేదిక ఇవ్వడం జరిగిందన్నారు. నివేదిక ప్రకారం నిర్ణయానికి రావడం సాధ్యపడదని, మెలైడియోసిస్ అని, ఆల్కహాల్ అని చెపుతున్నారని, రక్త నమూనాల పరీక్షల నివేదిక అనంతరం కారణాలను విశ్లేషించడం జరుగుతుందన్నారు. త్రాగుడు అలవాటు ఉన్నవారు 9 మంది చనిపోయారని చెపుతున్నారని, కేవలం త్రాగుడు వలనే చనిపోయారని చెప్పడం సరికాదన్నారు. గ్రామం గురించి సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రసారం చేస్తున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇప్పటి వరకు పరిస్తితి అదుపులోనే వుందని పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించడం జరుగుతున్నదన్నారు. 12 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరి నుండి బ్లడ్, యూరిన్‌శాంపిల్స్ తీసుకుని 45 పారామీటర్స్ క్రింద టెస్ట్ చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఎవరికైనా జ్వరం వుంటే బ్లడ్ కల్చర్ చేస్తున్నామని, ఇప్పటి వరకు 32 మందికి బ్లడ్ కల్చర్ కి శాంపిల్స్ సేకరించడం జరిగిందన్నారు. జ్వరం వున్నవారు మెడికల్ క్యాంపుకు వచ్చి రక్తనమూనాలు అందించాలని, రాలేని వారు తెలియజేస్తే వైద్య బృందం ఇంటికి వెళ్ళి రక్త సేకరణ చేయడం జరుగుతుందన్నారు. ఇందుకు కోసం 14 మందితో ల్యాబ్ టెక్నీషియన్స్‌తో బృందాన్ని నియమించడం జరిగిందన్నారు. కల్చర్ టెస్ట్‌రిపోర్ట్‌కు 72 గంటలు పడుతుందన్నారు. రిపోర్ట్స్ వచ్చిన తరువాత ఎటువంటి యాక్షన్ ప్లాన్ రూపొందించాలో నిర్ణయం తీసుకొని పకడ్బంధీగా అమలు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన పని లేదని జిల్లా కలెక్టర్ చెప్పినట్లు ప్రతి నెల సాధారణ డెత్‌రేట్ వుందన్నారు. జూలై, ఆగష్టు మాసాలలో ఎక్కువ మంది చనిపోయినందున అందుకు గలకారణాలను విశ్లేషించడం జరుగుతున్నదన్నారు. రెండు మూడు రోజులలో కారణాలు

>>2

# 'సుప్రీం'లో పిన్నెల్లి సోదరులకు ఊరట

**విజయవాడ,సెప్టెంబరు4ప్రభాతవార్తప్రతినిధి:** వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డికి సుప్రీం కోర్టులో ఊరట దక్కింది. టిడిపి నేతల హత్య కేసులో వారిని అరెస్ట్ చేయకుండా న్యాయస్థానం మధ్యంతర రక్షణ కల్పించింది. అయితే, గతంలో టీడీపీ నేతలు వేంకటేశ్వరావు, కోటేశ్వరావు హత్య కేసులో పిన్నెల్లి సోదరులకు ముందస్తు బెయిల్‌ను ఏపీ హైకోర్టు నిరాకరించింది. ఏపీ హైకోర్టు తీర్పును సుప్రీంలో సవాల్ చేశారు పిన్నెల్లి సోదరులు. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల నేతృత్వంలోని ధర్మాసనం ఇవాళ(గురువారం) విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వానికి, ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది సుప్రీం ధర్మాసనం. తదుపరి విచారణను మూడు వారాలకు న్యాయస్థానం వాయిదా వేసింది.

# ఏడుగురు ఐఎఎస్ అధికారుల బదలీ

**విజయవాడ,సెప్టెంబరు4,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం ఏడుగురు ఐఎఎస్ అధికారులను బదిలీ చేస్తూ జిఓఆర్‌టి నెంబరు 1628ను విడుదల చేసింది. గతరాత్రి బాగా పొద్దుపోయిన తరువాత ఈ ఉత్తర్వులు విడుదలయ్యాయి. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న రోణంకి కూర్మనాథ్ ను సర్వే సెటిల్‌మెంట్స్ అండ్ ల్యాండ్ రికార్డ్సు డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. అదనపు బాధ్యతలు నిర్వహస్తున్న ఎన్ ప్రభాకర్‌రెడ్డిని ఆ బాధ్యతల నుంచి తప్పించారు. పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న వై మేఘస్వరూప్‌ను తూ.గో జిల్లా జాయింట్ కలెక్టరుగా నియమించారు. వెయిటింగ్‌లో ఉన్న అధుతోష్ శ్రీవాస్తవను గుంటూరు జాయింట్ కలెక్టరుగా, సి యశ్వంత్ కుమార్‌రెడ్డిని పార్వతీపురం జాయింట్ కలెక్టరుగా నియమించారు. అక్కడ ఉన్న జెసి శోభికను పార్వతీపురం ఐటిడిఎ పిఓగా బదిలీ చేశారు. వెయిటింగ్‌లో ఉన్న శ్రీపూజను పాడేరు ఐటిడిఎ పిఓగా నియమించారు. వెయిటింగ్‌లో ఉన్న కెఆర్ కల్పశ్రీని సిసిఎల్ఎలో విజిలెన్స్ జాయింట్ సెక్రటరీగా పోస్టింగ్ ఇచ్చారు. బచ్చు స్మరణ్‌రాజ్‌ను రంపచోడవరం ఐటిడిఎ పిఓగా పోస్టింగ్ ఇచ్చారు. అక్కడ పనిచేస్తున్న కట్టా సింహాచలానికి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు.

# వరద వణుకులో ఉత్తరాది

### ఢిల్లీ, రాజస్థాన్, కాశ్మీర్, పంజాబ్, హిమాచల్‌లో భారీ వర్షాలు

### ప్రమాద స్థాయిని మించి ప్రవహిస్తున్న యమున, సరయు

### పెద్ద ఎత్తున సహాయక చర్యలు చేపట్టిన ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్



ఢిల్లీ శివార్లలో యమునా నది ఉధృతికి నీటమునిగిన కాలనీలు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** ఉత్తరాది రాష్ట్రాలను జోరు వానలు వణికిస్తున్నాయి. దిల్లీ, జమ్మూకశ్మీర్, పంజాబ్‌లలో వరద ప్రభావం తీవ్రంగా ఉంది. దిల్లీలో యమునా నది ప్రమాద స్థాయి 205.33 మీటర్లు దాటి ప్రవహిస్తోంది. పాత రైల్వే వంతెన వద్ద యమునా నది ప్రవాహం 207 మీటర్లకు చేరుకుంది. దీనివల్ల నిగమ్‌బోధ్ ఘాట్, యమునా బజార్ ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయి. కాళిందికుంజ్‌లోని పలు ప్రాంతాలు, విశ్వకర్మ కాలనీ జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. వదరలు అతలాకుతలంచేస్తుండటంతో లోతట్టు ప్రాంతాలప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఓల్డ్‌ఉస్మాన్‌పుర్, ఓల్డ్ గడీ మాండూ గ్రామాల్లోకి వరద చేరడంతో 2500 మందిని, వారి పెంపుడు జంతువులను సురక్షితప్రాంతాలకు తరలించారు. లోతట్టు ప్రాంతాలప్రజల్ని నాలుగు బృందాలు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నాయి. మరో 18 బృందాలు సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో యమునా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. నోయిడా సెక్టార్ 167 సమీపంలోని ప్రాంతాలు జలమయమయ్యాయి. సరయూ నది కూడా ఉధృతంగా ప్రవహిస్తుండగా పరివాహక ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. అటు రాజస్థాన్‌లోనూ జోరు వానలు కురుస్తున్నాయి. జైపుర్‌లోని లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. టోంక్ రోడ్ సమీపంలో జనజీవనం అస్తవ్యస్తమైంది. పంజాబ్, హరియాణాల్లోనూ వర్షాలు దంచికొడుతున్నాయి. పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్‌లో వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక సామగ్రిని పడవల ద్వారా చేరవేస్తున్నారు. జిరాక్‌పుర్‌లో భారీ వర్షం కారణంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పంజాబ్‌లో వరదల కారణంగా మృతుల సంఖ్య 30కి చేరింది. హరియాణాలోని ఘగ్గర్ నదిలో నీటిమట్టం భారీగాపెరిగింది. చండీగఢ్‌లో

>>2

# జిఎస్టీ సంస్కరణలు దసరా గిఫ్ట్

### ప్రజలకు దీపావళి కానుక కూడా ఇస్తాం



### చిన్నపిల్లల మిఠాయిలపైనా సుంకాలు వేసిన చరిత్ర కాంగ్రెస్‌దే!

### విపక్షాల విమర్శలకు చెక్‌పెట్టిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** జిఎస్టీలో తెచ్చిన తాజా సంస్కరణలపై స్పందించిన మోడీ విపక్షాలపై ధ్వజమెత్తారు. ప్రతి ఉత్పత్తి, వస్తువుపైనా కాంగ్రెస్ విపక్షాలు పన్నులువేసాయని, చిన్నపిల్లల వస్తువులు, చాక్లెట్లు మిఠాయిలను కూడా వదల్లేదని ఆయన ఆరోపించారు. నిత్యావసరాలు ఆహారం, వైద్యరంగంలోని మందులపైనా అత్యధిక పన్నులు వేసారని ఆరోపించారు. 2014లో తాను అధికారంలోకి రాకముందు కిచెన్‌లో వాడుకునే సామగ్రి, వ్యవసాయ ఉత్పత్తులు, మందులు, జీవితబీమా వంటి అన్నింటిపైనా పన్నులు ఎలాంటి మినహాయింపులేకుండా విధించారని ఆరోపించారు. టూత్‌పేస్ట్, సబ్బులు, హెయిరాయిల్‌లను 27శాతం పన్నులువేసారని, 18 నుంచి 28శాతం ఆహారం తినడానికి వాడే ప్లేట్లు, కప్‌ప్లేట్లు, స్పూన్లు, చివరకు పండ్లపొడిమీదకూడా 17శాతం పన్నువేసారన్నారు. ఇక చిన్నపిల్లలు తినుబండారాలపైనా కాంగ్రెస్ ప్రభుత్వం 21శాతం పన్నులువేసిందని దుయ్యబట్టారు. కోట్లాదిమంది ప్రజలు విభిన్న రంగాల నిపుణులు 17శాతానికి పన్ను తగ్గించాలనికోరారు. లక్షలాది మంది తల్లులు, సోదరీమణులు స్వయం ఉపాధికి 16శాతం సుంకాలు వేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ హయాంలో ఇళ్లనిర్మాణమే కష్టంగా మారిందని, 29శాతం సిమెంట్‌పై పన్నులువేసారన్నారు. అలాగే

>>2

కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం 2



అనంతనాగ్‌లో గురువారం నీట మునిగిన పలు కాలనీలు

## శ్రీశైలం నుంచి భారీగా లీకేజి

>> తగ్గడంతో గేట్లు మూసివేశారు. ప్రస్తుతం జలాశయంలో 883.20 అడుగులు, నీటినిల్వ 205.6627 టీఎంసీలుగా నమోదైంది. ఎగువ నుంచి( జూరాల, సుంకేసుల) 1,73,883 క్యూసెక్కుల వరద వస్తోంది. విద్యుదుత్పత్తి చేస్తూ 66,568 క్యూసెక్కులను నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు.

## 80 పోస్టుల భర్తీకి ఎపిపిఎస్సీ సన్నాహాలు

>> తెలిపారు. అలాగే గ్రూప్2కు సంబంధించి 1,634 మంది అభ్యర్థుల కంటిచూపు, 24 మంది వినికిడి సామర్థ్యానికి సంబంధించిన వైద్య నివేదికలు కూడా రావాల్సి ఉందని వివరించారు. ఫలితాలపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వదంతులను నమ్మవద్దని అభ్యర్థులకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఇక అటవీ శాఖ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ గురించి మాట్లాడుతూ.. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టులకు ఈ నెల 7వ తేదీన స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు రాజాబాబు తెలిపారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 287 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు ఓఎంఆర్ షీట్‌పై వివరాలను జాగ్రత్తగా నింపాలని, వైట్‌నర్ వాడినా లేదా సమాధానాలు చెరిపివేసినా ఆ పత్రాలను పరిగణనలోకి తీసుకోబోమని హెచ్చరించారు. ప్రతి మూడు తప్పు సమాధానాలకు ఒక నెగటివ్ మార్కు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

## 3 నెలల ముందే స్థానిక ఎన్నికలు!

>> అధికారుల నియామకం పూర్తి చేయాలి.నవంబరు 16 నుంచి 30 లోగా పోలింగ్ కేంద్రాల ఖరారు,ఈవీఎంలు సిద్ధం చేయడం,సేకరణ వంటివి పూర్తి చేయాలి. డిసెంబరు 15 లోపు రిజర్వేషన్లు ఖరారు చేయాలి.డిసెంబరు చివరి వారంలో రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలి.2026 జనవరిలో ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చి,అదే నెలలో ఫలితాలు ప్రకటించాలి.

## నేడు మదగడ గిరిజన గ్రామానికి డిప్యూటీ సిఎం పవన్

**విజయవాడ,సెప్టెంబరు4,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ నెల 5వ తేదీన అల్లూరి సీతారామరాజు జిల్లా, అరకు వ్యాలీ మండలం, మదగడ గిరిజన గ్రామాన్ని సందర్శిస్తారు. మదగడ గ్రామస్తులు నిర్వహించుకునే ఆదివాసీ సంప్రదాయ ఉత్సవం బలి పొరోబ్ లో పాల్గొంటారు. మదగడ గ్రామ పంచాయతీ పరిధిలో మాత్రమే 12 రోజులపాటు నిర్వహించే బలి పొరోబ్ ఉత్సవాలు గత నెల 25వ తేదీన ప్రారంభమయ్యాయి. అల్లూరి జిల్లాతోపాటు మన్యం జిల్లా, ఒడిశా రాష్ట్ర ఆదివాసీలు ఈ ఉత్సవంలో పాల్గొంటారు. గిరి పుత్రుల ఆహ్వానం మేరకు చివరి రోజు ఉత్సవాలకు ప్రవన్ కళ్యాణ్ గారు హాజరవుతారు.

## మద్యం కుంభకోణంలో సజ్జల భార్గవ్‌రెడ్డి పాత్ర కీలకం!

### 12 కంపెనీల్లో సిట్ సోదాలు

**విజయవాడ,సెప్టెంబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** హైదరాబాద్ గచ్చిబౌలిలో ఉన్న భీమ్ స్పేసెస్ ఎల్ఎల్‌పీ సంస్థ చిరునామాకు వెళ్లి తనిఖీలు చేయగా అక్కడ ఈషా ఇన్‌ఫ్రా హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట మరో కంపెనీ కూడా ఉన్నట్లు తేలింది. భీమ్ స్పేసెస్ ఎల్ఎల్‌పీలో సజ్జల భార్గవరెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చంద్రపతి ప్రద్యుమ్న డైరెక్టర్లుగా ఉన్నారు. ఈషా ఇన్‌ఫ్రా హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌లోనూ ప్రద్యుమ్న డైరెక్టర్‌గా ఉన్నారు. మద్యం ముడుపుల సొమ్మును ఈ కంపెనీల ద్వారా రూటింగ్ చేసినట్లు సిట్ అనుమానిస్తోంది. ఎర్రచందనం స్మగ్లర్, చిత్తూరు నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇన్‌ఛార్జి, ఆ పార్టీ తరఫున గత ఎన్నికల్లో పోటీచేసిన విజయానందరెడ్డికి చెందిన నిఖిలానంద అపార్ట్‌మెంట్‌లో సిట్ బృందాలు బుధవారం సోదాలు చేశాయి. అపార్ట్‌మెంట్ పైభాగంలో ఆయన ఇల్లు, కింద కార్యాలయం ఉన్నాయి. సోదాలు చేసినప్పుడు ఆయన కార్యాలయంలో లేరు. సీఎంఆర్ ప్రాజెక్ట్స్ సంస్థ చిత్తూరు నలందానగర్ బీవీరెడ్డి కాలనీలోని నిఖిలానంద అపార్ట్‌మెంట్, డోర్ నంబర్ 2 -1251-4 చిరునామాతో రిజిస్టర్ కావడంతో సిట్ బృందాలు అక్కడికి వెళ్లి తనిఖీలు చేశాయి. అయితే అక్కడ సీఎంఆర్ ప్రాజెక్ట్స్‌కు బదులుగా వెల్‌టాస్క్ ఫుడ్ అండ్ బెవరేజెస్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో బోర్డు ఉంది. ఆర్‌ఓసీలోకి వెళ్లి వివరాలు పరిశీలిస్తే అసలు ఆ పేరుతో కంపెనీయే లేదని తేలింది. ఆ బోర్డులో పేర్కొన్న కంపెనీ ఐడెంటిఫికేషన్ నంబర్ కూడా బోగసేనని వెల్లడైంది. ఆ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందిని విచారించి పత్రాలు, కంప్యూటర్లలోని సమాచారాన్ని విశ్లేషించగా అక్కడి నుంచి దాదాపు పదికి పైగా కంపెనీలు, సంస్థలు నడిపిస్తున్నట్లు సిట్ బృందాలు గుర్తించాయి. ఇక సీఎంఆర్ ప్రాజెక్ట్స్, ముక్కోటి ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, నిఖిలానంద లాజిస్టిక్స్, ఎంఏసీ గ్రానైట్స్, సోను గ్రానైట్స్, రాజ్ గ్రానైట్స్, ఎంఎస్‌జే ఎక్స్‌పోర్ట్స్, నిఖిలానంద డెవలపర్స్, శ్రీసాయి కన్వెన్షన్ సెంటర్, గౌతమిసాయి ఫైనాన్స్ కంపెనీలు ఆ కార్యాలయం నుంచి నడుస్తున్నాయి. ఇవన్నీ చెవిరెడ్డి భాస్కరరెడ్డి, మోహిత్‌రెడ్డి, విజయానంద రెడ్డివే. నిఖిలానంద అపార్ట్‌మెంట్ కూడా విజయానందరెడ్డిదే. ఈ సంస్థల ద్వారా మద్యం ముడుపుల సొమ్ము రూటింగ్ చేసినట్లు సిట్ భావిస్తోంది. వైఎస్సార్సీపీ హయాంలో మద్యం డిపోల నుంచి ప్రభుత్వ దుకాణాలకు మద్యం రవాణా కాంట్రాక్టును నిఖిలానంద లాజిస్టిక్స్ నిర్వహించింది. ఈ కంపెనీ విజయానందరెడ్డిదే. ఈ కంపెనీ ముసుగులో భారీగా దోచుకున్నట్లు సిట్ వివరాలు సేకరించి ఆ సొత్తు ఎవరెవరికి, ఎలా చేరిందనేదానిపై ఆరా తీస్తోంది. మద్యం కుంభకోణం కేసులో ఎప్పుడైనా తనిఖీలు, సోదాలు చేసినా సరే సీఎంఆర్ ప్రాజెక్ట్స్, నిఖిలానంద లాజిస్టిక్స్ వంటివాటి గుట్టు బయటకు రాకుండా ఉండేందుకు అసలు లేని సంస్థ పేరుతో బోర్డు పెట్టినట్లు సిట్ అధికారులు దర్యాప్తులో తేలింది.ఏపీ లిక్కర్ స్కాం కేసు రాజ్ కెసిరెడ్డి ఆస్తుల జప్తునకు ప్రభుత్వం అనుమతి. చెవిరెడ్డి భాస్కరరెడ్డి స్వగ్రామమైన తుమ్మలగుంట చిరునామాతో ఉన్న ఇల్లు, కార్యాలయాల్లో తనిఖీలు చేయడానికి సిట్ బృందాలు ప్రయత్నించగా వాటికి తాళాలు వేసి ఉన్నాయి. దీంతో మోహిత్‌రెడ్డిని దర్యాప్తు బృందాలు సంప్రదించాయి. ఆ కంపెనీలన్నీ ఎన్నికల తర్వాత మూసేశామని వాటి రికార్డులు కావాలంటే తాను ఇస్తానని, ప్రస్తుతం తాను విజయవాడలో ఉన్నానని మోహిత్‌రెడ్డి సమాధానమిచ్చారు.

## పక్షి ఢీకొని నిలిచిపోయిన ఎయిరిండియా విమానం

**గన్నవరం, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త:** గన్నవరం విమానాశ్రయంలో తృటిలో పెను ప్రమాదం తప్పింది. విమానం టేకాఫ్ అయ్యే సమయంలో పక్షి ఢీకొట్టడంతో ఫైలట్ అప్రమత్తంగా వ్యవహరించి విమానాన్ని నిలిపివేయటంతో ప్రమాదం తప్పింది. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం బెంగుళూరు నుండి గురువారం ఉదయం 7.45 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంది. తిరుగు ప్రయాణంలో 100 ప్రయాణికులతో బయలుదేరిన విమానం గన్నవరం విమానాశ్రయంలో టేకాఫ్ కు రన్‌వేపై స్పీడ్ అందుకునే క్రమంలో విమానాన్ని పక్షి ఢీకొట్టింది. ప్రమాదాన్ని గమనించి అప్రమత్తమైన ఫైలట్ విమానానికి అత్యవసర బ్రేక్‌లు వేసి నిలిపివేసారు. వేగం అందుకుంటున్న క్రమంలో బ్రేక్‌లు వేయటంతో విమానం కుదుపులకు గురయ్యింది. దీంతో ప్రయాణికులు తీవ్ర అందోళన చెందగా విమానం నిలిపివేస్తున్నట్లు ప్రకటించిన ఫైలట్ విమానాన్ని టాక్సీ వేలోకి తీసుకువచ్చి నిలిపివేసారు.విమానంలోని ప్రయాణికులందరినీ టెరి మ్నల్ భవనంలోకి తరలించారు.కొంతమంది ప్రయాణికులు తమ ప్రయాణాన్ని రేపటికి వాయిదా వేసుకోగా మిగిలిన వారిని వేరే విమానంలో హైదరాబాద్ మీదుగా బెంగుళూరుపంపించారు. దెబ్బతిన్న విమానానికి మరమత్తులు చేపట్టారు.

## చవితి వేడుకల్లో అపశ్రుతి డ్యాన్స్ చేస్తూ 22 యేళ్ల యువకుడు మృతి!

**విజయనగరం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయనగరం జిల్లా కేంద్రంలో జరుగుతున్న చవితి వేడుకల్లో విషాదం చోటు చేసుకుంది. వేడుకల్లో భాగంగా చెవులు దద్దరిల్లేలా వినిపిస్తున్న డీజే సౌండ్ మరో ప్రాణాన్ని బలి గొంది. అది కూడా నిండా పాతికేళ్ళు కూడా నిండని యువకుడిని బలి తీసుకుంది. జిల్లా కేంద్రంలోని బొబ్బాదిపేటలో వినాయక నిమజ్జనంలో డీజే సౌండ్ బాక్సుల ముందు డాన్స్ చేస్తూ బొబ్బాది హరీశ్ (22) అనే యువకుడు ఉన్నట్టుండి కుప్పకూలిపోయాడు. హుటాహుటిన ఆస్పత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకపోయింది. అప్పటికే అతడి ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి. ఆస్పత్రికి వచ్చేటప్పటికే అతడు చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన అతడు ఇటీవల క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగం కూడా సాధించాడు. సంబరాల సంగతి ఎలా ఉన్నా డీజేలో వచ్చే భారీ శబ్దాల ధ్వని గుండెపై ఎఫెక్ట్ చూపిస్తుందని వైద్యులు పదే పదే హెచ్చరిస్తున్నారు.

## వారం - వర్జ్యం

**05-09-2025, శుక్రవారం**
**శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,**
**భాద్రపద మాసం, దక్షిణాయణం**
**వర్ష ఋతువు, శుక్లపక్షం**
త్రయోదశి రా.3.11
శ్రవణ రా.11.34
వర్జ్యం : రా.3.27-తె.5.00
దు.ఉ.8.25-9.15, 2) మ.12.32-మ.1.22
శుభసమయం : ఉ.6.30-7.15,సా.7.30-8.10
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** మీకు సానుకూల పడని వ్యవహారాలు అనూహ్యంగా సానుకూలపడతాయి.

**వృషభం:** సమాజంలో మరింత ఉన్నత స్థానాలు అధిరోహించడానికి కావలసిన ప్రణాళికలు సిద్ధం చేసుకొంటారు.

**మిథునం:** తనఖాలో ఉంచిన డాక్యుమెంట్లను విడుదల చేసుకుంటారు. వాహనయోగం.

**కర్కాటకం :** ఇతరులకు సైతం సహాయ సహకారాలు అందించగలుగుతారు. వస్తు సేకరణ.

**సింహం:** వృత్తి, ఉద్యోగ, వ్యాపారాలు సానుకూలంగా ఉంటాయి. వివాహాది శుభకార్యాలకు హాజరవుతారు.

**కన్య :** వీసా పాస్‌పోర్ట్ అంశాలు కలిసి వస్తాయి. రాజకీయ విభేదములకు ఆస్కారమున్నది. జాగ్రత్త వహించండి.

**తుల :** స్వంత విషయములలో ఇతరుల జోక్యమును రానీయకండి. పంచాయితీలు మధ్యవర్తిత్వము రాణించరు.

**వృశ్చికం:** వ్యతిరేక వాతా వరణంలో అనుకూల ఫలితాలు సాధిస్తారు. సభలు, సమావేశాలలో పాల్గొంటారు.

**ధనుస్సు:** నష్టం రావలసిన చోట నష్టం రాదు. స్పెక్యులేషన్ మధ్యస్థంగా ఉంటుంది.

**మకరం:** కొద్దిపాటి మానసిక ఆందోళనకు గురి చేసినా, ఆచరణలో చెడుఫలితాలను మాత్రం ఇవ్వదు.

**కుంభం:** విదేశాలలోని మీ బంధుమిత్ర వర్గ సహాయసహకారాలు అందుతుంటారు.

**మీనం :** ముఖ్యమైన జఠిలమైన సమస్యలు పరిష్కారమవుతాయి. వాహనసౌఖ్యం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ప్రజలందరికి ఆరోగ్య బీమా

>> పీఎం జేఏవై డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ స్కీమ్ హైబ్రిడ్ మోడ్‌లో యూనివర్శియల్ హెల్త్ పాలసీ తయారీ అమలుకు మంత్రిమండలిలో ఆమోదం తెలిపింది టెండర్ కమిటీలో స్వల్ప మార్పులు చేసి ప్రీబిడ్‌కు ఆమోదం తెలిపింది. జనవరి 1, 2025 తర్వాత చేయాలని మంత్రి మండలి నిర్ణయం తీసుకోంది. ఏపీ మున్సిపాలిటీ యాక్ట్ 1965, ఏపీసీఆర్డీఏ యాక్ట్ 2014, ఏపీ మెట్రోపాలిటన్ రీజియన్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ యాక్ట్ 2016లను సవరణ చేయడంతోపాటు డ్రాఫ్ట్ ఆర్డినెన్స్ జారీ ద్వారా యూఎల్బీ, యూడీఏ, ఏపీసీఆర్డీఏ రాజధాని ప్రాంతం మినహాయించి అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన భవనాలకు ఫీనలైజేషన్ చేస్తూ రెగ్యూలరైజ్‌కు అవకాశం కల్పించింది ఆగస్టు 28వ తేదీన నిర్వహించిన ఎస్ఐపీబీ సమావేశం నిర్ణయాల్లో భాగంగా మదర్ డెయిరీ ఫ్రూట్ అండ్ వెజిటేబుల్ ప్రైవేట్ లిమిటెడ్, ఏస్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌లకు కేబినెట్ ఆమోదం తెలపనుంది.
ఎస్ఐపీబీ సమావేశం నిర్ణయాల్లో భాగంగా స్కైరూట్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు, ప్రాజెక్టులు గ్రౌండింగ్ అయ్యేలా చూసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.ఎస్ఐపీబీ సమావేశం నిర్ణయాల్లో భాగంగా బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్, అధాని విల్మర్ లిమిటెడ్, ధైరోమర్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్, రామ్ సై బయో ప్రైవేట్ లిమిటెడ్, శ్రీ సర్వరాయ షుగర్స్ లిమిటెడ్, పట్టాడి ఆగ్రోఫుడ్స్‌లకు ఎర్లీ బర్డ్ ప్రోత్సాహం అందజేయడంపై చర్చించి నిర్ణయం తీసుకుంది. ఎస్ఐపీబీ సమావేశం నిర్ణయాల్లో భాగంగా అపోలో టైర్స్ లిమిటెడ్ సంస్థ గ్రౌండింగ్‌కు కేబినెట్ ఆమోదం తెలిపింది ఎస్ఐపీబీ నిర్ణయాల్లో భాగంగా వరాహ ఆక్వా ఫామ్స్ , అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంట్రపెన్యూర్స్ ఆఫ్ ఇండియా, జె కుమార్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రతిపాదనల ద్వారా పీపీపీ పార్క్ పాలసీని అనుసరించి ప్రైవేటు ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు మంత్రిమండలి ఆమోదం తెలపింది. ఎస్ఐపీబీ నిర్ణయాల్లో భాగంగా పీపీపీ పార్క్ పాలసీని అనుసరించి ప్రైవేట్ మెగా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు ఇఫ్కో కిషాన్ సెజ్ లిమిటెడ్‌కు మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

**పీపీపీ విధానంలో కొత్త వైద్య కళాశాలలు**

కొత్త వైద్య కళాశాలల విషయంలోను కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. పీపీపీ విధానంలో రాష్ట్రంలో 10 కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదాన్ని తెలిపింది. రెండు దశల్లో ఆదోని, మదనపల్లె, మార్కాపురం, పులివెందుల, పెనుగొండ, పాలకొల్లు, అమలాపురం, నర్సీపట్నం, బాపట్ల, పార్వతీపురంలో పిపిపి పద్ధతిలో వైద్య కళాశాలలు ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు ఆర్ఎఫ్‌పీ జారీ చేసేందుకు రాష్ట్ర మంత్రివర్గం అనుమతి ఇచ్చింది. రెండో దశలో మిగిలిన ఆరు ప్రాంతాల్లోని వైద్య కళాశాలలను పీపీపీ కింద ఏర్పాటు చేసేందుకు ఫీజిబిలిటీ రిపోర్టు సిద్ధం చేయాలని నిర్ణయించారు.
ఆదోని, మదనపల్లి, మార్కాపురం, పులివెందుల, పెనుగొండ, పాలకొల్లు, అమలాపురం, నర్సిపట్నం, బాపట్ల , పార్వతీపురంలో నూతనంగా పది మెడికల్ కాలేజీలు ఏర్పాటుకు పీపీపీ మోడ్‌లో కేబినెట్ ఆమోదించింది. వీటిలో ఆదోని, మార్కాపురం, మదనపల్లి, పులివెందులలో ఫేజ్1లో పీపీపీ మోడ్‌లో చేపట్టాలని నిర్ణయం తీసుకోంది మిగిలిన ఆరు మెడికల్ కళాశాలలకు ఫీజిబిలిటీ రిపోర్ట్, డ్రాఫ్ట్ ఆర్‌పీఎఫ్, కనెక్షన్ అగ్రిమెంట్ ఆమోదం తెలిపింది. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టు నివారణకు మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు.
భావ ప్రకటన స్వేచ్ఛ ఉండొచ్చు కానీ అది శృతి మించకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టుల నివారణకు తీసుకురావాల్సిన విధి విధానాలకు మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేయాలని సీఎం నిర్ణయించారు. హోంమంత్రి అనిత, నాదెండ్ల మనోహర్, అనగాని, పార్థసారథిలతో ఉపసంఘం ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. కొత్త చట్టం తీసుకొచ్చేందుకు నిబంధనల రూపకల్పనకు ఉపసంఘం కృషి చేయనుంది.
తప్పుడు పోస్టులు పెట్టే వారిపై కఠిన చర్యలు ఉండేలా చట్టం ఉండాలని సీఎం వ్యాఖ్యానించారు. అక్రమ నిర్మాణాలు క్రమబద్ధీకరణకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇకపై ఇలాంటి పరిణామాలు చోటు చేసుకోకుండా అధికారులు కఠినంగా ఉండాలని చంద్రబాబు ఆదేశించారు. మంత్రివర్గ సమావేశం అనంతరం తాజా రాజకీయ అంశాల పై సహచరులతో చర్చించారు.

**కేంద్రానికి అభినందనలు తెలిపిన కేబినెట్**

జీఎస్టీ సంస్కరణలు తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వానికి మంత్రివర్గం అభినందనలు తెలిపింది. భారత్ త్వరలోనే ప్రపంచంలో తొలి 3 స్థానాల్లో ఉంటుందని సీఎం అభిప్రాయపడ్డారు. 2047 లక్ష్యాలకు అనుగుణంగా మొదటి స్థానంలో నిలుస్తామని సీఎం వెల్లడించారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం భారతీయ సామాన్య,మధ్యతరగతి వర్గాలకు అత్యంత ప్రయోజనకరమన్నారు.

**ఎరువుల లభ్యత అంశంలో అప్రమత్తంగా వ్యవహరించండి**

మంత్రి వర్గ సమావేశం ముగిసిన సందర్భంలో సీఎం చంద్రబాబు నాయుడు మంత్రులతో మాట్లాడుతూ మనం రైతుల అవసరాలకు అనుగుణంగా ఎరువుల లభ్యతను కల్పించామన్నారు.ఈ విషయంలో మంత్రులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు.ఎరువులు రైతులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.



న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో గురువారం సింగపూర్ ప్రధాన మంత్రి లారెన్స్ వాంగ్, ప్రధాని మోడీ సమక్షంలో ఇరు దేశాల మధ్య జరిగిన ఎంఒయులు మార్చుకుంటున్న విదేశాంగ మంత్రులు

## నేడు ప్రధానితో మంత్రి లోకేష్ భేటీ

**విజయవాడ,సెప్టెంబరు4,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ మరోసారి ఢిల్లీకి వెళ్లనున్నారు. ఈరోజు రాత్రికి ఢిల్లీ చేరుకోనున్న ఆయన రాత్రి అక్కడే బస చేయనున్నారు. శుక్రవారం ఉదయం ఆయన ప్రధాని మోడీతో సమావేశమై ఏపీలో జరిగిన యోగాంధ్ర నిర్వహణపై మోడీకి వివరించనున్నారని సమాచారం. యోగాంధ్ర పై తయారు చేసిన బుక్‌ను ఈ సందర్భంగా ప్రధాని మోడీకి లోకేష్ అందజేయనున్నారు. అలాగే రాష్ట్రంలో తాజా రాజకీయాలపై కూడా ఆయన మోడీతో చర్చించే అవకాశం ఉంది. ప్రధాని మోడీతో సమావేశం తర్వాత.. తిరిగి వచ్చి అమరావతిలో జరిగే ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో లోకేష్ పాల్గొననున్నారు.

## వరద వణుకులో ఉత్తరాది

>> జకీర్ హుస్సేన్ రోస్ గార్డెన్ వద్ద వరద పరిస్థితి తీవ్రంగా ఉంది. పంచ్‌కులలో పాఠశాల విద్యార్థులు వెళ్తున్న వాహనంపై చెట్టు విరిగిపడి, పలువురికి గాయాలయ్యాయి. జమ్మూకశ్మీర్‌లో పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. ఎగువప్రాంతాల్లో వర్షాలు దంచికొడుతున్నాయి. అఖ్నూర్‌లో చీనాబ్ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. సమీపంలోని గర్ఖల్ గ్రామంలోకి భారీగా వరద చేరగా పెద్ద సంఖ్యలో ఇళ్లు నీట మునిగాయి. సుమారు 50 మంది వరదల్లో చిక్కుకోగా ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు కాపాడాయి. ఉధంపూర్‌లోని థార్డ్ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడి జమ్మూశ్రీనగర్ జాతీయ రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షాల కారణంగా హిమాచల్‌ప్రదేశ్‌లో పలుచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. ఆర్మీ, విదీళినీ, శీదీళినీ బృందాలు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. ఛత్తీస్‌గఢ్ బలరాంపుర్ జిల్లా ధనేష్‌పుర్ గ్రామంలో ఓ చిన్న డ్యామ్ కూలి ఆకస్మిక వరదలు సంభవించాయి. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు సహా నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ముగ్గురు గల్లంతయ్యారు. మరో ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటనపై ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణు దేవ్ సాయి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గల్లంతైన వారి కోసం గాలింపు కొనసాగుతోందని మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. గాయపడ్డ వారికి మెరుగైన చికిత్స అందించాలని.. అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా మంగళవారం రాత్రి లుత్తీ డ్యామ్‌కు వరద పోటెత్తి కొంత భాగం దెబ్బతిందని అధికారులు తెలిపారు. ఈ కారణంగా ఆకస్మిక వరదలు సంభవించి ప్రాణ నష్టం వాటిల్లినట్టు చెప్పారు. లుత్తీ డ్యామ్‌ను 1980వ దశకం ప్రారంభంలో నిర్మించారని, ఆకస్మిక వరదల వల్ల డ్యామ్‌కు సమీపంలోని ఇళ్లు, పంటపొలాలకు నష్టం వాటిల్లినట్టు తెలిపారు. వరదలతో అతలాకుతలం అవుతున్న జమ్మూకశ్మీర్, పంజాబ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలకు వెంటనే ప్రత్యేక సహాయక ప్యాకేజీ ప్రకటించాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోడీని కోరారు. ఇళ్లను, తమ కుటుంబాలను రక్షించుకునేందుకు ప్రజలు పడుతున్న ఇబ్బందులు చూస్తుంటే బాధగా ఉందని ఓ వీడియో విడుదల చేశారు. ప్రజలను రక్షించటం ప్రభుత్వ బాధ్యత కాదా అని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పంజాబ్‌లో వరదలు భారీ నష్టాన్ని కలిగించాయని రాహుల్ అన్నారు. జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో కూడా పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం సాయం రాష్ట్రాలకు అత్యంత అవసరమని చెప్పారు.

## కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం

**విజయవాడ,సెప్టెంబరు4,ప్రభాతవార్తప్రతినిధి:** వాయవ్య బంగాళాఖాతంలో ఉత్తర ఒడిశా తీరానికి సమీపంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. తీవ్ర అల్పపీడనం...పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ గురువారం నాటికి ఉత్తర ఒడిశా,ఝార్ఖండ్,ఛత్తీస్‌గఢ్ మీదుగా పయనించే అవకాశముందని భారత వాతావరణ విభాగం పేర్కొంది. వీటి ప్రభావంతో గురువారం రాష్ట్రం లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు,మిగిలిన ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురవచ్చని తెలిపింది. సముద్రం అలజడిగా మారిన నేపథ్యంలో శుక్రవారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్ళరాదని అమరావతి వాతావరణ కేంద్రం,విపత్తుల నిర్వహణ సంస్థలు పేర్కొన్నాయి. అనకాపల్లి,విశాఖపట్నం, కాకినాడ, విజయనగరం, పార్వతీపురం,మన్యం,ఏలూరు తదితర జిల్లాలలో బుధవారం తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసాయి. అత్యధికంగా సాయంత్రం ఆరుగంటల వరకు అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో 54 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

## జిఎస్టీ సంస్కరణలు దసరా గిఫ్ట్

>>ప్రయాణాలుచేయడం కూడా మధ్యతరగతికి భారంగా ఉండేదని, హోటల్ గదులపై 14శాతం సుంకాలు వేసారన్నారు. ఎయిర్‌కండిషనర్లు, టెలివిజన్, ఫాన్ ఇలా అన్ని అవసరమైన ఉత్పత్తులపైనా 31శాతం పన్నులు వేసిన అంశాన్ని గుర్తుచేసారు. 2014కి ముందు రైతుల వ్యవసాయం చేయడమే కష్టంగా ఉండేదని, వారికి లాభాలు చాలా తక్కువగా వచ్చేవన్నారు. ఎందుకంటే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తులనుంచి భారీ మొత్తం పన్నులు, సుంకాలు వసూలుచేసిందన్నారు. ఇపుడు హేతుబద్దీకరణ ద్వారా జిఎస్టీ కేవలం రెండే రెండు శ్లాబులు తెచ్చామని, అవి ఐదుశాతం, 18శాతంగా ఉంచినట్లు చెప్పారు. సామాన్యులు వాడుకునే 90శాతం ఉత్పత్తులన్నీ ఐదుశాతంలోనే ఉన్నాయని, మిగిలిన ఉత్పత్తులను 18శాతంలో ఉంచినట్లు ఆయన గుర్తుచేసారు. ప్రాణాధారమందులు, జీవితబీమా, ఆరోగ్యబీమా, ప్రాణాధార మందులు, ఆహార ఉత్పత్తులు, డెయిరీ ఉత్పత్తులు బ్రెడ్ వంటి వాటినికూడా పన్నురహితంచేసినట్లు చెప్పారు. ఈ దీపావళి ప్రజలకు డబుల్ బొనాంజా తెచ్చిందని అన్నారు. నవరాత్రి మొదటిరోజునుంచే ప్రజలు కొత్తజిఎస్టీ ప్రయోజనాలు పొందుతారన్నారు. వచ్చే ధన్‌తేరస్ కూడా ప్రజలకు గుడ్‌న్యూస్‌చెపుతుందని స్వతంత్ర భారతావనిలో ఇది అత్యంత పెద్ద ఎత్తున చేపట్టిన సంస్కరణ అనిమోడీ చెపుతూ విపక్షాల విమర్శలకు చెక్‌పెట్టారు. ఎనిమిదేళ్ల తర్వాత ఇపుడు తగ్గించాలని జ్ఞానోదయం అయిందని ఎఐసిసి అధ్యక్షుడు ఖర్గే, ఎనిమిదేళ్ల తర్వాత గుర్తుకువచ్చిందా అంటూ కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం వంటినేతలు చేసిన విమర్శలకు మోడీ చెక్‌పెట్టారు. హటాత్తుగాచేపట్టిన నిర్ణయాల వెనుక ఆంతర్యం ఏమిటని దేశంలో అనేక సమస్యలు చుట్టుముడుతుండగా అర్జంటుగా జిఎస్టీ సంస్కరణలపైనే ఎందుకు ఫోకస్‌పెంచారన్నారు. కేవలం బీహార్ ఎన్నికలకోసమే ఇలాంటి నిర్ణయాలు అమలుచేస్తున్నారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ విధించిన 50శాతం సుంకాలను భర్తీచేసుకోడానికే ఈ చర్యలు అంటూ విమర్శించిన సంగతి తెలిసిందే.

# తురకపాలెంకు కదిలిన అధికార యంత్రాంగం

>> తెలుసుకోవడం జరుగుతుందన్నారు. చనిపోయిన బాధిత కుటుంబ సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీర పాండియన్ బదులిస్తూ ప్రభుత్వం నుండి చనిపోయిన వారి మెడికల్ బిల్స్ తీసుకుని సీయంఆర్ఎఫ్ ద్వారా చెల్లించడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ మాట్లాడుతూ తురకపాలెం గ్రామంలో గత రెండు నెలలుగా మరణాలు ఎక్కువగా వున్నాయని , ప్రభుత్వం మెడికల్ టీం ను పంపి గ్రామంలో ఎంత మంది చనిపోయారు , ఏ వ్యాధి కారణంతో చనిపోయారు , ఏఏ ఆసుపత్రులలో చికిత్స తీసుకున్నారు తదితర అంశాలపై నివేదిక తీసుకోవడం జరిగిందన్నారు. జనాభా ప్రాతిపదికన సంభవించే సహజ మరణాల కన్నా జూలై , ఆగష్టు మాసాలలో ఎక్కువ మరణాలు సంభవించినందున ఇందుకు గల కారణాల అన్వేషణ కోసం జీజీహెచ్ , గుంటూరు మెడికల్ కళాశాల నుండి డాక్టర్స్ ను నియమించడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు 14 టీములను జనరల్ మెడిసిన్ , బయోకెమిస్ట్రీ , పాథాలజీ , మైక్రో బయోలాజీ , తదితర ఆరు విభాగాల నుండి బృందాలను నియమించడం జరిగిందన్నారు. వీరితో పాటు రెగ్యులర్ మెడికల్ స్టాఫ్ , ఆశా వర్కర్లను కూడా నియమించడం జరిగిందన్నారు. ఈ టీములన్ని ఈ నెల రెండవ తేదీ నుండి గ్రామంలో ఇంటింటికి మరియు మెడికల్ క్యాంప్ వద్ద సర్వే చేపట్టడం జరుగుతున్నదన్నారు. గ్రామంలో 870 గృహాలు వున్నాయని , ఇప్పటి వరకు 400 గృహాలను సర్వే చేయడం జరిగిందని , మిగిలిన గృహాలను రెండు రోజులలో సర్వే పూర్తి చేయడం జరుగుతుందన్నారు. మరణాలు ఇక్కడే ఎక్కువగా ఎందుకు జరుగుతున్నాయో మల్టీ డిపార్ట్మెంట్ ఎనాలసిస్ చేపట్టడం జరుగుతున్నదన్నారు. వాటర్ శాంప్లిల్స్ టెస్టింగ్ కు ఇవ్వడం జరిగిందని , కెమికల్ ఎనాలసిస్ రిపోర్ట్ సాధారణంగానే వుందన్నారు. బ్యాక్టీరియ లాజికల్ రిపోర్ట్ అందవలసి వుందన్నారు. సాయిల్ టెస్ట్ కూడా చేపట్టడం జరిగిందన్నారు. మరణాలకు గల కారణాలు తెలియాలంటే మూడు రోజులు సమయం పడుతుందన్నారు. గ్రామంలో ఎవరికైతే జ్వరం వుంటుందో వారికి బ్లడ్ కల్చర్ , యూరిన్ కల్చర్ పరీక్షలు నిర్వహించడం జారుగుతుందన్నారు. గ్రామంలో శానిటేషన్ పై యంపీడీఓలు, డీపీఓ సిబ్బందితో ఏర్పాటు చేసిన టీములు గ్రామస్తులతో కలసి గ్రామంలోని డ్రైన్స్ , ఖాళీ స్థలాలను శుభ్రం చేసేలా అవగాహన కల్పిస్తున్నాయన్నారు. గ్రామంలోని మహిళలు కొన్ని సమస్యలను తన దృష్టికి తీసుకురావడం జరిగిందని , వారు కోరిన విధంగానే బోరు వాటర్ బయటకు పంపకుండా గ్రామంలోనే వినియోగించేలా చూడాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. అదే విధంగా బెల్ట్ షాప్ లపై ఎక్సైజ్ , పోలీసు శాఖ వారిని అప్రమత్తం చేయడం జరుగుతుందని , నిబంధనలకు విరుద్ధంగా వ్యహరించే వారిపై కేసులు నమోదు చేయడం జారుగుతుందన్నారు. మూఢనమ్మకాలపై ప్రజల్లో వున్న భయాలను పోగొట్టేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. క్వారీ నుండి ఏర్పడే పొల్యూషన్ ను అధ్యయనం చేయడానికి టీమును ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. చనిపోయిన వారికి సంబంధించి మెడికల్ బిల్స్ చెల్లింపుకు సీయంఆర్ఎఫ్ కు పంపడం జరుగుతుందన్నారు. సోషల్ మీడియా , పత్రికలలో ప్రజలను భయాందోళనకు గురి చేసే విధంగా నిరాధార వార్తలు వ్యాప్తి చేయకుండా వుండాలని కోరుతున్నానన్నారు. ఈ పర్యటన కార్యక్రమంలో ఆర్ డి ఓ కె.శ్రీనివాస రావు , జెడ్ పీ సీఈఓ జ్యోతిబసు , డియం అండ్ హెచ్ ఓ డా. విజయలక్ష్మీ , జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డా. శ్రావణ్ బాబు , డిపిఓ నాగసాయి కుమార్ , గుంటూరు పశ్చిమ మండల తహశీల్దార్ వెంకటేశ్వర్లు గ్రౌండ్ వాటర్ , మెడికల్ , పంచాయితీ శాఖ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

**తురకపాలెంలోని మరణాల కారణాలపై సమగ్ర అధ్యయనం చేయాలి-మంత్రి శ్రీ సత్యకుమార్**

**విజయవాడ,సెప్టెంబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** ఉన్నతాధికారులకు మంత్రి సత్యకుమార్ ఆదేశాలుసర్వైలెన్స్‌ఖి వ్యవస్థను పటిష్ఠం చేయాలి,తురకపాలెం మరణాలపై మంత్రి సమీక్ష.. గుంటూరు రూరల్ మండలం తురకపాలెంలోని మరణాలకు దారితీసిన కారణాలను సమగ్రంగా పరిశీలించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. సాధారణ సరళికి భిన్నంగా జులై నుంచి సెప్టెంబరు 3వ తేదీ మధ్య 23 మరణాలు జరిగినప్పుడు.. అప్రమత్తం కావడంలో వెనకబడకూడదన్నారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం మంత్రివర్గ సమావేశం ప్రారంభానికి ముందు తురకపాలెంలో మరణాలపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్, డీఎంఈ డాక్టర్ రఘునందన్ లతో మంత్రి సమీక్ష జరిపారు. గుంటూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ ల్యాబ్ నుంచి వచ్చే బాధితుల రక్త నమూనాల పరీక్షల ఫలితాలకు అనుగుణంగా త్వరలో తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## ప్రభుత్వ న్యాయవాదుల పారితోషికంపై స్పష్టత

**విజయవాడ,సెప్టెంబరు4,ప్రభాతవార్తప్రతినిధి:** కోర్టు ధిక్కరణ కేసుల్లో అధికారుల తరపున వాదనలు వినిపించిన ప్రభుత్వ న్యాయవాదులకు జీపీకి చెల్లించే పారితోషికం రెమ్యూనరేషన్ విషయంలో స్పష్టతనిస్తూ ప్రభుత్వం బుధవారం జిఓ జారీ చేసింది. కోర్టు ధిక్కరణ కేసుల్లో ఎంత మంది ప్రతివాదులు,అధికారులు ఉంటే అంతమంది తరపునా జీపీలు వేర్వేరుగా వకాలత్‌లు దాఖలు చేసినట్లు,ఒక్కో అధికారికి రూ.5వేల చొప్పున రెమ్యూనరేషన్ చెల్లించాలంటూ కొన్ని శాఖల నుంచి క్లెయింలు వస్తున్నాయని ప్రభుత్వం పేర్కొంది. ఆయా కేసుల్లో ముఖ్య శాఖకు సంబంధించిన అధికారి విషయంలోనే జిపి పారితోషికం చెల్లిస్తారని, ఎంతమంది ప్రతివాదులు ఉంటే వారందరికీ కాదని స్పష్టం చేసింది. బహుళ చెల్లింపులను నిలువరించేందుకు,చెల్లింపుల్లో ఒకే విధానాన్ని అనుసరించేందుకు...కోర్టు ధిక్కరణ కేసులలో సంబంధిత శాఖ...క్రియాశీలక మైనది,ముఖ్య మైనది అని తెలుపుతూ మిడిల్ లెవల్ ఆఫీసర్ హోదాకు తగ్గని అధికారి సర్టిఫికేషన్ ఇవ్వాలని పేర్కొంది. ఈ విధానాన్ని అన్ని శాఖలూ పాటించాలని స్పష్టం చేసింది.



## జిఎస్టీ శ్లాబ్‌లు తగ్గిస్తూ కేంద్రం నిర్ణయంపై సిఎంచంద్రబాబు హర్షం

**విజయవాడ,సెప్టెంబరు4,ప్రభాతవార్తప్రతినిధి:** జీఎస్టీ స్లాబ్‌లు తగ్గిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. జీఎస్టీ స్లాబ్ లను మారుస్తూ తీసుకువచ్చిన సంస్కరణల్ని స్వాగతిస్తున్నట్లు ట్వీట్ లో సీఎం పేర్కొన్నారు. నిత్యావసరాలు, విద్యా, ఆరోగ్యరంగం, వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించిన పన్నులు గణనీయంగా తగ్గుతాయన్న సీఎం ఈ నిర్ణయం పేదలకు వరంగా, అభివృద్ధి కారకం. సమాజంలోని వేర్వేరు వర్గాలకు ప్రత్యేకించి రైతుల నుంచి వ్యాపారుల వరకూ ప్రయోజనం కలుగుతుందనీ పేర్కొన్న ముఖ్యమంత్రి విప్లవాత్మక నిర్ణయం తీసుకున్న ప్రధాని నరేంద్ర మోదీ గారికి, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గారికి అభినందనలు తెలియచేస్తున్నాననీ ట్వీట్ లో పేర్కొన్న ముఖ్యమంత్రి పౌరులకు ఉపకరించేలా తీసుకున్న ఈ నెక్స్ట్ జనరేషన్ జీఎస్టీ సంస్కరణలు పన్నుల వ్యవస్థను వ్యూహాత్మకంగా మార్చడంతో పాటు ప్రతీ భారతీయుడి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తాయనీ స్పష్టం చేసిన సీఎం చంద్రబాబు జీఎస్టీ స్లాబ్ లను మారుస్తూ తీసుకువచ్చిన సంస్కరణల్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. ఫలితంగా నిత్యావసరాలు, విద్యా, ఆరోగ్య రంగం, వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించిన పన్నులు గణనీయంగా తగ్గుతాయని చెప్పారు.ఈ నిర్ణయం పేదలకు వరంగా, అభివృద్ధి కారకంగా ఉంటుందని చంద్రబాబు పేర్కొన్నారు. సమాజంలోని వేర్వేరు వర్గాలకు, ప్రత్యేకించి రైతుల నుంచి వ్యాపారుల వరకూ ప్రయోజనం కలుగుతుందని చెప్పారు.. జీఎస్టీ స్లాబ్స్ తగ్గిస్తూ విప్లవాత్మక నిర్ణయం తీసుకున్న ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కి అభినందనలు తెలియచేస్తున్నట్లు చంద్రబాబు పేర్కొన్నారు. జీఎస్టీ కౌన్సిల్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా పవన్ కళ్యాణ్ ట్వీట్ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం నాడు ఎర్రకోట నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ సవరణలపై ఇచ్చిన హామీని నెరవేర్చిందని ఉద్ఘాటించారు. ఇప్పుడు జీఎస్టీ భారాన్ని తగ్గించడం ద్వారా తదుపరి తరం సంస్కరణలను ముందుకు తీసుకువచ్చిందని తెలిపారు పవన్ కల్యాణ్. పేదలు, మధ్యతరగతి ప్రజలు, రైతుల ఆరోగ్య సంరక్షణకు ఇది గణనీయమైన ఉపశమనమని చెప్పుకొచ్చారు. విద్య, బీమాపై జీఎస్టీని పూర్తిగా తొలగించడం వల్ల ప్రజలకు భారం లేకుండా ఉంటుందని వెల్లడించారు. పేదల భవిష్యత్తును మరింత వృద్ధి చేయడాన్ని తాను ప్రత్యేకంగా స్వాగతిస్తున్నానని పేర్కొన్నారు పవన్ కల్యాణ్.

జీఎస్టీపై కేంద్ర ప్రభుత్వం చేసిన సంస్కరణలు (బిళీగి ట్ట్టుట్టు) కోట్ల కుటుంబాల కష్టాలను తగ్గిస్తాయని కొనియాడారు. ప్రజల సంక్షేమంపై స్పష్టమైన దృష్టితో ఈ సంస్కరణలను తీసుకు వచ్చినందుకు ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## రైల్వే వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి : జిఎం ఎస్‌కె శ్రీవాత్సవ



రైల్వే జోనల్ వినియోగదారుల సమావేశంలో మాట్లాడుతున్న జీఎం ఎస్‌కె శ్రీవాత్సవ

**గుంతకల్లు రైల్వే, సెప్టెంబరు 4,ప్రభాతవార్త** రైల్వే వినియోగదారుల సమస్యల పరిష్కారానికి దక్షిణ మధ్య రైల్వే అహర్నిషలు కృషి చేస్తుందని జనరల్ మేనేజర్,జెడ్ఆర్‌యూసిసి చైర్మన్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవ,డిప్యూటీ జనరల్ మేనేజర్,కార్యదర్శి ఉదయ్‌నాథ్ కోట్లలు అన్నారు. రైల్ నిలయంలో నిర్వహించిన 76వ జోనల్ రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో ఏపి రాష్ట్రానికి చెందిన ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి, అమలాపురం ఎంపి జీఎం హరీష్ బాలయోగి,సభ్యులు రవి అగర్వాల్,కె నాగేశ్వర్ రావు, ఎ వెంకట రంగయ్య తో పాటు మరో 17మంది సభ్యులు,దక్షిణ మధ్య రైల్వేకి చెందిన వివిధ విభాగాల ప్రధాన అధిపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవ, కార్యదర్శి ఉదయ్‌నాథ్ కోట్లలు సమావేశంలో ప్రారంభ ఉపన్యాసం చేస్తూ రైల్వే జోన్ సాధించిన విశేష పనితీరును వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దక్షిణ మధ్య రైల్వే తొలి ఐదు మాసాల్లో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఒరిజినేటింగ్ రెవెన్యూను రూ.8,593కోట్ల స్థూల ఆదాయాన్ని అర్జించామని తెలిపారు. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 60.4మిలియన్ టన్నుల సరుకు రవాణా చేయడంతో పాటు నిర్మాణంలో ఉన్న నూతన రైలు మార్గాలు మినహా వందశాతం విద్యుదీకరణ పూర్తి చేసామని,దక్షిణ మధ్య రైల్వే మీదుగా మొత్తం 6532రూట్ కి.మీలలో 4655రూట్ కి.మీలకు భారతీయ రైల్వేల స్వదేశీ ఆటోమేటిక్ రైలు రక్షణ వ్యవస్థ అయిన కవచ్ తాజావర్షన్ 4.0మంజూరు చేయబడిందన్నారు. మౌలిక సదుపాయాల కల్పన,అనుసంధానం పెంపు గురించి వివరిస్తూ ప్రత్యేక శ్రద్ధతో మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేశామని కాజీపేట-బల్హార్షా, కాజీపేట-విజయవాడ, విజయవాడ- గూడూరుల మధ్య ట్రిప్లింగ్ రైలు మార్గాలు చివరి దశలో ఉన్నాయన్నారు. జోన్‌లో 78స్టేషన్లలో సిసిటివి నిఘా వ్యవస్థ ఏర్పాటు, మరో 453స్టేషన్లకు ప్రతిపాదనలు జరుగుతున్నాయి. స్టేషన్ పునరాభివృద్ధి,ప్రయాణికుల సౌకర్యాలు, అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద 119స్టేషన్ల పునరాభివృద్ధి జరుగుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ బేగంపేట, కరీంనగర్,వరంగల్లు స్టేషన్లను మే 2025లో ప్రారంభించారని తెలిపారు. ప్రయాణికులకు అధునాతన సౌకర్యాలను అందించడంలో భాగంగా 208లిఫ్టులు, 92ఎస్కలేటర్లు ప్రస్తుతం పనిచేస్తున్నాయని, ఈ ఏడాది మరో 7లిఫ్టులు,4 ఎస్కలేటర్లను ప్రారంభించామని భద్రతా వేగవంతం చేశామని చెబుతున్నారు.

## పోటీ పరీక్షలకు హాజరయ్యే మైనార్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

### - మంత్రి ఎన్ఎండి ఫరూక్

**విజయవాడ,సెప్టెంబరు4,ప్రభాతవార్తప్రతినిధి:**ఎటీ పరీక్షలకు హాజరయ్యే మైనార్టీ అభ్యర్థులకు సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్ (సిఇడిఎం) ఆధ్వర్యాన ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. మెగా డిఎస్‌సిలో సిఇడిఎం ఆధ్వర్యాన శిక్షణ పొందిన 152 మంది ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైనట్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మైనార్టీ సంక్షేమశాఖ నేతృత్వంలో కేంద్ర, రాష్ట్ర స్థాయిలో భర్తీ చేసే వివిధ ఉద్యోగాలకు జరగబోయే పోటీ పరీక్షల కోసం సిద్ధమయ్యే మైనార్టీ విద్యార్థులకు ప్రముఖ కోచింగ్ సెంటర్లలో నైపుణ్యం కలిగిన సిబ్బందితో శిక్షణ ఇస్తున్నామన్నారు. మెగా డిఎస్‌సి పరీక్షలకు సిఇడిఎం పర్యవేక్షణలో 1,780 మంది మైనార్టీ అభ్యర్థులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఇందులో 1,200 మంది అభ్యర్థులు అర్హత కంటే ఎక్కువ మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. ఉచిత శిక్షణను సమర్థవంతంగా వినియోగించుకుని విజయం సాధించి ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన 152 మందిని ఆయన అభినందించారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఎక్కువ మందికి సులభంగా సేవలు చేరేందుకు ఆన్‌లైన్ విధానంలో శిక్షణ ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఈ సందర్భంగా మంత్రి తెలిపారు.

## నిమజ్జనోత్సవానికి కదిలిన వినాయకులు

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 4 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం గురువారం వినాయక నిమజ్జనోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. పట్టణంలోని సుమారు 400 ప్రాంతాల్లో వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. ఐదవ రోజు సుమారు 250 వినాయక ప్రతిమలను తెలుగుగంగ కాలవలో నిమజ్జనం చేసారు. గురువారం 9వ రోజు నిమజ్జనోత్సవానికి భారీ ఎత్తున ప్రధాన వినాయకులను నిమజ్జనానికి తరలింపు కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. ముఖ్యంగా బేరివారి మండపం వద్ద వినాయకుని రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్ సారధ్యంలో ఏర్పాటు చేసారు. ఇక్కడ లోక కళ్యాణార్థం సోమవారం గణపతి హోమాలను, నవగ్రహశాంతి హోమాలను భారీ ఎత్తున నిర్వహించారు.గురువారం సాయంత్రం నుంచి పట్టణంలో కోలా హాలంగా మారింది. బేరివారి మండపం వద్ద ప్రతిష్ఠించిన హంసవాహనంపై వినాయకుని అలాగే ఎపెండ్డి మండపం వద్ద ఏర్పాటు చేసిన పంచముఖ వినాయకుడు, ముత్యాలమ్మ గుడివీధిలోని కుమ్మరమిట్ట, సంతమైదానం, అలాగే మరి నాలుగుచోట్ల ఏర్పాటు చేసిన వినాయకులను నిమజ్జనానికి తరలించే కార్యక్రమాలు చేపట్టారు. ఇదో సందడిగా మారింది. మరి కొన్ని చోట్ల వినాయకులను 11వ రోజు నిర్వహించుటకు నిర్ణ యించారు. వినాయక నిమజ్జ నోత్సవం సందర్భంగా యువకులు తలలకు కాషాయం రిబ్బన్లు ధరించి డిజె సౌండ్స్ కు అనుకూలంగా నాట్యాలు చేస్తే స్టేప్‌లు వేసుకుంటూ ముందుకు సాగారు.జైబోలో గణపతి, గణపతి బొప్పా అంటూ నినాదాలు చేసుకుంటూ ముందుకు సాగారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో యువకులతో పాటు సంప్రదాయ నృత్యాలను వినాయక ప్రతిమల ముందు ఏర్పాటు చేసారు. ఇక డిజెలో గాయకులతో హుషారు కల్పించే సినిమా పాటలతో సాగించారు. ఓవైపు సంప్రదాయ కోలాటాలు, భజనలతో శ్రీకాళహస్తి పట్టణంలోని నాలుగుమాడావీధులు దద్దరిల్లి పోయాయి. ఇక ప్రతి వినాయకుని ఎదురుగా ప్రసాదాల వితరణ



అందించారు. బేరివారి మండపం వద్ద వినాయకుని రాష్ట్రబిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ ఉదయం నుంచి అక్కడే ఉండి వినాయక ప్రతిమను కదిలించే ముందు పూజలు నిర్వహింపజేసారు.

ఆయనతో శ్రీకాళహస్తి ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి డివైయస్‌పి నరసింహా మూర్తి వన్‌టౌన్ సిఐ డి.గోపి, మాజీ మున్సిపల్ చైర్మెన్ ముత్యాల పార్థసారధి,మాజీ కౌన్సిలర్ నాగమల్లి దుర్గా ప్రసాద్,రామిశెట్టి సాయి, ఢిల్లి,రాజు రెడ్డి మురళి,సుబ్రమణ్యం ఉన్నారు.

## పాణ్యం-నంద్యాల మధ్య రైళ్ల నిర్వహణకు సిఆర్ఎస్ గ్రీన్ సిగ్నల్

**గుంతకల్లు రైల్వే, సెప్టెంబరు 4,ప్రభాతవార్త** కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గుంటూరు-గుంతకల్లు డబ్లింగ్,విద్యుత్ రైలు మార్గంలో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో పాణ్యం-నంద్యాల మధ్య పూర్తి చేసిన 14.53కి.మీల డబ్లింగ్, విద్యుత్ రైలు మార్గాల ద్వారా రైళ్ల రాకపోకల నిర్వహణకు రైల్వే భద్రతా కమిషనర్ మాధవి పచ్చజెండా ఊపారు. తొమ్మిది దశల్లో చేపట్టిన ఈప్రాజెక్టును భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా పటిష్ఠంగా సమర్థవంతంగా నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేసి దక్షిణ మధ్యరైల్వే నిర్మాణాల విభాగం సరికొత్త రికార్డును నెలకొల్పింది. దీంతో కేంద్ర పౌరవిమానయాన శాఖకు చెందిన రైల్వే భద్రతా కమిషనర్ మాధవి బృందం ఈ నెల 1న పాణ్యం-నంద్యాల మధ్య కొత్తగా నిర్మించిన డబ్లింగ్,విద్యుత్ రైలు మార్గాలను విస్తృత తనిఖీలు నిర్వహించి పలు సలహా, సూచనలతో అంచెలంచెలుగా నిర్ణీత వేగంతో రైళ్లు నడిపేందుకు అనుమతించినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి.

## అశ్వవాహనంపై విహరించిన గణనాథుడు



స్వామివారి తిరుకళ్యాణంకు టీటీడీ తరపున నూతన పట్టువస్త్రసాలను తీసుకువస్తున్న చైర్మన్ దంపతులు

**కాణిపాకం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి ఉభయదేవేరులతో కలసి అశ్వవాహనంపై కాణిపాకం పురవీధుల్లో విహరిస్తూ భక్తులను అలరించారు. ఈకార్యక్రమానికి బొమ్మసముద్రం, తిరువణంపల్లె, చింతమాకులపల్లె, కారకాంపల్లె, గ్రామాదుల గోనుగుంట బలిజవంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఉభయదారులచే ఉదయం స్వామివారికి అష్టోత్తర శతకలశాలతో క్షీరాభిషేకం నిర్వహించారు. అలాగే రాత్రి సిద్ది బుద్ధి సమేత గణనాథుడు సర్వాలంకృతులై అలంకార మండపంలో వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ అర్చకస్వాముల పూజలందుకున్న అనంతరం రంగు రంగుల విద్యుద్దీపాలు, వివిధరకాల పుష్పాలతో దేదీప్యమానంగా అలంకరించిన అశ్వవాహనంపై అధిరోహించి మంగళవాయిద్యాలు, కోలాటాలు, చెక్కభజనలు వంటి సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనల నడుమ కాణిపాకం గ్రామ పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయహస్తం అందించారు. ఈసందర్భంగా భక్తులు నారికేళ కర్పూర హారతులతో మొక్కులను తీర్చుకున్నారు. కమనీయం వరసిద్దుని కళ్యాణం కాణిపాకం బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి స్వామివారికి తిరుకళ్యాణం కమనీయంగా అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి కాణిపాకం, తిరువణంపల్లె వణిగ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈమేరకు స్వామివారి తిరుకళ్యాణం నిర్వహించడానికి తల్లిదండ్రులైన శివపార్వతులు పగలు కాణిపాకం పురవీధుల్లో భిక్షాటన చేశారు. ఈసందర్భంగా అలంకృతులైన శివపార్వతులు మణికంఠేశ్వరాలయంలో అర్చకసా వ్ముల పూజలందుకున్న అనంతరం కాణిపాకం,కాకర్లవారిపల్లె గ్రామ పురవీధుల్లో ఊరేగుతూ తమ పుత్రుడు వరసిద్దుని తిరుకళ్యాణానికి భిక్షాటన చేశారు. అనంతరం రాత్రి ప్రధాన ఆలయంలోని అలంకార మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసి, దేదీప్యమానంగా అలంకరించిన కళ్యాణ వేదికపై సిద్ధి, బుద్ధి, సమేత గణనాథుని ఉత్సవమూర్తులను వుంచి ఆలయ అర్చకులు వేదపండితుల మంత్రోచ్చరణ నడుమ అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అలాగే నూతన వధూవరులైన సిద్ధి, బుద్ధి గణనాథులకు పుణ్యాహావాచనం, కంకణదారణ, యజ్ఞోపవీతం గావించి స్వామివారికి పాదపూజ చేశారు.

అనంతరం అశేష భక్తజనం నడుమ స్వామివారిచే ఉభయదేవేరులకు మాంగల్యాదారణ చేశారు. అనంతరం స్వామి అమ్మవార్లు తలంబ్రాలు పోసుకునే కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

## పోలవరం పునరావాస కాలనీల మౌలిక వసతులకు రూ.739 కోట్లతో టెండర్లు

### - మంత్రి నిమ్మల రామానాయుడు



**విజయవాడ,సెప్టెంబరు4,ప్రభాత వార్తప్రతినిధి:** పోలవరం పునరావాస కాలనీల ఇళ్ల నిర్మాణాలు, మౌలిక వసతుల కల్పన కోసం రూ.739 కోట్లతో టెండర్లు పిలిచామని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. పోలవరం నిర్మాణంతోపాటు భూసేకరణ, పునరావాసం పనులకు సమ ప్రాధాన్యమివ్వాలని అధికారులను ఆయన ఆదేశించారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ, పోలవరం పునరావాస పనులపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా నిమ్మల మాట్లాడుతూ.. వర్షాకాలం, భారీ వరదల్లో సైతం డివాటరింగ్ చేస్తూ పోలవరం పనులు జరుగుతుండటంపై విదేశీ నిపుణులు సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. బట్రస్ డ్యామ్‌తో ఎగువ కాఫర్ డ్యామ్ సీపేజ్‌ను కంట్రోల్ చేసి పనులు చేయగలుగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్యాప్‌రాక్‌పిల్ పనులపై సంతృప్తిని వ్యక్తం చేస్తున్నట్లు, అదే సమయంలో మోడల్ డ్యామ్‌ను పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఏజెన్సీతోపాటు స్వయంగా ఇరిగేషన్‌శాఖ ఏర్పాటు చేసిన క్వాలిటీ కంట్రోల్ లేబరేటరీ, నాణ్యత పరికరాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. పోలవరం ఎడమ, కుడి కాల్వల కనెక్టవిటీస్‌కు గ్యాంట్రీస్ సంఖ్యను పెంచి 2026 జూన్ కల్లా పూర్తి చేసేలా ముందుకు వెళ్తున్నట్లు వెల్లడించారు. ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు తరలించేలా పోలవరం ఎడమ ప్రధాన కాల్వ పనులు వేగంగా జరుగుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు. జాతీయ రహదారుల క్రాసింగ్ దగ్గర వంతెనల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఇరిగేషన్ స్పెషల్ సెక్రటరీ జి సాయిప్రసాద్, ఆర్‌అండ్‌ఆర్ కమిషనరు రామ్‌సుందర్‌రెడ్డి, అడ్వైజరు వెంకటేశ్వరరావు, ఇఎన్‌సి నరసింహమూర్తి, ఎస్‌ఇ, ఇఇలు, ఏజెన్సీ ప్రతినిధులు హాజరయ్యారు.

# తిరుమల సమాచారం

## ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.1కోటి విరాళం



**తిరుమల,సెప్టెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న పలు ట్రస్ట్‌లలో ఒకటైన ఎస్వీప్రాణదాన ట్రస్ట్‌కు ఏకంగా ఓ దాత కోటిరూపాయలుపైగా విరాళం అందించాడు. తూర్పుగోదావరిజిల్లా వెలివెన్నుకు చెందిన శశి విద్యాసంస్థల అధినేత రవికుమార్ బురుగుపల్లి సంస్థ తరపున గురువారం ఉదయం ఈ భారీ మొత్తాన్ని అందజేశాడు. టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడును ఆయన క్యాంపు కార్యాలయంలో కలసిన శశివిద్యాసంస్థల అధినేత రవికుమార్ దంపతులు 1,01,11,111 రూపాయలు విరాళాల డిడిని అందజేశాడు. ఈ సందర్భంగా దాతను ఛైర్మన్ అభినందించారు.

## శ్రీవారి చెంత తెలంగాణ సిఎస్ రామకృష్ణరావు



**తిరుమల,సెప్టెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** తెలంగాణరాష్ట్రంనూతన ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కె.రామకృష్ణరావు గురువారం సాయంత్రం తిరుమలకు చేరుకున్నారు. ఇక్కడ పద్మావతి అతిదిగృహాల సముదాయంలో ఆయనకు టిటిడి వసతికల్పన విభాగం సాదర స్వాగతం పలికింది శుక్రవారం ఉదయం ఆయన శ్రీవారి దర్శనం చేసుకుంటారు.

## శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు మాజీ జడ్జి జాస్తి చలమేశ్వర్



**తిరుమల,సెప్టెంబర్ 4ప్రభాత వార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామిని గురూవారం ఉదయం నైవేద్య విరామ సమయంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ కుటుంబసభ్యులతో కలసి దర్శించుకున్నారు. కుటుంబంతో కలసి వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో శుభాలు: ప్రముఖులు



**తిరుమల,సెప్టెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ శుభాలు కలగాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని దేవుని ప్రార్ధించినట్లు సినీనటులు తెలిపారు. గురువారం ఉదయం సినీనటుడు వరుణ్‌సందేశ్ కుటుంబంతో కలసి, సినీనటి శ్వేతపరాశర్ తిరుమలకు చేరుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్‌లో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు

### - రాజకీయవ్యాఖ్యలు, రీల్స్ నిషేధమంటూ టిటిడి సూచన




**తిరుమల,సెప్టెంబర్ 4ప్రభాత వార్తప్రతినిధి:** కలియుగ వైకుంఠం తిరుమల పుణ్యక్షేత్రం పవిత్రతను కాపాడటంలో భాగంగా ఆలయం ముందు పరిసరాల్లోగానీ తిరుమలలో రాజకీయ వ్యాఖ్యలు చేయడం,అభ్యంతరకరమైన రీల్స్‌చేసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్‌చేయడం నిషేధిస్తూ టిటిడి హెచ్చరించింది. అంతేగాక ఏకంగా ఈ నిబంధనలు పాటించాలని భక్తులకు,ప్రముఖులకు, రాజకీయనేతలకు విజ్ఞప్తి చేస్తూ ఆలయం ముందు ఏకంగా సూచనలతో రూపొందించిన బోర్డులను ఏర్పాటు చేశారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోబడుతుందని హెచ్చరిక చేశారు. తిరుమల ఆలయ పవిత్రతను కాపాడటంలో ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోంది. అంతేగాక కొండపైభగవన్నామస్మరణ తప్ప మరెలాంటి పదం వినిపించకూడదని సిఎం చంద్రబాబు తనదైన శైలిలో తెలిపారు. ఈ నేపథ్యంలో గతనెలలో వైసిపికి చెందిన కడపజిల్లా నేత,వైఎస్ జగన్ మేనమామ రవీంద్రనాథరెడ్డి రాజకీయ వ్యాఖ్యలు చేయడం పెద్ద దుమారం రేపింది. దీనిపై టిటిడి కూడా తీవ్రంగానే పరిగణించింది. ఈ నేపథ్యంలో తిరుమలకు వచ్చిన రాజకీయప్రముఖులు, నాయకులు, ఇతరులు ఎవరూ కూడా రాజకీయంగా వ్యాఖ్యలు చేయరాదని, మరీ సామాజిక మాధ్యమాల్లో రీల్స్ కూడా నిషేధించినట్లు టిటిడి తెలిపింది. ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించి తిరుమల పవిత్రతను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

## ఎల్లుండి శ్రీవారి ఆలయం మూత

**తిరుమల,సెప్టెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** సంపూర్ణచంద్రగ్రహణం కారణంగా 7వతేదీ ఆదివారం 12గంటలు పాటు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని మూసివేస్తున్నారు. 7వతేదీ సాయంత్రం 3.30గంటల నుండి 8వతేదీ వేకువజామున 3గంటల వరకు ఆలయ తలుపులు మూసివేసి అన్ని దర్శనాలను రద్దుచేశారు. సెప్టెంబర్ 7వతేదీ రాత్రి 9.50గంటలకు చంద్రగ్రహణం ప్రారంభమై 8వతేదీ వేకువజామున 1.31గంటల వరకు పూర్తవుతుంది. సాధారణంగా గ్రహణ సమయానికి 6గంటల ముందుగా ఆలయం తలుపులు మూసివేయడం ఆనవాయితీ. సెప్టెంబర్ 8న తెల్లవారుజామున 3గంటలకు ఆలయం తలుపులు తెరచి శుద్ధి, పుణ్యాహవచనం నిర్వహిస్తారు. అనంతరం తోమాలసేవ, కొలువు, పంచాంగశ్రవణం, అర్చన సేవలను ఏకాంతంగా జరుపుతారు. ఆరోజు ఉదయం 6గంటలకు శ్రీవారి భక్తులకు స్వామివారి దర్శనం పునఃప్రారంభమవుతుంది. ఆదివారం ఆలయంలో ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టిటిడి రద్దుచేసింది.

## అక్టోబరు నుంచి సిబిటిలో రైల్వే కారుణ్య నియామకాల పరీక్షలు

### - అక్రమాలకు చెక్ - సాధ్యసాధ్యాలను పరిశీలిస్తున్న రైల్వే

**గుంతకల్లు రైల్వే, సెప్టెంబరు 4,ప్రభాతవార్త** ప్రస్తుతం రైల్వేలో జరుగుతున్న కారుణ్య నియామకాలకు సంబంధించిన వ్రాతపరీక్షల నిర్వహణపై వస్తున్న ఆరోపణలను చెక్ పెట్టేందుకు అక్టోబరు నుంచి దక్షిణ మధ్య రైల్వే సిబిటి(ఆన్‌లైన్)పద్ధతిలో వ్రాత పరీక్షలను నిర్వహించేందుకు సాధ్యసాధ్యాలను పరిశీలిస్తున్నట్లు అభిజ్ఞ వర్గాల సమాచారం. కారుణ్య నియామకాలకు సంబంధించి సమగ్ర సమాచారం వివరాలను ఆయా వెల్ఫేర్ ఇన్స్పెక్టర్లు తాము సేకరించిన తాజా సమాచారాన్ని వాటికి సంబంధించిన పత్రాలను అప్‌లోడ్ చేసి డివిజన్,జోన్‌కు సంబంధించిన పిసిపిఓ/జనరల్ మేనేజర్‌లకు ఈ ఆఫీస్ ద్వారా పంపాల్సి ఉంటుంది. దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో మొత్తం 664కారుణ్య నియామకాలకు సంబంధించిన దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి. డివిజన్‌లలో వివిధ కారణాలతో తిర స్కరించిన దరఖాస్తులకు సంబంధించిన వాటిని మూసివేయాలని ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. జోన్ మొత్తంలో 101కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

వార్త

ఐకమత్యం ద్వారా చిన్న చిన్న రాజ్యాలు అభివృద్ధి చెందుతాయి. కాని విభేదాలు జనిస్తే పెద్దపెద్ద దేశాలే సర్వనాశనమౌతాయి.

-టాల్‌స్టాయ్

# ధర్నాలతో సామాన్యులు విలవిల!

ఎంకిపెల్లి సుబ్బిచావుకు వచ్చినట్లుంది ఎందరో నాయకులు ఆత్మబలిదానంతో నిర్విరామకృషితో సాధించిపెట్టిన సమ్మె, రాస్తా రోకో, ధర్నాలు వంటి నిరసన కార్యక్రమాలు కొన్నిసార్లు సామాన్యుల జనజీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ఏ నిబంధనలు అంటూ లేకుండా ఎవరికి వారు ఎక్కడపడితే అక్కడ అప్పుడు ఈ కార్యక్రమాలు చేపడుతుండడంతో సాధారణ ప్రజలు అల్లాడిపోతున్నారు. అపరిష్కృతంగా తమ సమస్య పరిష్కారం కోసం ఒక నిర్దిష్ట కార్యక్రమం ప్రకారం ముందు తెలిపి సమ్మెలు, ధర్నాలు రాస్తారోకోలు నిర్వహించడంలో కొంత అర్థముంది. అందుకు అన్ని వర్గాలు సహకరించాల్సిన అవసరం ఉంది. అదికూడా చర్చల ద్వారా తమ సమస్యలు పరిష్కారం కానప్పుడు, మరో దారి లేనప్పుడు సమ్మె మార్గాన్ని ఎంచుకోవడంలో తప్పుపట్టలేం. కానీ చెప్పాపెట్టకుండా ఆకస్మికంగాఇలాంటి కార్యక్రమాలు చేపడితే సామాన్య ప్రజలు ఎంతటి ఇబ్బందులకు గురవుతున్నారో పట్టించుకోకపోవడం అత్యంత బాధాకరం. ఎవరికి ఏ సమస్యలు వచ్చినా రోడ్లమీదకు వచ్చేస్తున్నారు. రాకపోకలను స్తంభింప చేస్తున్నారు. గంటల తరబడి రోడ్ల మీదనే గడపడం ప్రయాణికులు తట్టుకోలేకపోతున్నారు. ఆస్పత్రిలో సరైన చికిత్స అందలేదనో, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు పెరిగాయనో ఇక రకరకాల కారణాలతో ఎవరికి ఏ ఇబ్బంది వచ్చినా పది, ఇరవై మంది గుమ్మిగూడి రాకపోకలు స్తంభింప చేయడం మామూలైపోయింది. నగరాల్లోనే కాదు పట్టణాల్లోనూ కాదు, చివరకు పల్లెల్లో కూడా రోడ్డుకు అడ్డంగా వస్తున్నారు. పోలీసు స్టేషన్‌లో దౌర్జన్యం జరిగిందని, ఆ పోలీసు అధికారిపై చర్య తీసుకోవాలని ఆ మధ్య ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు మూడుగంటలసేపు గ్రామస్తులు వాహనాలకు అంతరాయం కలిగించారు. ఇలా దేశవ్యాప్తంగా రాస్తారోకోలకు అంతేలేకుండాపోతున్నది. ఇందువల్ల ప్రయాణికులు ఎంత బాధపడుతున్నారో వారు గ్రహించడం లేదు. ముఖ్యంగా ఆస్పత్రికి వెళ్లే రోడ్డు సకాలంలో చేరుకోలేక వైద్యసహాయం అందక ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. ప్రతి సమస్యకు సమ్మె రాస్తారోకోలు చేస్తే తప్ప ప్రభుత్వ దృష్టిని ఆకర్షించలేమనే నమ్మకం రానురాను పెరిగిపోతుండడంతో ఈ పరిస్థితులు దాపురిస్తున్నాయి. అసలు ప్రభుత్వాలు సకాలంలో చర్యలు తీసుకొని సమస్య పరిష్కారంవైపు అడుగులు వేస్తే ఇటువంటివి జరిగే అవకాశాలుండవు. తాజాగా తెలుగు రాష్ట్రాల్లో ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి యూరియా అవసరం ఉందనే విషయం పాలకులకు తెలియందికాదు. కొరత లేకుండా చూసుకుంటామని హామీ కూడాఇచ్చారు. కానీ తీరా వరినాట్లు అన్నీ పూర్తయి యూరియా వేయాల్సిన తరుణంలో అధికారులు చేతులెత్తేశారు. దీంతో పలు రాష్ట్రాల్లోనూ ముఖ్యంగా తెలంగాణలో రైతులు రాత్రింబవళ్లు వేచిచూసి చివరకు ఎక్కడికక్కడ రాస్తారోకోలకు దిగారు. అన్నదాతలు ఎలాంటి సమస్యలు వచ్చినా తమలోతాము బాధపడడం తప్ప ఇతరులకు ఇబ్బంది కలిగించే చర్యలు సహజంగా చేపట్టరు. కానీ వారు కూడా ఇప్పుడు ధర్నాలకు దిగారు. ఇలా రాస్తారోకోలు, ధర్నాలు చేస్తే తప్ప తమ సమస్యలవైపు పాలకపెద్దలు దృష్టి సారించరనే నమ్మకం వారిలో కూడా ఏర్పడింది. ఏదిఏమైనా ధర్నాలు, రాస్తారోకోలు రానురాను పెరిగిపోతున్నాయి. పేద, మధ్య తరగతి ప్రజల్లో వీటిపట్ల అసహనం కూడా పెల్లుబుకుతున్నది. ఈ సమ్మెలు, నిరసన కార్యక్రమాల ఆవిర్భావానికి ఎంతో సుదీర్ఘచరిత్ర ఉంది. ఎన్నో పోరాటాల అనంతరం మరెందరో మహానుభావుల అవిరామకృషి, తాగ్యాలతో ఈ సమ్మె, నిరసన కార్యక్రమాలు చేపట్టే హక్కు లభించింది. ఆనాటి సమ్మెలకు, నిరసన కార్యక్రమాలకు ప్రజల మద్దతు ఉండేది. ఎలాంటి కార్యక్రమాలు చేపట్టినా సాధ్యమైనంతవరకు ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూసుకునేవారు. కొందరు ఈ హక్కులను సద్వినియోగం చేసుకోవడం లేదేమోననిపిస్తున్నది. ఇక పార్టీల గురించి చెప్పాల్సిన పనిలేదు. అధికారంలో ఉన్నప్పుడు ఒకతీరు, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరొక తీరుగా వ్యవహరిస్తున్నాయి. వ్యక్తిగత సమస్యలతో కూడా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇది గ్రామాలకు కూడా పాకింది. గ్రామాల్లో వీధి లైట్లు వెలగడం లేదనో, మురికి కాలువలు శుభ్రం చేయడం లేదనో రోడ్లపైకి వచ్చేస్తున్నారు. అందువల్ల ప్రయాణికులు పడుతున్న కష్టాలను, ఇబ్బందులను పట్టించుకోవడం లేదు. చివరకు ఇంటి నుంచి బయలుదేరిన వారు గమ్యానికి చేరడానికి ఎంత సమయం పడుతుందో ఏ రాస్తారోకోలో ఇరుక్కుపోతారో, ఆ తర్వాత ట్రాఫిక్ ఎంతసేపటికి క్లియర్ అవుతుందో చెప్పలేని దుర్భర పరిస్థితుల్లో హైదరాబాద్ నగరవాసులు అల్లాడుతున్నారు. ముఖ్యంగా అత్యవసరంగా ఆస్పత్రికి వెళ్లేవారు, సుదూర ప్రాంతాలకు వెళ్లేందుకు ఎంతో ముందుగా టిక్కెట్లు బుక్ చేసుకొని సకాలంలో రైల్వేస్టేషన్‌కు చేరుకోవాలని తపనపడుతున్నవారు. విమానప్రయాణికులు, కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, విద్యాలయాలకు వెళ్లే విద్యార్థులు అన్నింటికంటే ముఖ్యంగా పరీక్షల కాలంలో విద్యార్థులు పడుతున్న టెన్షన్ అంతా ఇంతా కాదు. ఒకరేమిటి రాస్తారోకోలో ఇరుక్కొని లక్షలాది మంది పడే మానసిక ఒత్తిడి వర్ణనాతీతం. సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయడంలో ఏమాత్రం తప్పులేదు. కాని దానికో పద్ధతి ఉండాలి. దాన్ని ఆచరించాలి. అంతేకాని తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తామనడం సమంజసం కాదు. ప్రజలను ఇబ్బంది పెట్టడం ఏ రకంగా న్యాయం కాదు. పెద్దలందరూ విజ్ఞతతో ఆలోచించాల్సిన తరుణమిది.

ఉపన్యాసకుడైనా, రచయిత అయినా తన భావాల్ని సంక్షిప్తీకరించడం నేర్చుకోగలిగేంత వరకూ విజయం సాధించలేడు.



ఎమర్సన్

ఎక్కువ తక్కువలు, కుల, మత భేదాలు ఉండటం మానవ జాతికి అవమానకరం.



మహాత్మా గాంధీ

## ప్రజావాక్కు



### జాగ్రత్తే రక్షణ

ఇటీవలి కాలంలో పెట్టుబడుల పేరుతో జరుగుతున్న సైబర్ మోసాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్‌లో వెలుగులోకి వచ్చిన కొన్నికేసులు డిజిటల్ ప్రపంచంలో మనం ఎంత అప్రమత్తంగా ఉండాలో గుర్తుచేస్తున్నాయి. మోసగాళ్లు ప్రముఖ ఆర్థిక సంస్థల పేర్లు వాడి సోషల్ మీడియాలో నకిలీ ప్రకటనలు పెడుతున్నారు. ఆకర్షణీయమైన లింకుల ద్వారా వాట్సాప్ గ్రూపులకు చేర్చి, పెట్టుబడులు పెట్టమని ప్రోత్సహిస్తున్నారు. ప్రారంభంలో చిన్న మొత్తాలు వెనక్కి ఇవ్వడం ద్వారా నమ్మకం కలిగించి, ఆ తర్వాత పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేసి ఖాతాలను బ్లాక్ చేస్తున్నారు. ఈ విధంగా అనేక మంది తమ కష్టార్జిత సొమ్మును కోల్పోతున్నారు. అధికారుల ప్రకారం అసలు ఆర్థిక సంస్థలు ఎప్పుడూ మూడో వ్యక్తుల ఖాతాలకు డబ్బు పంపమని అడగవు.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### వైద్యులకు సదుపాయాలు కల్పించాలి

వైద్యుడు మనిషి ప్రాణం కాపాడే దేవుడు. ఆ అవకాశం అందరికీ రాదు. వైద్యవిద్య తర్వాత ఉన్నత పట్టా పొందిన వారికి సీనియారిటీ, మెరిట్ ప్రకారం వైద్యుల ఖాళీలు గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో కూడా ఉండొచ్చు. ఆ పోస్టులకువారిని నియామకం జరిగినప్పుడు పట్టణ ప్రాంతాల్లో ఉన్నసదుపాయాలు అక్కడ ఉండవు. కావున ఆ విధి నిర్వ హణ ఒక అవకాశంగా తీసుకొని, యవ్వనంలో ఆ ప్రజలకు సేవచేసే భాగంగా వారు తమ సేవలను అందించి ప్రజల మన్ననలు పొందాలి. సదుపాయాలను సరిబెట్టుకోవటం మన అవగాహన, ఓపికమీదే ఉంటుంది.

- బొల్లోజు మేఘానాథం, విశాఖపట్నం

### విధుల పట్ల నిర్లక్ష్యం

రాష్ట్రంలో గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారుల్లో విధుల పట్ల పూర్తిగా నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం నిత్యం పత్రికావార్తల్లో చోటు చేసుకుంటున్నాయి. మరో వైపు అసలు కోర్టు ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తున్నారు. ఈజాడ్యం అన్ని శాఖలకు విస్తరించింది. కొంతమంది అధికారులు ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావడానికి కావాలని తప్పుడు నిర్ణయాలు చేస్తున్న వైనాలు వెలుగు చూస్తున్నాయి. ప్రభుత్వంఇలాంటివారిని డిస్మిస్ చేయాలి.

- కె.రామారావు, నల్గొండజిల్లా

### అమెరికా వాగుడుకి ఎస్.సి.ఓ. విరుగుడు

ఏ దేశం అభివృద్ధి చెందాలన్నా భద్రత, శాంతి, స్థిరత్వం, కీలకమని, మానవత్వానికే పెనుసవాలుగా ఉన్న ఉగ్రవాదం, వేర్పాటువాదంపై ఐక్యంగా పోరాడాలని, పరస్పర మన్నన, విశ్వాసం, సున్నితత్వంప్రాతిపదికన సంబంధాలను పెంచుకునేందుకు కట్టుబడాలన్న భారత్ పిలుపు, ఆర్థిక అభివృద్ధిపై కేంద్రీకరించి, ప్రత్యర్థులుగా కాకుండా భాగస్వాములుగా ఉండాలని, ఇరు దేశాల సంబంధాలు మరింతగా వృద్ధి చెందాలన్న చైనా ఆకాంక్ష పరస్పర ప్రాధాన్యతలకు అద్దంపట్టేవే. ప్రచ్ఛన్నయుద్ధ మానసిక స్థితి నుంచి బయటపడాలని, అంతర్జాతీయ సంబంధాల్లో అదిరించే, బెదిరించే ఎత్తుగడలు, కూటముల ఘర్షణలు సాగవని, మనదేశంసంయమనంతో వ్యవహరిస్తున్నా, అంతర్గత వ్యవహారాల్లోతలదూర్చుతూ తరచూ వాచాలత్వం ప్రదర్శిస్తున్న ట్రంప్, అమెరికా వాణిజ్య సలహాదారు పీటర్ నవారో లాంటి వారిని ఈ పరిణామాలు మరింత కలవరపెట్టేవే.

-డా.దన్నాన అప్పలనాయుడు, చీపురుపల్లి

### విద్యార్థులపై ఒత్తిడి పెంచకండి

ప్రభుత్వ పాఠశాలలు, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలను ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలు నిర్వహించాలి. వాటి నిర్వహణ తీరును చూసి ప్రభుత్వ అనుమతితో, ఎలాంటి లాభాపేక్ష లేకుండా నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్ హెక్టార్లలో నడపబడుతున్న ప్రైవేటు కార్పొరేట్ స్కూల్స్ ప్రభుత్వం విధిస్తున్న మార్గదర్శకాలు విధిగా పాటించాలి. కానీ అందుకు విరుద్ధంగాఈరోజుల్లో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు తీరును ప్రభుత్వ పాఠశాలల్లో కళాశాలల్లో విద్యార్థిని విద్యార్థుల మీద ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు మీద రుద్దాలని ఉన్నతాధికారులు చూడడం సరైనదికాదు. ఎక్కువ సమయం పాఠశాలలో ఉండాలని, యూట్యూబ్లో వెబినియార్లు చూపించాలని చెబుతూ ఉన్నారు. దీనివల్ల ఎలాంటి ప్రయోజనం లేదు.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### మూర్ఛ అనేది వైకల్యం కాదు

మూర్ఛ అనేది వైకల్యంకాదు అని కేంద్రప్రభుత్వం స్పష్టం చేయడం సంతోషకరం. తెలంగాణ రాష్ట్రంలో మూర్ఛ పేరుతో వైకల్యం పేరుతోఆసరా పెన్షన్‌లను రద్దుచేయాలి. ప్రభుత్వం నుండి పొందిన రుణాలను వారి వ్యక్తిగత రుణాలుగా పరిగణించి వాయిదా పద్ధతిలో చెల్లించేవిధంగా ప్రభుత్వం చూడాలి. మూర్ఛ వ్యాధి పేరుతో ఉన్నవారికి వైద్య పరీక్షలు నిర్వహించాలి.

-రాపాక రవీందర్, జనగాం

మన వి — ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# నేర్పించాలంటే నేర్చుకోవాల్సిందే!

**తరగతి గదుల్లోనే భావి భారత పౌరుల భవిష్యత్తు తీర్చిదిద్దబడుతుందన్న విషయం తెలిసిందే. వారి భవితకు రూపకల్పన చేయడం ఒక్క గురువుకే సాధ్యపడుతుంది. గురుదేవోభ! ఈ మాట గురువులకు సంతరించిన దివ్యత్వాన్ని, మానసా వాచా కర్మణా తైత్తరీయ ఉపనిషత్తులో వ్యక్తీ కరించిన అంశం. విద్యా బోధనతోబాటు సదవగాహన కల్పించే విధేయత, వినయశీలత, నైపుణ్యశుద్ధి, విజయ కాంక్ష, వినయశీలత, దయ సానుభూతి, సహానుభూతి విధి నిర్వహణలో పటిష్ట ప్రమాణాలు పాటించాల్సిన తరుణం. మానవతా విలువలు మటు మాయమవుతున్న తర్ణుణంలో విద్యార్థులను తులసి మొక్కలుగా పెంచి సమాజానికి పనికి వచ్చే వ్యక్తులుగా తయారు చెయ్యాలి. ఉన్నత ప్రమాణాలతో ఉత్తమ విద్యార్థులుగా తయారుచేయడంలో గురువులదే ప్రధాన బాధ్యత. బోధనా సరళిలో, శాస్త్రీయ సాంకేతిక పరిణామాలతో కూడిన అభ్యాసం నేడు ప్రతి విద్యార్థికి అవసరం. విద్యార్థులకు బోధనా పద్ధతులలో విస్తృత మార్పులు, కూర్పులు చేయాల్సి ఉంటుంది. అందులో ఉపాధ్యాయులకు తర్ఫీదు నివ్వాలి.**



పరిమి శ్యామలా రాధాకృష్ణ

స్వయంకృషితో గురువై, ఉత్తమ గురువై, అంచెలంచెలుగా ఉప రాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా ప్రథమ పౌరుని స్థానానికి ఎదిగి అందలాలు అందుకున్న కీర్తి శిఖరాయమానుడు సర్వేపల్లి రాధాకృష్ణన్ సెప్టెంబరు 5న జన్మించారు. ప్రతి ఏటా ఇదే రోజు ఆయన స్ఫూర్తిగా తన జీవిత కాలంలో సాధించిన సమున్నతఅధ్యాపక వృత్తికి, అభ్యున్నతికి ఆలంబనగా 'ఉపాధ్యాయ దినోత్సవం' జరుపుకోవడం ఆనవాయితీ. అదే గురుపూజోత్సవం వేడుక. ఆయన ప్రపంచానికే గురుతుల్యులు. సామాన్య కుటుంబంలోపుట్టిన ఆయన విద్యావేత్త, వేదాంతి కూడా. మానవ జీవితంలో సదాలోచనకు పునాదులు వేసేది తల్లితండ్రులైతే, వాటికి విజ్ఞాన పరిమళలందించి సదవగాహన కల్పించేది గురువే! ప్రతి విద్యార్థి మీద ఉపాధ్యాయుని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. తరగతి గదుల్లోనే భావి భారత పౌరుల భవిష్యత్తు తీర్చిదిద్దబడుతుందన్న విషయం తెలిసిందే. వారి భవితకు రూపకల్పన చేయడం ఒక్క గురువుకే సాధ్యపడుతుంది. గురుదేవోభ! ఈ మాట గురువులకు సంతరించిన దివ్యత్వాన్ని, మానసా వాచా కర్మణా తైత్తరీయ ఉపనిషత్తులో వ్యక్తీకరించిన అంశం. విద్యా బోధనతోబాటు సదవగాహన కల్పించే విధేయత, వినయశీలత, నైపుణ్యశుద్ధి, విజయ కాంక్ష, వినయశీలత, దయ సానుభూతి, సహానుభూతి విధి నిర్వహణలో పటిష్ట ప్రమాణాలు పాటించాల్సిన తరుణం. మానవతా విలువలు మటు మాయమవుతున్న తర్ణుణంలో విద్యార్థులను తులసి మొక్కలుగా పెంచి సమాజానికి పనికి వచ్చే వ్యక్తులుగా తయారు చెయ్యాలి. ఉన్నత ప్రమాణాలతో ఉత్తమ విద్యార్థులుగా తయారుచేయడంలో గురువులదే ప్రధాన బాధ్యత. బోధనా సరళిలో, శాస్త్రీయ సాంకేతిక పరిణామాలతో కూడిన అభ్యాసం నేడు ప్రతి విద్యార్థికి అవసరం. విద్యార్థులకు బోధనా పద్ధతులలో విస్తృత మార్పులు, కూర్పులు చేయాల్సి ఉంటుంది. అందులో ఉపాధ్యాయులకు తర్ఫీదు నివ్వాలి. ఇప్పుడు కృత్రిమ మేధ వంటి డిజిటల్ రంగంలోకి ప్రవేశించాం. బోధన ప్రమాణాల పెంపునకు ముందడుగు వేయాలి. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ వంటి విధానాల ద్వారా విద్యాబోధనలో మౌలిక మార్పులు తీసుకురావడం అవసరం. ఇందుకోసం ప్రభుత్వాలు కూడా బాధ్యత తీసుకోవాలి. అందుకు అనుగుణంగా ఉపాధ్యాయుల్లోనూ మార్పు రావాలి. మారిన, మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు బోధించేవారు కూడా నేర్చుకోవాలి. పరిణామం ఎంత సహజమో, అంతలా శాస్త్రీయ సాంకేతిక పరిణామాలతో బాటు నేడుఅందరినోట, అన్నిరంగాల్లో వేగంతో దూసుకుపోతుండగా, మరి మన ఉపాధ్యాయులు కూడా అందుకు సాటిగా తాము విద్యార్థులకు తమ బోధనా సరళిలో విస్తృత మార్పులు, కూర్పులు చేయడంలో తర్ఫీదు పొందాలి. ఒకప్పుడు డిజిటల్ ప్రపంచంలోకి ప్రవేశించడానికి ముందడుగువేయని గురువులు నేడు కాలరీత్యా ప్రావీణ్యులవుతున్నారు. పవర్పాయింట్ ప్రెసెంటేషన్‌తో చిన్నారులకు నేర్పే డిజిటల్ యుగమిది. మనం కూడా భాగస్థులం కావడం బోధనా ప్రమాణాలకు ముందుస్థానమే కాకుండా, ప్రభుత్వాలు చేయూతనిస్తే అంకిత భావంతో పనిచేయగలమని, 'తగ్గేదేలే' అని విద్యార్థుల్లో వ్యక్తిత్వం, గుణశీల లక్షణాయుత రేపటి పౌరులుగా నాయకత్వ లక్షణాలను రంగరించి పోషించగలమని, ఎవరికి వారు ప్రతిన పూనుకుంటే, మానవ యత్నానికి దైవకృపా కటాక్షాలు ఉంటాయి. పరిశోధనలో ఏఐ వినియోగాన్ని నైతికంగా అనుసరించాలి. ఇదొక నూతన ప్రక్రియ. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చేరడానికి, ప్రాశస్త్యంలోకి రావడానికి సమయం పడుతుంది. ఉపాధ్యాయులు విచక్షణతో ఆలోచించి, తమ స్వీయ మేధనుపయోగించి విద్యార్థి అవగాహనను బట్టి అత్యంత జాగురూకులై ఉండాలి. ఏది ఏమైనా నేటి విద్య విధానంలో గురువు పాత్ర అత్యంత కీలకమైనది. ఎందుకంటే గురువు శిష్యుల జీవితాలను, భవిష్యత్తును తీర్చి దిద్దడంలో నైపుణ్యాలు, విలువల సంక్రమణలో, నిరంతర అభ్యసన ప్రక్రియలో మార్గదర్శకులుగా వ్యవహరిస్తారు. మారుతున్న ప్రపంచంలో, అందులోనూ, నేటి అస్తవ్యస్త జీవన విధానం, కౌమారంలో శారీరక మార్పులు, హార్మోన్ల ప్రభావంతో యువత మానసిక ఆందోళనల, అలజడులు, స్థిమితత్వానికి బ్రేకులు పడేస్తుంటే, తల్లితండ్రులకు, గురు వులకు, చెప్పుకోలేని పరిస్థితిలో ప్రతికూల దారులు త్రొక్కి, వాళ్ల మాదకద్రవ్యాలకులోనై, పర్యవసానంగా సంఘ విద్రోహక చర్యలకు వెనుకంజ వేయని మాయలో తమ జీవిత గమ్యం ఇది అని స్పష్టత లేక, జన్మనిచ్చినవారు, తోబుట్టువులు, తాము చదివే విద్యాలయాలు, గురువులను ప్రక్కకు పెట్టి, భవితను కోల్పోతున్న నేటి మన దేశమే కాదు విశ్వమంతా యువత వనరులకు చెద చేరిందా, యువతను తొలిచివేస్తున్నదా? అన్నట్లుంది సమాజం. దీనికి ఎవరు బాధ్యులు? పాఠశాలల్లో తొమ్మిది, పది తరగతుల పిల్లలకు ప్రధాన ఉపాధ్యాయులు, వైద్యుని, మనస్తత్వశాస్త్రజ్ఞుని సహాయంతో కౌన్సిలింగ్, తల్లితండ్రులకు కూడా ఇప్పించాల్సిన బాధ్యత ముమ్మాటికీ గురువుదే. రాజ్యాంగబద్ధమైన స్ఫూర్తిని పెంపొందించి, ఆధునిక సాంకేతికతను (ఐసిటి) బోధనలో ఉపయోగించుకుని, అభ్యసనాన్ని సులభతరం చేయడం గురువు చేతుల్లోనే వుంది, కాకపోతే అంకితభావం తో వృత్తికి న్యాయం చేస్తున్నామా అన్న ఆత్మావలోకనం గురువులకు అవసరం! విద్యార్థుల పురోగతికి గురువు ఆలంబన, మద్దతు, ఆధారం, పునాది, ప్రాధమికత. అందుకు గురువుకు తనపై తనకు విశ్వాసమే ఆలంబన! వారికి పుర స్కారాలు, పారితోషికాలు నిష్పక్షపాతంగా ఉత్తమ ఉపాధ్యాయుల సన్మానించడం ఆనవాయితీ. యోగ, ధ్యాన సాధన, ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లి, సదాలోచనలు, చుట్టూ ఉన్న వారి, అక్కడి పరిస్థితులపై సదవగాహన, నిజాయితీ వైఖరిగల జీవనశైలి, దయ, ఇచ్చిపుచ్చుకోవడం, స్త్రీపట్ల గౌరవం, సహనం, స్వామీ వివేకానంద ఆశలు, ఆశయాలన్నీ మన యువతపైనే ఉండేలా చూడాలి. 'మనదేశ సంస్కృతి విశిష్టత అది అత్యున్నతమైన జీవిత ఆదర్శాలను సాధిం చడానికి, ప్రతీఒక్కరి అభిరుచి, మనస్తత్వం, ప్రతిభలకూ తగిన విధానాలను అందిస్తుంది. అంతర్గత ప్రశాంతతకు, శారీరక మానసిక ఆరోగ్యాలకు ఏవిద్య అయినా గురు సమ్ముఖంలో రాణిస్తుంది. కాబట్టి పాఠశాలల్లో, విశ్వవిద్యా లయాల్లో ధారణాశక్తికి, ఏకాగ్రతకు 'ధ్యానం'అన్నప్రక్రియ బోధనా సరళిలో ఒక భాగమైపోవాలి. వయస్సు మళ్ళిన వారికి కాదు, చిన్నతనం నుండే ప్రార్థన ప్రాముఖ్యత తల్లి దండ్రులతో ఆరంభం కావాలి ! ప్రభుత్వాలు కూడా గురువు స్థాయి, స్థితి, శిష్యుని స్థితిని పరిఢవిల్లేలా చేయడం బాధ్యత, కర్తవ్యం. తరగతులకన్నా పారిశుధ్యం, నిఘా, పర్యవేక్షణలు సర్వదా ఆవశ్యకం, విద్యాలయాలను గురువులను కర్తవ్య బద్ధులై నిర్వహణ లోపం లేకుండా మంచిప్రభుత్వాలుగా భారతమాత ముద్దుబిడ్డలను భావి నాయకులను చేయండి ! విద్యార్థుల్లో దేశం పట్లగౌరవం, అంకితభావం పెంచడం, దీనికి గురువే ఆలంబన, మూలస్తంభం, అని జాతీయ విద్యావిధానం 2020 ఆకాంక్షిస్తున్నది! గురుభ్యోన్నమః! గురువులకు పదవీచ్యుతి లేదు, స్థాన భ్రంశం లేదు, ఎన్ని నూతన పరిజ్ఞాన తెన్నులు విస్తరించినా, ఆచంద్రార్కము గురువులు నక్షత్రాలు, అజ్ఞాన తిమిరాన్ని తుడిచివేసే దివ్వెలు గురుబ్రహ్మలే. ●



నేడు సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి

# ఎఐ విప్లవం కొత్త యుగానికి నాంది

సాయికృష్ణ గుమ్మడిదారి

ఒకప్పటి కలలు ఇప్పుడు వాస్తవాలు అవుతున్నాయి. మనం ఊహించిన భవిష్యత్తు ఇప్పుడు మన కళ్లముందే రూపుదిద్దుకుంటుంది. మానవ చరిత్రలో ఎన్నో మార్పులు చూసాం. ఆదిమానవుడు నిప్పు కనుగొన్నటువంటి సమయం నుండి నేటి మానవుడు రూపొందించిన కృత్రిమ మేధస్సు వరకు ఎవరు ఊహించని మార్పులు చూసాం. ఈ కృత్రిమ మేధస్సు పరిజ్ఞానం మానవ బుద్ధిని అనుకరిస్తూ నేర్చుకుంటూ తనను తాను మెరుగుపరుచుకుంటూ అనేక రంగాల్లో అసాధారమైన వేగంతో విప్లవాత్మక మార్పులు తెస్తుంది. ఇది కేవలం ఒక సాంకేతిక ఆవిష్కరణ కాదు ఇది మన జీవన విధానాన్ని ఆలోచనలను నిర్ణయాలను అభివృద్ధి మార్గాన్ని సమూలంగా మార్చేస్తున్న శక్తి. ఇప్పుడు అన్ని రంగాలలో కృత్రిమ మేధస్సు విప్లవాలని సృష్టిస్తుంది. సాఫ్ట్‌వేర్ రంగం అనేది గత రెండు దశాబ్దాలుగా భారత దేశం వంటి దేశాలకు అభివృద్ధికి ప్రధాన నడిపిన శక్తి. కోడింగ్, డేటా ప్రాసెసింగ్, బాక్స్ ఫిక్సింగ్, డేటా ఎంట్రీ, క్లైంట్ సపోర్టింగ్ ఫోన్‌కాల్స్ అంటే విభిన్న పనులుపై ఆధారపడిన రంగం ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. ఈ మార్పు ఎంతో ఉన్నప్పటికీ ఉద్యోగాల భద్రతపై గంభీరమైన ప్రశ్నలు కూడా లేవనెత్తుతుంది. ఒకప్పుడు సాఫ్ట్‌వేర్ డెవలపర్ కావాలంటే అనేక భాషలు నైపుణ్యం అవసరం కానీ ఇప్పుడు పైలెట్ టూల్స్‌ని ఉపయోగించి ఏఐ కోడ్స్ సృష్టించడం మాత్రం చాలా సులభం. కొన్ని సందర్భాల్లో చిన్న మొబైల్ యాప్ పూర్తిగా ఏఐ సహాయంతో తయారవుతున్నాయి. వైద్యరంగంలో కూడా ఏఐ పాత్ర కీలకంగా మారింది. మానవాళి భద్రతకు కేంద్ర బిందువుగా మారింది. ఒకప్పుడు డాక్టర్ల కృషి, పరీక్ష పద్ధతులు, రోగి పరిచర్యలే వైద్యవ్యవస్థ నడిపించేది. కానీ ఇప్పుడు కృత్రిమ మేధస్సు ఈ రంగంలో నూతన అధ్యాయానికి నాంది పలికింది. ఇది ఆరోగ్య పరిరక్షణకు కొత్తదారులను తీసుకొస్తూ ప్రతి దశలో వేగాన్ని కచ్చితత్వాన్ని నమ్మకాన్ని పెంచుతుంది. మానవ తప్పిదాలను తగ్గించడంతోపాటు గ్రామీణ ప్రాంతంలో సైతం వైద్య సేవలను విస్తరించినందుకు ఈ సాంకేతికత ముఖ్య భూమిక పోషిస్తుంది. వైద్యుల పరిరక్షణలో పరీక్షల ద్వారా తెలియని అంశాలను ఏఐ ఆధారిత డయాగ్నెట్ స్టూల్స్ ఉచితంగా విశ్లేషించగలుగుతుంది. ఉత్పత్తి రంగంలో కూడా ఏఐ పాత్ర ఎక్కువగానే ఉంది. సమకాలీన పరిశ్రమలు ప్రొడక్షన్ రంగం సాఫీగా సమర్థవంతంగా నడవడానికి కృత్రిమ మేధస్సు ఎంతో కీలకపాత్ర పోషిస్తుంది. మానవ శ్రమను తగ్గించడమే కాక, ప్రతి దశలో ఖచ్చితమైన వేగవంతమైన సమాచారం అందించడం ద్వారా సంస్థల ఉత్పాదకత పెంచుతుంది. ప్రొడక్షన్ నుంచి లాజిస్టిక్స్ వరకు ఆర్థిక నిర్వహణ నుండి డేటా విశ్లేషణ వరకు ఏఐ ఆధారిత సాంకేతికత సంస్థల మరింత ఆధునికతవైపు దారితీస్తుంది. గతంలో మనుషులు చేతితో తయారు చేసిన స్టాక్ లెక్కింపు తప్పుడు గణనకు దారితీసేది. అయితే ఏఐ ఆధారిత సెన్సార్లు డివైస్ల ద్వారా నిల్వ ఉత్పత్తుల సంఖ్యను, వాటి వివరాలు రియల్ టైంలో తెలుసుకోవచ్చు. ఇది నిల్వ తగ్గించడం అధికంగా నిలువ పెట్టడం వంటి పొరపాట్లు నివారించి ఖర్చులను తగ్గిస్తుంది. ఉత్పత్తి దశలో ప్రగతి ఎటువంటి స్థాయిలో ఉందో ఏ ఆధారంగా సేకరించి తక్షణమే తెలుసుకోవచ్చు. సినిమా రంగంలో చలన చిత్రరంగంలో ఏఐ తెచ్చిన విప్లవాత్మక మార్పులు ప్రస్తుతం టెక్నాలజీ సామర్థ్యాలు పూర్తిగా తిరగరాస్తున్నాయి. సినిమాల రూపకల్పన నిర్మాణం ఎడిటింగ్, గ్రాఫిక్స్, డబ్బింగ్, నటీనటుల ముఖరూప సృష్టి మొదలైన విభాగంలో కృత్రిమ మేధస్సు ప్రభావం విపరీతంగా పెరిగింది. సినిమాల్లో గ్రాఫిక్స్ ఒక ముఖ్యమైన భాగం అయింది. వ్యాపార రంగంలో కృత్రిమ మేధస్సు కీలక పాత్ర పోషిస్తుంది. చిన్న స్టార్ట్ అప్స్ నుండి భారీ మల్టీనేషన్ కంపెనీ వరకు ఏఐఆధారిత టూల్స్ వాడి వ్యాపారాలమరింత సమర్థవంతంగా, ఖర్చు తగ్గిస్తూ మార్కెట్లో ముందంజలో నిలబడుతున్నారు. ●

# సూడాన్ విపత్తుకు బాధ్యులెవరు?


డి జయరాం

రెండువేల ఇరవైఐదు ఆగస్టు 31న సూడాన్‌లోని మారుమూల గ్రామం తరాసిన్‌లో జరిగిన ఘోర కొండచరియల విపత్తు, కేవలం ఒక ప్రకృతి వైపరీత్యం మాత్రమే కాదు. ఇది వాతావరణ మార్పు, అంతర్యుద్ధం, ప్రభుత్వాల నిస్సహాయ వైఖరివల్ల సంభవించిన ఒక విషాదపరిణామం. ఒకవారం పాటు కురిసిన భారీ వర్షాలు ఈ విపత్తుకు కారణమైనప్పటికీ, దాని తీవ్రత, దానిపై వచ్చిన స్పందనలు అంతర్జాతీయ, స్థానిక రాజకీయాల వైఫల్యాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయి. ఇలాంటి సంక్షోభాలను మనం ఎలా ఎదుర్కోవాలనే దానిపై ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. విపత్తుకు కారణాలు వర్షం, అంతర్యుద్ధం, నిస్సహాయత. తరాసిన్ గ్రామం విపత్తుకు గురికావడానికి శాస్త్రీయ కారణం స్పష్టంగా ఉంది. జెబెల్ మర్రా పర్వతంలోని తూర్పు వాలులలో ఒక వారం పాటు కురిసిన భారీవర్షాలు, అక్కడి నేలను, రాతి పొరలను పూర్తిగా తడిపివేసి, భారీగా కూలిపోవడానికి దారితీశాయి. ఇలాంటి ఘటనలువాతావరణ మార్పుల వల్ల ఇప్పుడు సాధారణం అవుతున్నాయి. అయితే, తరాసిన్ విషాదాన్ని ఇతర విపత్తుల నుండి వేరు చేసే ఒక ముఖ్యమైన అంశం ఉంది. అదే సూడాన్‌లో జరుగుతున్న అంతర్యుద్ధం. మర్రా పర్వతాలు ఒక తిరుగుబాటు గ్రూపు ఆధీనంలో ఉన్నాయి. ఈ రాజకీయ వాస్తవం సహాయక చర్యలకు పెద్ద ఆటంకంగా మారింది. ఈ ప్రాంతంలోని భద్రతా సమస్యలు ఐక్యరాజ్యసమితి, డాక్టర్స్ విత్‌ఔట్ బోర్డర్స్ వంటి అంతర్జాతీయ సహాయ సంస్థలు సంఘటన జరిగిన ప్రదేశానికి చేరుకోవడం కష్టతరం చేశాయి. ఇలాంటి విపత్తులు సంభవించినప్పుడు, రాజకీయ నాయకులుత్వరగా ప్రకటనలు చేసి ఇతరులపై నిందలు వేయడం సహజం. తరాసిన్ విషయంలో, ప్రాంతాన్ని పాలించే తిరుగుబాటు గ్రూపు మొదట విపత్తును వెల్లడించింది. వారి తక్షణ స్పందన, సహాయం కోసం పిలుపు అంతర్జాతీయ సమాజం దృష్టిని ఆకర్షించాయి. మరోవైపు, డార్ఫర్ సైన్యంఅనుసంధాన గవర్నర్, ఈ సంఘటనను 'మానవతా విషాదం'గా అభివర్ణించారు. కానీ ఈ ప్రకటనలు, సమస్యకు మూల కారణమైన రాజకీయ, భద్రతా అంశాలను పరిష్కరించలేకపోయాయి. తరాసిన్ విషాదం రాజకీయ మాటలకు, ఆచరణకు మధ్య ఉన్న లోతైన అంతరాన్ని బయటపెట్టింది. తిరుగుబాటు గ్రూపులు లేదా ప్రభుత్వ అధికారులు తరచుగా విపత్తు స్పందనలను వారి సొంత అజెండాల కోసం ఉపయోగిస్తారు. ఈ తిరుగుబాటు గ్రూపు తమ పాలనకు చట్టబద్ధతను, అంతర్జాతీయ మద్దతును పొందాలని ప్రయత్నిస్తే, సూడాన్ ప్రభుత్వం తమ అంతర్యుద్ధ పోరాటాన్ని దృష్టిలో ఉంచుకుని స్పందించే అవకాశం ఉంది. ఈ రాజకీయ ఆటలో బాధితులైన తరాసిన్ ప్రజలు కేవలం పావులుగా మిగిలిపోయారు. ఇలాంటి విపత్తుల నుండి బయటపడాలంటే, రాజకీయ నాయకులు, ప్రభుత్వాలు తమ విధానాలను మార్చుకోవాలి. కేవలం లక్షణాలను మాత్రమే కాకుండా, సమస్యలకు మూల కారణాలను పరి



ష్కరించే సమగ్ర విధానాలు అవసరం. తరాసిన్ విషాదం నుండి మనం నేర్చుకోవాల్సిన పాఠాలు చాలా ఉన్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారాలు కావాలంటే, కేవలం తాత్కాలిక సహాయక చర్యలు సరిపోవు. సూడాన్ దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన రాజకీయ అస్థిరత, అంతర్యుద్ధం, వాతావరణ మార్పుల ప్రభావాలను ఒకేసారి పరిష్కరించే వ్యూహాలు అవసరం. సూడాన్‌లో జరుగుతున్న అంతర్యుద్ధం, అత్యవసర సహాయక చర్యలకు అతి పెద్ద ఆటంకం. తరాసిన్ వంటి ప్రాంతాలకు చేరుకోవడానికి అంతర్జాతీయ సంస్థలకు సాధ్యం కావడం లేదు. ఇది ఒక తీవ్రమైన మానవతా వైఫల్యం. ఈ సమస్యను పరిష్కరించడానికి, ఐక్యరాజ్యసమితి, ఆఫ్రికన్ యూనియన్ వంటి సంస్థలు సూడాన్ సాయుధ దళాలు, రాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ తో చర్చించి, విపత్తు ప్రభావిత ప్రాంతాలలో సహాయం అందించడానికి తాత్కాలికంగా కాల్పుల విరమణను ఏర్పాటుచేయాలి. మానవతా సహాయం సురక్షితంగా ప్రజలకు చేరేలా ఒక తటస్థ, మూడవ పక్షం పర్యవేక్షణ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. ఇది తిరుగుబాటు గ్రూపులు, ప్రభుత్వ దళాల మధ్య నమ్మకాన్ని పెంచేందుకు తోడ్పడుతుంది. అలాగే, మర్రా పర్వతాల వంటి తిరుగుబాటు గ్రూపుల ఆధీనంలో ఉన్న ప్రాంతాలకు సహాయం అందించడానికి, రాజకీయ విభేదాలను పక్కన పెట్టి, ప్రజల ప్రాణాలను రక్షించడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. సూడాన్ తీవ్రమైన వాతావరణ మార్పుల ప్రభావాలకు గురవుతోంది. కరువులు, వరదలు, ఇప్పుడు కొండచరియల వంటి విపత్తులు సర్వసాధారణమవుతున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించడానికి, జెబెల్ మర్రా వంటి పర్వత ప్రాంతాలలో అడవుల నరికివేతను ఆపడానికి, నేల క్షీణతను నివారించడానికి పెద్దఎత్తున అటవీకరణ కార్యక్రమాలను చేపట్టాలి. స్థానిక మొక్కలను నాటడం ద్వారా నేల స్థిరీకరణను పెంచవచ్చు. అనూహ్యంగా కురుస్తున్న భారీ వర్షాల నుండి వచ్చే వరదలను నివారించడానికి, మెరుగైన జల నిర్వహణ వ్యవస్థలను, డ్రెయినేజీ నిర్మాణాలను ఏర్పాటు చేయాలి. అంతే కాకుండా, వాతావరణ మార్పుల వల్ల సంభవించే విపత్తుల గురించి ప్రజలకు ముందుగానే హెచ్చరించడానికి, గ్రామీణ ప్రాంతాలకు చేరువయ్యేలా సరళమైన, సమర్థవంతమైన సమాచార, హెచ్చరికవ్యవస్థలను ఏర్పాటుచేయాలి. సూడాన్ వంటి దేశాలలో ప్రభుత్వ, తిరుగుబాటు గ్రూపుల మధ్య సమన్వయం లేకపోవడంవల్ల విపత్తు నిర్వహణ చాలా బలహీనంగా ఉంది. దీనిని మెరుగుపరచడానికి, తిరుగుబాటు గ్రూపుల వంటి స్థానిక పాలక సంస్థలకు విపత్తు నిర్వహణ, సహాయక చర్యలపై శిక్షణఇవ్వడానికి అంతర్జాతీయ సంస్థలు సహాయం అందించాలి. ఇది ప్రజ లకు తక్షణ సహాయం అందించడానికి వీలుకల్పిస్తుంది. శిథిలాల నుండి మృతదేహాలను, ప్రాణాలతో ఉన్నవారిని వెలికితీయడానికి అవసరమైన భారీ యంత్రాలు, శోధన, రక్షణ పరికరాలను అందించాలి. చివరిగా ఐక్యరాజ్యసమితి వంటిసంస్థలు, సూడాన్‌కు ప్రత్యేకంగా విపత్తు నిర్వహణకు నిధులు సమీకరించాలి. ఈ నిధులను అవినీతికి తావు లేకుండా, నేరుగా సహాయక చర్యలకు ఉపయోగించాలి. తరాసిన్ గ్రామం ఒక విషాదకరమైన ఉదాహరణ. కానీ అది సూడాన్ భవిష్యత్తుకు ఒక మేల్కొలుపు కావాలి. రాజకీయ నాయకులు, తిరుగుబాటు గ్రూపులు, అంతర్జాతీయ సమాజం స్వార్థ ప్రయోజనాలను పక్కన పెట్టి, ప్రజల భద్రత, శ్రేయస్సును మొదటి ప్రాధాన్యతగా ఉంచినప్పుడు మాత్రమే ఇలాంటి విషాదాలు పునరావృతం కాకుండా ఆపగలం. ●

# భారత్, సింగపూర్ సంబంధాలు బలోపేతం



ప్రధాని మోడీతో సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ భేటీ

ఆధునిక సాంకేతికత దిశగా ఉభయదేశాల పయనం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** భారత్, సింగపూర్ మధ్య సంబంధాలు కేవలం దౌత్యపరమైన అంశాలకే పరిమితం కాదని, ఇరు దేశాల భాగస్వామ్యం సాంప్రదాయ రంగాలను దాటి అత్యాధునిక సాంకేతిక రంగాల వైపు శరవేగంగా విస్తరిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్‌తో కలిసి గురువారం న్యూఢిల్లీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇరుదేశాల మధ్య సంబంధాలు పరస్పర ప్రయోజనాలే లక్ష్యంగా, శాంతి, శ్రేయస్సు అనే ఉమ్మడి దార్శనికతతో ముందుకు సాగుతున్నాయని మోడీ అన్నారు. సింగపూర్ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత లారెన్స్ వాంగ్ భారత్‌లో పర్యటించడం ఇదే మొదటిసారి. ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 60 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ పర్యటనకు మరింత ప్రాధాన్యత లభించింది. ఈ సందర్భంగా ప్రధానిమోడీ మాట్లాడుతూ, 'భారత్ యాక్ట్ ఈస్ట్' విధానంలో సింగపూర్ ఒక కీలకమైన స్తంభం లాంటిది. ఇండోపసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం కోసం ఆసియాన్‌తో కలిసి పనిచేయడం కొనసాగిస్తాం" అని పేర్కొన్నారు. భవిష్యత్ భాగస్వామ్యం కోసం ఒక స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసినట్లు ప్రధాని వెల్లడించారు. ఇకపై సహకారం అధునాతన తయారీ, గ్రీన్ షిప్పింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్వాంటం టెక్నాలజీ, పట్టణ నీటి నిర్వహణ వంటి నూతన రంగాలకు విస్తరిస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా సింగపూర్ సహకారంతో చెన్నైలో నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ స్కిల్లింగ్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ కేంద్రం ద్వారా అధునాతన తయారీ రంగంలో అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను తీర్చిదిద్దు తామని వివరించారు. డిజిటల్ కనెక్టివిటీలో భాగంగా ఇప్పటికే విజయవంతమైన యూపీఐపేనౌ అనుసంధానంలో కొత్తగా మరో 13 భారతీయ బ్యాంకులు చేరినట్లు మోదీ తెలిపారు. ద్వైపాక్షిక సమగ్ర ఆర్థిక సహకార ఒప్పందంతో పాటు, ఆసియాన్‌తో ఉన్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని కూడా నిర్ణీత సమయంలో సమీక్షిం చాలని ఇరు దేశాలు నిర్ణయించాయని ఆయన పేర్కొన్నారు. గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీ ఇరు దేశాల స్టాక్ మార్కెట్లను కలుపుతూ ఒక వారధిగా నిలుస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ఆగ్నేయాసియాలో సింగపూర్ భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి అని, రక్షణ సంబంధాలు కూడా రోజురోజుకు బలపడుతున్నాయని ఆయన గుర్తు చేశారు.

## టారిఫ్‌ల కేసు విచారణ తక్షణమే జరపండి



### 'సుప్రీం'ను ఆశ్రయించిన అధ్యక్షుడు ట్రంప్

**వాషింగ్టన్, సెప్టెంబరు 4:** ప్రపంచ దేశాలపై ఇబ్బడిముబ్బడిగా పన్నులు విధించేందుకు బ్రేకులు పడుతుండటంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యంత్రాంగం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఫెడరల్ చట్టం ప్రకారం అధ్యక్షుడికి దిగుమతులపై సుంకాలు విధించే హక్కు ఉందని పేర్కొంటూ ఈ కేసును అత్యవసరంగా విచారణ జరపాలని కోరింది. ఎమర్జెన్సీ అధికార చట్టం ప్రకారం ట్రంప్ సుంకాలు విధించారని ఇటీవల అప్పీల్స్ కోర్టు తీర్పునిచ్చింది. ఆ సుంకాలు చట్ట విరుద్ధమని పేర్కొనడంతో ట్రంప్ యంత్రాంగం తాజాగా సుప్రీం తలుపుతట్టింది. దీనిపై గురువారం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. నవంబరు ప్రారంభంలోనే ఈ కేసుపై వాదనలు వినాలని సొలిసిటర్ జనరల్ డి.జాన్ సావర్ న్యాయమూర్తిని కోరారు. 'అప్పీల్స్ కోర్టు నిర్ణయం అధ్యక్షుడు ఐదు నెలలుగా విదేశాలతో కొనసాగిస్తున్న చర్చలను అనిశ్చితిలోకి నెడుతుంది. ఇప్పటికే పూర్తయిన చర్చలను, జరుగబోయే చర్చలను ప్రమాదంలో పడేస్తుంది' అని వ్యాఖ్యానించారు. ఈ వాదనను లిబర్టీ జస్టిస్ సెంటర్ వ్యాజ్య డైరెక్టర్, సీనియర్ న్యాయవాది జెఫ్రీ ష్వాబ్ తోసిపుచ్చారు. 'చట్టవిరుద్ధమైన సుంకాలు చిన్న వ్యాపారాలకు తీవ్ర హానీ కలిగిస్తున్నాయి. వాటి మనుగడ ప్రమాదంలో పడుతోంది. ఈ కేసులో మా క్లయింట్లకు సత్వరం పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నాం' అని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై వ్యాపారవర్గాలు ఇప్పటికే రెండు న్యాయస్థానాల్లో పైచేయి సాధించాయి. ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారీగా సుంకాలు విధించడంతో ప్రపంచ వాణిజ్యం వణికిపోయింది. అమెరికాతో దూరం పాటిస్తున్న దేశాలు, మిత్ర దేశాలు ధరలు పెరుగుతాయని, ఆర్థికవృద్ధి మందగిస్తుందని భయాందోళనకు గురయ్యాయి. అయినప్పటికీ ట్రంప్ వెనక్కి తగ్గకుండా పన్నులతో ఐరోపా యూనియన్‌పై ఒత్తిడి పెంచే ప్రయత్నం చేశారు. ప్రస్తుతం భారత ఉత్పత్తులపై అమెరికా 50 శాతం సుంకాలు వసూలు చేస్తోంది. దీనిపై తాజాగా ట్రంప్ మాట్లాడుతూ రష్యా నుంచి చమురు కొంటున్న భారత్‌పై ఇంకా పూర్తి స్థాయిలో ఆంక్షల మోత మోగించలేదని వ్యాఖ్యానించారు. ఇప్పటికే సెకండరీ సుంకాలను విధించానని, రెండు, మూడు విడతలను చేపట్టలేదని స్పష్టం చేశారు. సుంకాలతో అమెరికాను భారత్ చంపేస్తోందని ఆరోపించారు.



## సిసికెమెరాల పనితీరుపై సుప్రీం సుమోటో పిల్ విచారణ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** దేశ వ్యాప్తంగా ఉన్న పలు పోలీస్ స్టేషన్లలో సీసీటీవీ కెమెరాలు పని చేయకపోవటం లేదంటూ తాజాగా వెలువడిన వార్తా కథనాలపై సుప్రీంకోర్టు స్పందించింది. వెలువడింది. ఇందుకోసం సుమోటోగా పిల్‌ను స్వీకరించి సుమోటో పిల్ విచారణ చేపట్టడానికి సిద్ధమైంది. ఈ ఏడాది ఎనిమిది నెలల్లో ఒక్క రాజస్థాన్‌లోనే 11 పోలీస్ కస్టడీ మరణాలు సంభవించాయని బెంచ్‌లోని న్యాయమూర్తులు విక్రమ్ నాథ్, సందీప్ మెహతా వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే సమస్య తీవ్రతను పరిగణనలోకి తీసుకుని సుమోటోగా పిల్‌ను స్వీకరించినట్లు తెలిపారు. 2020లోనే కీలక ఆదేశాలు జారీచేసిన సుప్రీం కోర్టు వాటి అమలును పునఃపరిశీలనచేసింది. నైట్ విజన్, ఆడియో రికార్డింగ్ ఉన్న సీసీటీవీ కెమెరాలను మాత్రమే వాడాలని స్పష్టం చేసింది. సీసీటీవీ ఫుటేజీ రికార్డులను కనీసం 18 నెలలపాటు భద్రపరచాలని తెలిపింది. కస్టోడియల్ వేధింపులు, మరణాలకు సంబంధించిన దర్యాప్తు సమయంలో ఆ సీసీటీవీ కెమెరాల రికార్డులు అందుబాటులో ఉండేలాగా చూసుకోవాలని పేర్కొంది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పోలీస్ స్టేషన్లలో సీసీటీవీ కెమెరాల బాధ్యత రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలదే. సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా దేశవ్యాప్తంగా ఉన్న చాలా పోలీస్ స్టేషన్లు పని చేయని సీసీటీవీ కెమెరాలతోటే కాలం వెల్లదీస్తున్నాయి. కస్టోడియల్ వేధింపుల సమయంలో సీసీటీవీ ఫుటేజీలు లేక దర్యాప్తునకు ఆటంకం ఏర్పడుతోంది. కస్టోడియల్ వేధింపుల సమయంలో సీసీటీవీ ఫుటేజీలు లేకపోవటం, టెక్నికల్ సమస్యలు దర్యాప్తునకు ఆటంకం కలిగిస్తున్నాయని పోలీస్ ఎజెన్సీలు తరచుగా చెబుతూ ఉన్నాయి.

## పౌరసత్వం రాకముందే సోనియాకు భారత్‌లో ఓటు హక్కు


### ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో కేసు దాఖలు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ దిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో పిటిషన్ దాఖలైంది. సోనియా గాంధీ పేరును 1980లో ఓటర్ల జాబితాలో చేర్చారని, 1983లో ఆమె భారత పౌరసత్వం పొందారని పిటిషనర్ పేర్కొన్నారు. భారత పౌరసత్వం పొందే ముందు ఓటరు హోదాను పొందేందుకు నకిలీ పత్రాలను సృష్టించారని ఆరోపించారు. గురువారం అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ వైభవ్ చౌరాసియా పిటిషన్‌పై వాదనలు ఆలకించారు. ఆ తర్వాత సెప్టెంబర్ 10న తదుపరి విచారణకు ఆదేశించారు. ఈ పిటిషన్‌ను న్యాయవాది వికాస్ త్రిపాఠి దాఖలు చేశారు. 1983 ఏప్రిల్‌లో సోనియా భారత పౌరురాలు కావడానికి ముందే ఆమె ఓటు ఎలా వేయగలిగారనే దానిపై విచారణ చేయాలని కోరారు. సీనియర్ న్యాయవాదులు అనిల్ సోని, పవన్ నారంగ్ ఫిర్యాదుదారుడి తరపున హాజరయ్యారు. మొదట ఇటాలియన్ పౌరురాలు అయిన సోనియా గాంధీ 1983 ఏప్రిల్ 30న పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 5 కింద భారతీయ పౌరురాలు అయ్యారు. అయితే ఆమె పేరు 1981-82 నాటికే న్యూఢిల్లీ పార్లమెంటరీ నియోజకవర్గ ఓటర్ల జాబితాలో కనిపించింది. ఆ సమయంలో ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన పత్రాల గురించి ప్రశ్నలు తలెత్తాయి. 1982లో సోనియాతోపాటు ఆమె దివంగత మరిది సంజయ్ గాంధీ పేరును ఎన్నికల జాబితా నుంచి తొలగించారని న్యాయవాది నారంగ్ ఎత్తి చూపారు. అలాంటి తొలగింపు ఆమె మునుపటి ఓటర్ల జాబితాలో నమోదు సక్రమంగా లేదని సూచిస్తుందని తెలిపారు. ఎందుకంటే భారతీయ పౌరులు మాత్రమే ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి అర్హులు అని ఆయన వాదించారు. పిటిషన్ పత్రాలను ఉటంకిస్తూ, ఆమెకు పౌరసత్వం మంజూరు చేయడానికి ముందు నకిలీ లేదా తప్పుడు పత్రాలను ఉపయోగించి ఓటర్ల జాబితాలో చేర్చి ఉండవచ్చని ఆరోపించారు. ఒక ప్రభుత్వ అధికారిని తప్పుదారి పట్టించారని, మోసం జరిగినట్లు కనిపిస్తోందని కోర్టుకు తెలిపారు. పోలీసుల విచారణకు అర్హమైన కేసు, అది నేరమని ఆయన చెప్పారు. ఢిల్లీ పోలీసులు, సీనియర్ అధికారులను సంప్రదించినప్పటికీ, ఎటువంటి చర్య తీసుకోలేదని, పిటిషనర్ కోర్టును ఆశ్రయించడం తప్ప వేరే మార్గం లేదని ఆయన వాదించారు. అందువల్ల, ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఆరోపించిన నేరాలపై దర్యాప్తు కోసం దిశానిర్దేశం చేయాలని పిటిషనర్ కోరుతున్నట్లు తెలిపారు. 1985 అలహాబాద్ హైకోర్టు రాకేష్ సింగ్ వర్సెస్ సోనియా గాంధీ కేసులో ఇచ్చిన తీర్పుపై కూడా పిటిషన్ ఆధారపడి ఉందని చెప్పారు. 1983ఏప్రిల్ 30న రిజిస్ట్రేషన్ ద్వారా భారత పౌరురాలిగా మారిందని కోర్టు అప్పుడు తీర్పు ఇచ్చినప్పటికీ, ప్రస్తుత పిటిషన్ ఆ తేదీకి ముందు జరిగిన ఓటరు నమోదు చట్టవిరుద్ధమని అన్నారు. ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన పత్రాలను దర్యాప్తు చేయడానికి, రికార్డులను పరిశీలించడానికి పోలీసులను ఆదేశించాలని పిటిషనర్ కోర్టును కోరారు.

## ట్రంప్‌తో అలాస్కా చర్చలనే మోడీకి వివరించా..

### కారులో గుసగుసలపై స్పందించిన పుతిన్



**మాస్కో, సెప్టెంబరు 4:** షాంఘై సహకార సంస్థ సదస్సులో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఒకే కారులో ప్రయాణిస్తూ మాట్లాడుకున్న విషయం అప్పట్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఆ ఏకాంత భేటీలో వారిద్దరూ ఏం చర్చించుకున్నారనే దానిపై నెలకొన్న ఉత్కంఠకు పుతిన్ తాజాగా తెరదించారు. ఆ సంభాషణలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రస్తావన వచ్చినట్లు ఆయన వెల్లడించారు. చైనా పర్యటన ముగించుకున్న అనంతరం పుతిన్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఓ విలేకరి, మోడీతో కారులో జరిగిన సంభాషణ గురించి ప్రశ్నించగా, అందులో దాచిపెట్టాల్సిన రహస్యమేమీ లేదు. అలాస్కాలో డొనాల్డ్ ట్రంప్‌తో నాకు జరిగిన చర్చల గురించి ప్రధాని మోదీకి వివరించానని పుతిన్ స్పష్టం చేశారు. ఇటీవల ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించే అంశంపై పుతిన్, ట్రంప్ అలాస్కాలో సమావేశమయ్యారు. ఆ భేటీ వివరాలను కూడా పుతిన్ పంచుకున్నారు. ట్రంప్‌తో తన సంభాషణ కేవలం 30సెకన్ల పాటు బ్రోకెన్ ఇంగ్లీష్‌లోనే జరిగిందని తెలిపారు. 'ట్రంప్‌ను ఆరోగ్యంగా చూసినందుకు సంతోషంగా ఉందని ఆయనతో చెప్పానని పుతిన్ పేర్కొన్నారు. ఎస్‌సీవో సదస్సు సందర్భంగా పుతిన్ తన కాన్వాయ్‌తో వచ్చి, మోదీ కోసం దాదాపు పది నిమిషాలు వేచి చూశారు. అనంతరం మోదీని తన కారులోనే సదస్సు ప్రాంగణానికి తీసుకెళ్లారు. దాదాపు 45 నిమిషాల పాటు ఇరువురు నేతలు ఏకాంతంగా మాట్లాడుకున్నారని క్రెమ్లిన్ వర్గాలు అప్పట్లో తెలిపాయి. ఈ ప్రయాణం తర్వాత మోడీకూడా వేదికగా స్పందిస్తూ, పుతిన్‌తో చర్చలు ఎప్పటిలాగే అద్భుతంగా సాగాయని పేర్కొన్నారు. అమెరికా సుంకాల ప్రభావం ఎక్కువగా ఉన్న సమయంలో ఈ భేటీ జరగడం గమనార్హం.

## వారు ఏకమవుతున్నారు.. సిద్ధంగా ఉండండి

### పెంటగాన్‌కు యుఎస్ అధ్యక్షుడు ట్రంప్ ఆదేశాలు



**వాషింగ్టన్, సెప్టెంబరు 4:** చైనా అధినేత జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉత్తరకొరియా అధినేత జోంగ్‌ఉన్ ఒకే వేదికపై కనిపించడం అమెరికా అగ్రనేత ట్రంప్‌ను కలవరపాటుకు గురిచేసింది. అవసరమైతే చైనా, రష్యాలను అడ్డుకొనేందుకు సిద్ధంగా ఉండాలని పెంటగాన్‌ను ఆయన ఆదేశించారు. అమెరికా సేనల్లో భారీ స్థాయిలో మార్పులు చేయాలని సూచించారు. అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ ఓ ఛానల్‌తో మాట్లాడుతూ తనకు ట్రంప్ నుంచి ఈ మేరకు ఆదేశాలు వచ్చినట్లు అంగీకరించారు. మిలిటరీలో భారీ పునర్వ్యవస్థీకరణను చేపట్టనున్నట్లు వెల్లడించారు. అదేమీ యుద్ధం కోరుకుంటూ చేసేది కాదని వివరణ ఇచ్చారు. చైనా, రష్యా మరేదైనా దేశం విషయంలో తమ పాలసీ స్పష్టంగా ఉంటుందని పేర్కొన్నారు. బుధవారం బీజింగ్‌లో విక్టరీ డే పెరేడ్ సందర్భంగా చైనా ఆయుధ ప్రదర్శన తర్వాత ట్రంప్ తీవ్ర ఆరోపణలు చేశారు. చైనా, ఉత్తర కొరియా, రష్యా దేశాలు అమెరికాకు వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్నాయన్నారు. కానీ, అవి ఎటువంటివో మాత్రం ఆయన వెల్లడించలేదు. చైనాను విదేశీ పాలకుల నుంచి విడిపించడంలో అమెరికా కీలక పాత్ర పోషించిందని గుర్తు చేశారు. ఆ దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమెరికన్ సైనికులను జిన్‌పింగ గుర్తిస్తారా, లేదా అనేది పెద్ద ప్రశ్న అని ట్రంప్ పేర్కొన్నారు.

## సంక్షిప్తంగా..

### జిఎస్టీ తగ్గించేందుకు ఎనిమిదేళ్లు పట్టిందా?: చిదంబరం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** కేంద్ర ప్రభుత్వం వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) రేట్లను తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయానికి ఎనిమిదేళ్ల ఎందుకు పట్టిందంటూ ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. ఇది ఎనిమిదేళ్ల ఆలస్యంగా తీసుకున్న నిర్ణయమని ఆయన వ్యాఖ్యానించారు. సోషల్‌మీడియా వేదికగా చిదంబరం స్పందిస్తూ ప్రస్తుత జీఎస్టీ విధానాన్ని, ఇప్పటిదాకా ఉన్న రేట్లను మొదట్లోనే ప్రవేశపెట్టి ఉండాల్సింది కాదని అభిప్రాయపడ్డారు. 2017లో జీఎస్టీని తీసుకొచ్చినప్పటి నుంచి తాము దీని డిజైన్, రేట్లపై హెచ్చరిస్తున్నా ప్రభుత్వం తమ మాటలను పెడచెవిన పెట్టిందని ఆయన ఆరోపించారు. ఇంతకాలం తర్వాత ప్రభుత్వం హఠాత్తుగా ఈ మార్పులు చేయడానికి గల కారణాలపై ఆయన పలు అనుమానాలు వ్యక్తంచేశారు. మందగించిన ఆర్థికవృద్ధి, పెరుగుతున్న కుటుంబ అప్పులు, పడిపోతున్న పొదుపు, త్వరలో జరగనున్న బీహార్ ఎన్నికలు లేదా అమెరికా టారిఫ్‌ల ఒత్తిడి, వీటన్నింటిలో ఏదో ఒక కారణం ఉండి ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు.

## అమరత్వం,ఆయుష్షులపై జిన్‌పింగ్ పుతిన్‌ల ముచ్చట్లు

### అంతర్జాతీయ మీడియాలో వీరి చిట్‌చాట్ వైరల్



**బీజింగ్, సెప్టెంబరు 4:** ప్రపంచ రాజకీయాల్లో ఇద్దరు బలమైన నేతలుగా ఉన్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మధ్య ఓ ఆసక్తికరమైన సంభాషణ చోటుచేసుకుంది. మనిషి ఆయుష్షు, అమరత్వం వంటి అంశాలపై వారిద్దరూ మాట్లాడుకోవడం చర్చనీయాంశం అయింది. చైనా రాజధాని బీజింగ్‌లోని తియానన్మెన్ స్క్వేర్‌లో నిన్న జరిగిన సైనిక పరేడ్‌ను చూడటానికి వెళుతున్న సమయంలో ఈ ఇద్దరు నేతల మధ్య ఈ మాటామంతీ నడిచింది. ఈ సంభాషణలో పుతిన్ మాట్లాడుతూ, బయోటెక్నాలజీ అభివృద్ధి వల్ల అవయవ మార్పిడులు సర్వసాధారణ మవుతాయని, దాని ద్వారా యవ్వనంగా ఉంటూ అమరత్వం సాధించవచ్చని వ్యాఖ్యానించారు. దీనికి జిన్‌పింగ్ స్పందిస్తూ, ఈ శతాబ్దంలో మానవులు 150 ఏళ్ల వరకు జీవించగలరనే అంచనాలు ఉన్నాయని తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. ఈ సమయంలో ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ వారిని చూసి నవ్వుతూ కనిపించినప్పటికీ, వారి సంభాషణలో పాలుపంచుకున్నారా లేదా అనే దానిపై స్పష్టత లేదు. రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్‌పై విజయం సాధించి 80 ఏళ్లు పూర్తయిన సందర్భంగా చైనా ఈ భారీ ఆయుధ ప్రదర్శనను నిర్వహించింది. దాదాపు 50 వేల మంది సందర్శకుల మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో హైపర్‌సోనిక్ క్షిపణులు, అత్యాధునిక డ్రోన్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జిన్‌పింగ్ మాట్లాడుతూ, ప్రపంచానికి యుద్ధం కావాలో, శాంతికావాలో తేల్చుకోవాలని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమానికి ముందు జరిగిన షాంఘై సహకార సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోడీతో పాటు 20 దేశాల అధినేతలు పాల్గొన్నారు. ఈ పర్యటనలో భాగంగా పుతిన్, జిన్‌పింగ్ ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతంచేసే దిశగా 20 ఒప్పందాలపై సంతకాలు చేశారు. కృత్రిమ మేధ, గ్యాస్ పైప్‌లైన్ సహా పలు రంగాల్లో కలిసి పని చేయాలని నిర్ణయించారు.

## ఎనిమిదేళ్లకు మోడీ ప్రభుత్వానికి జ్ఞానోదయం

### ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** జీఎస్టీ సంస్కరణల విషయంలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి ఎనిమిదేళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత జ్ఞానోదయం కలిగిందని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎద్దేవా చేశారు. ఇన్నాళ్లకు కేంద్ర ప్రభుత్వం కుంభకర్ణ నిద్ర వీడి మేల్కొనడం మంచి విషయమేనంటూ ఆయన గురువారం వ్యంగ్యాస్త్రాలు సంధించారు. జీఎస్టీ కౌన్సిల్ ఇటీవల పన్ను స్లాబులలో కీలక మార్పులు చేసిన నేపథ్యంలో ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. గత దశాబ్ద కాలంగా జీఎస్టీని సరళీకరించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తూనే ఉందని ఖర్గే గుర్తుచేశారు. మోదీ ప్రభుత్వం ఒకే దేశం, ఒకే పన్ను అనే నినాదాన్ని ఒకే దేశం, 9 పన్నులుగా మార్చేసిందన్నారు. సరళమైన పన్నుల విధానంతో జీఎస్టీ 2.0ను తాము 2019, 2024 మేనిఫెస్టోల లోనే ప్రతిపాదించామని తెలిపారు. ఒకప్పుడు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నరేంద్ర మోడీనే జీఎస్టీని తీవ్రంగా వ్యతిరేకించారని ఖర్గే ఆరోపించారు. 2011లో అప్పటి ఆర్థిక మంత్రి ప్రణబ్‌ముఖర్జీ జీఎస్టీ బిల్లును ప్రవేశపెట్టినప్పుడు బీజేపీ అడ్డుపడింది. కానీ ఇవాళ అదే బీజేపీ ప్రభుత్వం రికార్డు స్థాయిలో జీఎస్టీ వసూళ్లు జరిగాయని సంబరాలు చేసుకుంటోంది. సామాన్యుల నుంచి పన్నులు వసూలు చేయడం గొప్ప ఘనత అన్నట్లుగా వ్యవహరిస్తోందని ఆయన దుయ్యబట్టారు. వసూలవుతున్న మొత్తం జీఎస్టీలో 64 శాతం పేద, మధ్యతరగతి ప్రజల నుంచే వస్తోందని, కేవలం 3 శాతం మాత్రమే కుబేరుల నుంచి వస్తోందని ఆయన ఆరోపించారు. తాజాగా చేపట్టిన సంస్కరణల వల్ల రాష్ట్రాలు ఆదాయం కోల్పోయే అవకాశం ఉన్నందున, 2024-25ను ఆధార సంవత్సరంగా తీసుకుని ఐదేళ్లపాటు పూర్తి పరిహారం చెల్లించాలని ఖర్గే డిమాండ్ చేశారు. అలాగే, సంక్లిష్టమైన జీఎస్టీ నిబంధనలను తొలగిస్తేనే ఎంఎస్ఎంఇరంగానికి నిజమైన ప్రయోజనం చేకూరుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## టారిఫ్ వార్ నిలిపివేయకపోతే భారీ మూల్యం తప్పదు


### అమెరికాకు శశిథరూర్ హెచ్చరిక



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** భారత్‌తో అనుసరిస్తున్న సుంకాల యుద్ధాన్ని అమెరికా తక్షణమే విరమించుకోకపోతే భవిష్యత్తులో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశి థరూర్ హెచ్చరించారు. ఒకప్పుడు చైనాను ఎవరు కోల్పోయారు అని వాషింగ్టన్‌లో చర్చ జరిగినట్టు, భవిష్యత్తులో భారత్‌ను ఎవరు కోల్పోయారని బాధపడే పరిస్థితిని తెచ్చుకోవద్దని అని ఆయన అమెరికాకు హితవు పలికారు. భారత్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని దెబ్బతీసే చర్యలు ఇరు దేశాలకే కాక, ప్రపంచానికి కూడా మంచిది కాదని ఆయన స్పష్టం చేశారు. ప్రముఖ ఆంగ్ల పత్రికలో రాసినవ్యాసంలో శశిథరూర్ ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్ నుంచి దిగుమతులపై అమెరికా 50శాతం వరకు సుంకాలు విధించడం, ముఖ్యంగా రష్యానుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు అదనంగా 25శాతం సుంకం వేయడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు.

## భారత్, చైనాలపై యుఎస్ స్వరం సరికాదు

### రష్యా అధినేత పుతిన్



**మాస్కో, సెప్టెంబరు 4:** భారీ సుంకాల విధింపు నేపథ్యంలో భారత్-అమెరికాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. దీనిపై తాజాగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్, చైనాలపై అమెరికా చర్యలు సరైనవి కావన్నారు. ఎస్ఇఒ సదస్సు, మిలిటరీ పెరేడ్‌లో పాల్గొనేందుకు ఆయన చైనాలో పర్యటించిన సంగతి తెలిసిందే. తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. ట్రంప్ పరిపాలన ఆసియాలోని రెండు అతిపెద్ద శక్తులనూ అణగదొక్కేందుకు ఆర్థిక ఒత్తిడిని ఒక సాధనంగా ఉపయోగిస్తుందని ఆరోపించారు. భారత్-చైనాలు భాగస్వాములని పేర్కొంటూ వీరి ద్వైపాక్షికాన్ని ట్రంప్ బలహీనపరిచే ప్రయత్నం చేస్తున్నారు. '1.5 బిలియన్ల మంది జనాభా కలిగిన భారత్, చైనాలు శక్తిమంతమైన ఆర్థిక వ్యవస్థలు. ఆయా దేశాలకు ప్రత్యేక రాజకీయ వ్యవస్థలు, దేశీయ చట్టాలు ఉన్నాయి. టారిఫ్‌లతో వారిని శిక్షించే ప్రయత్నాలు చేస్తే అవి ఆ దేశ నాయకులను క్లిష్టతరంలోకి నెట్టేస్తాయి. ఈ క్రమంలో వారిలో ఎవరైనా బలహీనపడితే.. అతని రాజకీయ జీవితం ముగిసిపోతుంది. ఇరు దేశాల చరిత్రలో వలసవాదం వంటి కష్టతరమైన కాలం నడిచింది. వారి సార్వభౌమాధికారంపై చాలాకాలం పాటు పన్ను విధించారు. ఇప్పుడు వాటన్నింటికీ కాలం చెల్లింది. ఇంకా వాటిని అణగదొక్కేలా మాట్లాడటం సరైనది కాదు. భాగస్వాములతో మాట్లాడేప్పుడు సరైన పదాలు ఉపయోగించాలి' అని పుతిన్ పేర్కొన్నారు. కాగా ఈ ఉద్రిక్తతలు త్వరలో ముగుస్తాయన్నారు. మళ్లీ సాధారణ స్థితికి చేరుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నారనే కారణంతో ట్రంప్ భారత్‌పై భారీగా సుంకాల భారాన్ని మోపారు. ఈ క్రమంలో అమెరికాలోని కొందరు నాయకులు భారత్‌పై నోరు పారేసుకుంటున్నారు. దీంతో ఇరు దేశాల మధ్యసంబంధాల్లో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. అయితే, భారత్‌పై విధించింది సెకండరీ సుంకాల మాత్రమేనని ట్రంప్ అన్నారు. ఆ దేశంపై రెండు,మూడు విడతలు ఉన్నా యన్నారు. ఈ క్రమంలోభారత్‌తో కలిసే ఉన్నా మంటూనే ఆదేశం ప్రపంచంలోనే అత్యధికంగా సుంకాలు వసూలు చేస్తుందని ఆరోపించారు.

## ప్రారంభించిన వెంటనే సముద్రంలో మునిగిన పర్యాటక నౌక



**అంకారా, సెప్టెంబరు 4:** తుర్కియేలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. కొత్తగా నిర్మించి ప్రారంభించిన నిమిషాల్లోనే ఓ లగ్జరీ నౌక సముద్రంలో మునిగిపోయింది. ప్రసిద్ధ పర్యాటక ప్రదేశమైన జోంగుల్డక్ తీరంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. దాదాపు పది లక్షల డాలర్లతో ఈ లగ్జరీ నౌకను నిర్మించారు. దీని ఖరీదు భారత కరెన్సీలో దాదాపు 8.74 కోట్లన్నమాట. 24 మీటర్ల పొడవున్న ఈ లగ్జరీ నౌకకు 'డోల్స్ వెంటో' అని పేరు పెట్టారు. తుర్కియేలోని మెడ్ యిల్మాజ్ షిప్‌యార్డ్‌లో ఈ నౌక్‌ను గ్రాండ్‌గా ప్రారంభించారు. కొంత మంది ప్రయాణికులు, సిబ్బందితో నౌక సముద్రంలో తన ప్రయాణాన్ని ప్రారంభించింది. అయితే ప్రారంభమైన 15 నిమిషాలకే ఈ నౌక సముద్రంలో మునిగి పోయింది. ఊహించని ఈ ఘటనతో భయాందోళనకు గురైన ప్రయాణికులు, సిబ్బంది వెంటనే సముద్రంలోకి దూకేశారు. అనంతరం సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. యజమాని, కెప్టెన్ కూడా సముద్రంలో దూకి ప్రాణాలు కాపాడుకున్నారు.

## నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్‌కు మరమ్మతులు చేస్తున్న పాక్



**కరాచి, సెప్టెంబరు 4:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌పై భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ లో దెబ్బతిన్న కీలకమైన నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్‌కు మరమ్మతులుచేస్తోంది. ఆపరేషన్ సిందూర్‌లో దెబ్బతిన్న అన్ని ఎయిర్‌బేస్‌లను పాక్ ఇప్పుడు పునర్నిర్మిస్తోంది. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత సైన్యం జరిపిన దాడుల్లో ధ్వంసమైన నూర్‌ఖాన్ ఎయిర్ బేస్ పునర్నిర్మాణ పనులు చేపడుతోంది. ఇందుకు సంబంధించిన శాటిలైట్ చిత్రాలు బయటకు వచ్చాయి. పాక్ సైన్యం హెడ్‌క్వార్టర్స్ ఉన్న రావల్పిండిలో ఈ ఎయిర్‌బేస్ ఉంది. అంతేకాదు దేశ రాజధాని ఇస్లామాబాద్‌కు కేవలం 10 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. అందుకే ఈ ఎయిర్‌బేస్ రాజకీయంగా, సైనిక పరంగా ఎంతో సున్నితమైందిగా చెప్తారు. అన్ని ఎయిర్‌ఫోర్స్ ఆపరేషన్లకు ఈ వైమానిక స్థావరమే అడ్డా.

## లారీని ఢీకొన్న కారు: ఐదుగురు వ్యాపారులు మృతి



**పాట్నా, సెప్టెంబరు 4:** వేగంగా వెళ్తున్న కారు లారీ వెనుక భాగాన్ని ఢీకొట్టింది. అందులో ప్రయాణించిన ఐదుగురు వ్యాపారులు ఈ ప్రమాదంలో మరణించారు. ఈసంఘటన బీహార్‌లో జరిగింది. రాజధాని పాట్నాతో పాటు పరిసర జిల్లాల్లో పురుగుమందులు, వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపారం చేస్తున్న వీరు బిజినెస్ పని కోసం ఫతుహాకు కారులోవెళ్లారు. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత పాట్నాకు తిరిగి వస్తున్నారు. పర్సా బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సుయా మోర్ సమీపంలో జాతీయ రహదారి నంబర్ 83పై వేగంగా వెళ్తున్న ఆ కారు లారీ వెనుక భాగాన్ని బలంగా ఢీకొట్టింది. కారు ముందు భాగం లారీ కిందకు చొచ్చుకెళ్లి ఇరుక్కు పోయింది. పెద్ద శబ్దం విన్న స్థానికులు వెంటనే ప్రమాద స్థలానికి చేరుకున్నారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు అక్కడకు చేరుకున్నారు. గ్యాస్ కట్టర్లు, క్రేన్ సహాయంతో రెండు గంటలు శ్రమించిన తర్వాత మృతదేహాలను కారు నుంచి బయటకు తీశారు.

పశ్చిమగోదావరి,ఏలూరు వార్త

# గోతులు మయంగా రహదారులు





**చాట్రాయి,సెప్టెంబర్ 4,ప్రభాతవార్త :** చాట్రాయి మండలంలో పలు గ్రామాల్లో రహదారులు గోతులుమయంగా మారాయి. కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితిలో గోతులు ఉన్నప్పటికీ ఆర్ అండ్ బి అధికారులు మాత్రం కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. నిత్యం గోతుల్లో పడి ఎంతోమంది ప్రమాదాలు గురవుతున్నప్పటికీ పట్టించుకునే నాధుడే కరువయ్యారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాట్రాయి నుండి నరసాపురం వెళ్లే రోడ్డులో జోడు మర్రులు వద్ద ప్రజలు అష్ట కష్టాలు పడుతున్నారు. నిత్యం వాహనాలు తిరిగే సమయంలో గోతుల్లో పడి రహదారిన వెళ్లే వారు పడుతునన్న ఇబ్బందులు ఎన్ని కావని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా చాట్రాయి నుండి చింతలపూడి వెళ్లే రోడ్డులో కూడా గోతులమయంగా తయారవడంతో ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. అదేవిధంగా మండలంలో తుమ్మ గూడెం, చిత్తపూరు, సోమవరం, కోటపాడు చీపురుగూడెం, చిన్నంపేట చనుబండ, నరసింహారావు పాలెం తదితర గ్రామాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొని ఉన్నప్పటికీ ఆర్ అండ్ బి అధికారులు కళ్లకు గంతలు కట్టుకున్నారా అని ప్రజలు నిలదీస్తున్నారు. కనీసం తాత్కాలిక మరిమతులు కూడా చేయకుండా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీని తోడు భారీ వాహనాలు కూడా నిత్యం అనుమతి లేకపోయినప్పటికీ తిరుగుతూ ఉండటంతో రోడ్లు మరింత అధ్వానంగా తయారవుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దీనిపై స్పందించి ఆర్ అండ్ బి రోడ్ల తాత్కాలిక మరమతులుచేయాలని ఇటీవల గొల్లగూడెం దగ్గర చేయగా వంద రోజులకే మళ్ళీ గోతులు పడ్డాయి. అధికారులు ఇప్పటికైనా పరిశీలించాలని మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.

# జిల్లా ఇవ్వకపోతే మా జీవితాలు చీకటే

- దేశం అంతా ముందుకు వెళుతున్నా మేము వెనకబడే ఉన్నాం
- స్టేట్ కమిటీ ముందు నేతల ఆవేదన
- గత పాలకుల తప్పులను సరిదిద్దాలి





**నరసాపురం ప్రభాత వార్త :** అన్ని అర్హతలు ఉన్న నరసాపురం జిల్లా కేంద్రం ఏర్పాటు చెయ్యాలని కోరుతూ నరసాపురం అఖిల పక్షం నాయకులు అమరావతిలో రాష్ట్ర జిల్లా కేంద్రాల పునః పరిశీలన కమిటీ సభ్యులను కలిశారు. జిల్లా కేంద్రాల పునః పరిశీలన కమిటీ సభ్యులు రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఆర్%డ%బి శాఖ మంత్రిబి.సి. జనార్ధనరెడ్డి, కమిటీ కన్వీనర్, రెవిన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి, లను నరసాపురం నియోజకవర్గం అఖిల పక్ష నాయకులు నరసాపురం జిల్లా కేంద్రం అవశ్యకతను వివరించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ 2022వ సంవత్సరంలో గత ప్రభుత్వం జిల్లాల పునర్విభజనలో భాగంగా 25 పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రాల్లో తీర ప్రాంతంలో ఉన్న శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు గల సబ్ డివిజన్లతో పాటు నరసాపురంను జిల్లా కేంద్రముగా ముందు ప్రకటించి తదుపరి వారు ఇచ్చిన జిఓ లో పార్లమెంట్ కేంద్రాలను జిల్లా కేంద్రాలుగా ఏర్పాటు చెయ్యవలేననే నిబంధనకు వ్యతిరేకంగా, భౌగోళికంగా అన్ని అర్హతలు ఉన్న తీర ప్రాంతమైన నరసాపురం నియోజకవర్గ ప్రజలకు అన్యాయం చేస్తూ, భీమవరంను జిల్లా కేంద్రంగా ప్రకటించారని అన్నారు. సదరు విషయమై భీమవరంలో జరిగిన సభలో అప్పటి ముఖ్యమంత్రి తన సహచర నరసాపురం మరియు భీమవరం శాసనసభ్యులు యొక్క స్వార్ధపూరితమైన, స్వప్రయోజనమైన కోరికలను మన్నించి, మండల కేంద్రమైన భీమవరంను ఉద్దేశాపూర్వకంగా రెవిన్యూ సబ్ డివిజన్ గా మారుస్తూ, భీమవరంను జిల్లా కేంద్రంగా నిర్ణయించినట్లు బహిరంగంగా ప్రకటించటం సహేతుకమైనది మరియు అప్రజాస్వామికమైనదన్నారు. ఇటీవల శాసన మండలి చైర్మన్ అయిన కొయ్యే మోషేన్ రాజు కూడా జిల్లా కేంద్ర మార్పు విషయంలో వారి పలుకుబడిని ఉపయోగించినట్లు వ్యక్తపరిచిన అభిప్రాయం అందరికి విదితమేనన్నారు. ఈ విషయాలను సదరు మంత్రివర్గ సభ్యులు తెలియజేయమని దానికి వారు సానుకూలంగా స్పందించి పునః పరిశీలన చేసి తగు చర్యలు తీసుకుంటామని అన్నారని తెలిపారు. ఈ సందర్భంగా నరసాపురం మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు మాట్లాడుతూ పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రమైన నరసాపురంను జిల్లా కేంద్రంగా పరిగణనలోనికి తీసుకొవాలని కోరామని అన్నారు. అందుకు తగిన , భౌగోళిక అర్హతలు, ప్రభుత్వం కు చెందిన 50 ఎకరాల స్థలం తో పాటు సబ్ కలెక్టర్, నీటిపారుదల శాఖ, పురపాల సంఘ కార్యాలయాల ప్రాంగణాలు అందుబాటులో ఉన్నాయని వాటిని జిల్లా కార్యాలయాలకు వినియోగించుకోవచ్చని అన్నారు. నరసాపురం జిల్లా కేంద్రం గా మారితే ఈ ప్రాంత ప్రజలకు, యువతకు ఆర్ధిక వెసులుబాటు తో పాటు, ఉద్యోగ, ఉపాధి అవకాశములు పెరిగి తీర ప్రాంత అభివృద్ధి చెందుతాదని అన్నారు. నరసాపురం కు జిల్లా కేంద్రం ఏర్పాటు అవశ్యకతను మంత్రివర్గ కమిటీ సభ్యులకు అఖిల పక్ష నాయకులు వివరించమని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ, అఖిలపక్ష నాయకులు నెక్కంటి సుబ్బారావు, పొత్తూరి రామరాజు, ఇలపకుర్తి ప్రకాష్, శిరిగినీడి రాజ్యలక్ష్మి, కోటిపల్లి వెంకటేశ్వరరావు, కలవకొలను తాతాజీ, గునిశెట్టి శ్రీనివాస్, ఆరేటి మృత్యంజయరావు, కూనపరెడ్డి రంగారావు, బార్ అసోసియేషన్, ఐఎంఎ సభ్యులు, కిరాణా, వర్తక, వివిధ వ్యాపార, ప్రజా సంఘాల ప్రతినిధులు, అఖిల పక్ష నేతలు తదితరులు పాల్గొన్నారు.





# నిలకడగా గోదావరి

- రహదారులను వీడని వరద నీరు
- 20 గ్రాములు పైగా రాకపోకలకు అంతరాయం





**వేలేరుపాడు, సెప్టెంబర్ 4, ప్రభాత వార్త :** ఎగువన కురిసిన భారీ వర్షాలకు గోదావరి ప్రవాహం భారీగా పెరిగింది. మంగళవారం 29 అడుగులుగా ఉన్నటువంటి గోదావరి నీటిమట్టం బుధవారం సాయంత్రానికి 44 అడుగులకు చేరింది. మొదటి ప్రమాదయ చేరికను జారీ చేసినటువంటి అధికారులు గోదావరి మరింత పెరిగే అవకాశం ఉందని సూచనలు ఇవ్వడంతో ప్రజల్లో ఆందోళనలకు గురయ్యారు. గురువారం మధ్యాహ్నం వరకు నిలకడగా ఉన్నటువంటి గోదావరి గురువారం మధ్యాహ్నం నుండి కొంత వరకు తగ్గుముఖం పట్టింది. ఎద్దువాగు గుండెడువాగు రహదారులు పూర్తిగా వరద నీరు ముంచేసింది. నాల్లవరం పంచాయతీల్లోని రోడ్లు జలమయం అయ్యేసరికి కనీసం పడవలు కూడా ఏర్పాటు చేయలేదని ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. నెల రోజులు నుంచి వరద గోదావరి మండలాన్ని ఇబ్బందులకు గురిచేస్తుంది. పంపు గ్రామాల ప్రజలు పునరావస కాలనీలోనే తలదాచుకుంటున్నారు. ఏదైనాప్పటికీ వరద గోదావరి తగ్గుముఖం పట్టేసరికి ప్రజలు కొంత సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## అత్యధిక కేసులు రాజీకీ న్యాయవాదులు కృషి చేయాలి - న్యాయమూర్తి వాసంతి



**నరసాపురం ప్రభాతవార్త :** ఈ నెల 13వ తారీకున జరిగే జాతీయ లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులు రాజీ చేసి కక్షిదారులకు సమన్యాయం అందించుటలో న్యాయవాదులు భాగస్వామ్యం కావాలని,నర్సాపురం 10వ అదనపు జిల్లా జడ్జి మరియు చైర్ పర్సన్ ఎ. వాసంతి ఈ రోజు మధ్యాహ్నం స్థానిక కోర్టు హాల్ నందు న్యాయవాదులకు నిర్వహించిన సమావేశంలో అన్నారు. న్యాయవాదులు కూడా తమ తమ కక్షిదారులకు లోక్ అదాలత్ యొక్క ముఖ్య ఉద్దేశం ను వివరించాలన్నారు. రోజూ కోర్ట్ లో ఆవరణలో జరుగుచున్న మధ్యవర్తిత్వం ను ఉపయోగించుకుని కక్షిదారులకు సమన్యాయం అందించుటకు న్యాయవాదులు పూర్తి సహకారాన్ని అందించాలని న్యాయవాదులకు సూచనలిచ్చారు . క్రిమినల్ కేసులతో బాటు సివిల్ కేసులు కూడా ఎక్కువగా రాజీ అయ్యేలా తమ వంతు కృషి చేయాలన్నారు. ఫైనాన్స్ కేసులకు సంబంధించిన ఎక్స్యూషన్ పిటిషన్ కేసులు కూడా ప్రీ లోక్ అదాలత్ ముందు రాజీ చేయడానికి అందరూ సహకరించి, రాజీ కేసుల్లో జిల్లాలో ప్రథమ స్థానంలో ఉండేలా అందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జి. గంగరాజు, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూ. డివిజన్) ఆర్. వరలక్ష్మి, అదనపు సివిల్ జడ్జి (జూ . డివిజన్) ఎస్. రాజ్య లక్ష్మి బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి. విశ్వేశ్వరరావు ట్రెజరర్ పి. శ్రీనివాసరావు, సీనియర్ మరియు జూనియర్ న్యాయవాదులు మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.



## ప్రజల కోసం ప్రాణత్యాగం చేసిన ఉమేష్ చంద్ర

### కలెక్టర్ నాగరాణి





**పశ్చిమ గోదావరి ప్రభాత వార్త :** ప్రజల కోసం ప్రాణం ధారపోసిన పోలీస్ అధికారిగా ఉమేష్ చంద్రను తెలుగు ప్రజలు ఎన్నటికీ మరువరని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదేండ్ల మనోహర్ అన్నారు. నిజాయితీ, ధైర్యం, ప్రజాసేవ ఆయన మనకు అందించిన వారసత్వం వంటివని కొనియాడారు. దివంగత ఐపిఎస్ అధికారి చదలవాడ ఉమేష్ చంద్ర 26వ వర్ధంతి కార్యక్రమం గురువారం తెనాలి చెంచుపేటలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన మనోహర్ మాట్లాడుతూ ప్రజాసేవే పరమ ధర్మమని చదలవాడ జీవితం చాటి చెప్పిందని, ఆయన చరిత్ర నేటి పోలీస్ అధికారులకు, యువతకు స్ఫూర్తిగా నిలుస్తోందన్నారు. ధైర్యానికి పర్యాయపదంగా అరాచక శక్తులను అణిచివేసారన్నారు. ఫ్యాక్షన్ గడప కడపలో ప్రజల మనిషిగా గుర్తింపు పొందగలిగారన్నారు. కార్యక్రమానికి ప్రత్యేక అతిధిగా హాజరైన శాసన మండలి సభ్యులు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఎటువంటి ఆయుధం లేకుండా సాయిధ నక్సలైట్లకు ఎదురు వెళ్లటం ఉమేష్ చంద్ర ధైర్య సాహసాలకు ప్రతీకగా నిలిచిందన్నారు. అఖరి శ్వాస వరకు తన పోరాటం ఆపలేదన్నారు. బుల్లెట్లు శరీరాన్ని చిద్రం చేస్తున్నా నక్సలైట్లను నిలువరించే ప్రయత్నం చేసారన్నారు. కేవలం మృత్యువు మాత్రమే ఆయన సాహసాన్ని నిలువరించగలిగిందని, ఆ క్షణాలే పోలీస్ చరిత్రలో అమర గాథగా నిలిచాయని ఆలపాటి వివరించారు. ఉమేష్ చంద్ర మరణం రాష్ట్రాన్ని కదిలించగా,

7వ పేజీలో

## భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

### - తోట సీతారామలక్ష్మి



**భీమవరం సెప్టెంబర్ 4ప్రభాతవార్త :** భీమవరం పట్టణం శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తలగా నియమితులైన నూతన పాలకమండలి చైర్మన్ గనిరెడ్డి త్రినాధ్ ధర్మకర్తలు టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి పోలీట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టనున్న శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థానం పాలకవర్గం దేవాలయ అభివృద్ధికి కృషి చేయాలని భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ దర్శనాన్ని సులభతరం చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థాన నూతన చైర్మన్ గనిరెడ్డి త్రినాథ్ ధర్మకర్తలు చింతాడ నాగలక్ష్మి నల్లం గంగాధరరావు ఆకుల హైమావతి పి.కార్తీక్ మల్లువల రఘుబాబు ఎం.శ్రీనివాసరావు బీ.లక్ష్మి తదితర నాయకులు పాల్గొన్నారు.

## నేడు సూర్యా లో ఉపాధ్యాయ దినోత్సవం

నరసాపురం ప్రభాతవార్త : స్థానిక సూర్య విద్యాసంస్థలో ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా శుక్రవారం ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే నాయకర్ ఆర్డిఓ దాసిరాజు ప్రముఖ గజల్ రైటర్ గజల్ గాంధీ పాల్గొంటారని శ్రీ సూర్య సెక్రటరీ ఘంటసాల బ్రహ్మాజీ తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానిస్తారు

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**తణుకు, సెప్టెంబర్ 4(ప్రభాత వార్త):** తణుకు పట్టణంతోపాటు పాతవూరు, సజ్జాపురం, అత్తిలి మండలాల పరిధిలోని విద్యుత్ లైన్లు మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ నరసింహమూర్తి తెలిపారు. తణుకు పట్టణ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీ, ఇరగవరం కాలనీ, ఐక్య నగర్, శివబాలాజీ నగర్, రెడ్డి అండ్ రెడ్డి లేఅవుట్, కొమ్మాయిచెరువు గట్టు, మున్సిపల్ కార్యాలయం ప్రాంతాలు, తణుకు మండలం పైడిపర్రు, అత్తిలి మండలం ఆరవల్లి, దంతుపల్లి, గుమ్మంపాడు, అత్తిలి, పాలి గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నందున వినియోగదారులు సహకరించాలని కోరారు.

## తణుకులో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**తణుకు, సెప్టెంబర్ 4(ప్రభాత వార్త):** తణుకు ఎస్కేఎస్డీ మహిళా కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణిను ఘనంగా సత్కరించారు. తమ బంగారు భవిష్యత్తుకు కళాశాల పునాది వేసిందని తాము కళాశాలకు ఎంతో రుణపడి ఉన్నామని చెప్పారు. ప్రిన్సిపల్ యు.లక్ష్మిసుందరిబాయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## నారా లోకేష్ ను కలిసిన డా. దాసరి శ్యామ్ చంద్ర శేషు,



జంగారెడ్డిగూడెం-ప్రభాతవార్త :అమరావతిలో రాష్ట్ర విద్య మరియు ఐటి శాఖామంత్రి యువనేత నారా లోకేష్ ను టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా. దాసరి శ్యామ్ చంద్ర శేషు గురువారం కలిశారు. ఈ సందర్భంగా డిఎస్సి ద్వారా 16,347 ఉపాధ్యాయ ఉద్యోగాలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా భర్తీ చేసి నిరుద్యోగ యువత భవితకు బంగారు బాట వేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఏలూరు జిల్లా అధ్యక్ష పదవి విషయం తెలియజేశారు. కష్టపడ్డ వారికి తప్పకుండా మంచి అవకాశాలు వస్తాయని ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని లోకేష్ తెలిపారని తెలిపారు. త్వరలోనే కమిటీల నియామకం ఉంటుందని శేషు తెలిపారు. లోకేష్ ను కలిసిన వారిలో చింతలపూడి మండల ప్రధాన కార్యదర్శి కొండ్రు దేవా, శ్రీనివాసపురం సొసైటీ డైరెక్టర్ తాళ్లూరి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

# పూర్వ విద్యార్థినులచే 50వేల రూపాయలతో గీతా స్కాలర్షిప్



**భీమవరం సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :** భీమవరం ఎస్ ఆర్ కే ఆర్ ఇంజనీరింగ్ కళాశాల మూడవ సంవత్సరం సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థిని నిమ్మల దీపికకు, జెట్టి బోయిన నాగలక్ష్మి కి ఒక్కొక్కరికి 25వేల రూపాయలు చొప్పున గీతా స్కాలర్షిప్ ను ఆధ్యాత్మిక ప్రవచన కర్త భగవద్గీత ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎల్ వి గంగాధర్ శాస్త్రి చేతుల మీదగా గురువారం జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో అందించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత్ వర్మ మాట్లాడుతూ కళాశాల ప్రారంభం నుండి మొదటి నాలుగు సంవత్సరాలకు చెందిన అమెరికాలో స్థిరపడిన విద్యార్థినులు అప్పుడు తమకు ఇంగ్లీష్ అధ్యాపకురాలిగా విద్యార్థినుల అభిమానాన్ని చురగొన్న స్వర్గీయ గీతా రాజ్ పేరిట ప్రతి ఏటా ఇద్దరు విద్యార్థినిలకు ఒక్కొక్కరికి 25వేల రూపాయలు చొప్పున గత ఐదు సంవత్సరాలుగా స్కాలర్షిప్లు అందిస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం జగపతి రాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి మురళీకృష్ణం రాజు, మాట్లాడుతూ సుమారు 35 సంవత్సరాల క్రితం అమెరికాలో స్థిరపడి ఉన్నత స్థానాల్లో ఉన్న విద్యార్థినులు తమ గురువు పేరిట గుర్తించుకొని ప్రతి ఏటా ఇద్దరి విద్యార్థినులకు స్కాలర్షిప్లు అందించడం పూర్వ విద్యార్థులు కళాశాలపైన చూపుతున్న ఆదరభిమానాలకు తార్కానంగా పేర్కొన్నారు.

# మిషన్ శక్తిపై మహిళలకు అవగాహన



పెనుమంట్ర-ప్రభాతవార్త :మండలంలోని మల్లిపూడి గ్రామంలో మిషన్ శక్తి 10 రోజులపై స్వయం సహాయక సంఘాల మహిళలకు బాల్యవివాహాల నిషేధ చట్టం 2006, పోక్సో చట్టం గురించి వివరించడం జరిగిందని సిడిపిఓ ఏ కృష్ణకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలకు 18 సంవత్సరాలు మరియు బాలురకు 21 సంవత్సరాలు నిండే వరకు వివాహం చేయరాదని తెలిపారు. బాల్య వివాహం చేసుకున్న వారికి, వివాహానికి సహకరించిన వారికి 2 సంవత్సరాల జైలు శిక్ష, రూ. 1.00 లక్ష జరిమానా విధించడం జరుగుతుందన్నారు. ప్రతి మహిళ ఆరోగ్యం విషయంలో శ్రద్ధ వహించాలని అన్నారు. కుటుంబంలో మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబంలో అందరూ ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఉమెన్ హెల్ప్ లైన్ నెంబర్-181, చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్-1098 గురించి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ పి వరలక్ష్మి, డ్వాక్రా సిఏ బి విజయలిత, డ్వాక్రా మహిళలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేదరికం లేని సమాజమే ప్రభుత్వ ధ్యేయం: ఎంపీపీ మక్కా



అత్తిలి- సెప్టెంబర్ 4 (ప్రభాత వార్త) :గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా పేదరికం లేని సమాజమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని అత్తిలి ఎంపీపీ మక్కాసూర్యరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీ పురోగతి సూచిక వెర్షన్ పై ప్రజాప్రతినిధులు, లైన్ డిపార్ట్మెంట్ అధికారులకు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మక్కా మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందడానికి ఎటువంటి సదుపాయాలు అవసరమో అధికారులు గుర్తించాలని కోరారు. ప్రభుత్వం పిల్లల నుండి వృద్ధుల వరకు అందజేస్తున్న సదుపాయాలను తెలియజేయాలని, అవసరాలను తెలుసుకోవాలని కోరారు. ఎంపీడీవో పి శామ్యూల్ మాట్లాడుతూ పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం తొమ్మిది లక్ష్యాలను నిర్దేశించిందని తెలిపారు. వాటిని సాధించడం ద్వారా గ్రామాలు సౌకర్యవంతమైన, అభివృద్ధి చెందిన గ్రామాలుగా రూపుదిద్దుకోగలవని అన్నారు. లక్ష్యాల సాధనకు సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులకు తగు సలహాలు అందించాలని కోరారు. మండల ఉపాధ్యక్షులు సుంకర నాగేశ్వరరావు, కొనకళ్ళ విజయనిర్మల, సర్పంచులు, ఎంపీటీసీలు,అధికారులు పాల్గొన్నారు.

వార్త
విలేకరులు కావలెను
వార్త తెలుగుదిన పత్రిక నందు పని చేయుటకు ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు సంబంధించి వివిధ మండల కేంద్రాలలో పని చేయుటకు విలేకరులు కావలెను.
ఏలూరు జిల్లా...
ఏలూరు, ద్వారకాతిరుమల, కామవరపుకోట, టి.నర్సాపురం, దెందులూరు, పెదవేగి, పోలవరం, కొయ్యలగూడెం
పశ్చిమ గోదావరి జిల్లా...
ఆకివీడు, గణపవరం, నిడమర్రు, ఉండి, పాలకొల్లు, వీరవాసరం, యలమంచిలి, పెనుగొండ
ఆసక్తి గల అభ్యర్థులు ఈ క్రింది ఫోన్ నెంబర్‌కు సంప్రదించవలెను.
ఫోన్ : 9704502377

# విద్యార్థుల భవిష్యత్ కు నాంది ఉపాధ్యాయులే



భీమవరం సెప్టెంబర్ 4(ప్రభాతవార్త: విద్యార్థుల భవిష్యత్ కు బంగారు బాటలు వేయటానికి నాంది ఉపాధ్యాయులేనని, తల్లిదండ్రులు, గురువులు దైవ స్వరూపాలను వారి గౌరవించాలని టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్ధసారధి, ఎమ్మెల్యే అంజిబాబు సతీమణి సత్యవాణి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో గురు పూజోత్సవం సందర్భంగా 32 మంది ఉపాధ్యాయులను సత్కరించారు. వారు మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అందిస్తూ సమాజానికి దిక్సూచిగా ఉపాధ్యాయులు నిలుస్తున్నారని, ఉపాధ్యాయులను గౌరవించుకోవడమంటే మన సంస్కృతిని మనం గౌరవించుకోవడమేనని అన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు పులఖండం కోటేశ్వరరావు, బ్రహ్మకుమారీస్ రేవతి, లయన్స్ క్లబ్ సీనియర్ నాయకులు కంతేటి వెంకటరాజు, వడుపు గోపి మాట్లాడుతూ సమున్నత జాతి నిర్మాణంలో ఉపాధ్యాయులు, అధ్యాపకుల పాత్ర అనిర్వచనీయమని, దేశానికి జ్ఞాన సంపన్నులైన, అంకితభావం కలిగిన యువతను అందించేందుకు పాఠశాల, కళాశాల దశల నుంచే బోధన బాధ్యతల్లో ఉన్నవారు తపిస్తారన్నారు. కార్యక్రమ నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పట్టణంలోని వివిధ పాఠశాలలోని 32 మంది ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో సత్కరించామని అన్నారు. కార్యక్రమంలో సుభద్ర, కే నిర్మల, లక్ష్మి భవానీ, గంధం శ్రీదేవి, చీడే అమ్మజీ, రూపావాణి, కలిగోట్ల గోపాలశర్మ, డా నాగేశ్వరరావు, కొండ్రు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అత్తిలిలో ఎక్స్ ప్రెస్ రైళ్లు హాల్ట్ కోరికను నెరవేర్చ :మంత్రి శ్రీనివాస్ వర్మ.



అత్తిలి-సెప్టెంబర్ 4 (ప్రభాత వార్త ):అత్తిలి పట్టణంలో రెండు మూడు రోజుల్లో రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లు హాల్ట్ లు ఇచ్చేలా రైల్వే అధికారులు సమాచారం ఇచ్చినట్లు కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ అన్నారు. అత్తిలి సుబ్బారాయుడు కళ్యాణ మండపంలో జరిగిన అభినందన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎక్స్ ప్రెస్ రైళ్లు హాల్ట్ ల విషయంపై ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేయడం వారి ఆత్రుతను తెలియజేస్తుందని అన్నారు. సర్కార్ ఎక్స్ప్రెస్, పూరి తిరుపతి ఎక్స్ప్రెస్ రైళ్లు ఆగేలా రైల్వే అధికారులు నోటిఫికేషన్ జారీ చేస్తారని తెలిపారు. శేషాద్రి,మచిలీపట్నం విశాఖ ఎక్స్ప్రెస్ లు కూడా ఆగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. భీమవరం నిడదవోలు ప్యాసింజర్ ను రాజమండ్రి వరకు పొడగించాలా చూస్తానని అన్నారు. ఎక్స్ప్రెస్ రైలు ఆగుతాయని సమాచారం తెలియడంతో పండుగ వాతావరణంలో అత్తిలిలో కనిపిస్తోందని తెలిపారు. ఎన్నికల సందర్భంగా తాను ఇచ్చిన హామీని నెరవేర్చుకున్నట్లు తెలిపారు. మండపాక వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ మంజూరైనట్లు తెలిపారు. అత్తిలిలో దయాలసిస్ యూనిట్ కు 75 లక్షల మంజూరు చేసినట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందని అన్నారు. ఆరోగ్యవంతమైన విమర్శలు చేయాలని,అర్థం లేని ప్రేలాపనలు మానుకోవాలని ప్రతిపక్ష నాయకులను కోరారు. తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ అతిలో రైళ్లు ఆగుతాయని సమాచారంతో పెద్ద ఉపశమనం లభించింది అన్నారు. వ్యాపార కేంద్రమైన అత్తిలి వారికి రైళ్లు ఆగిపోవడం ఒక సెంటిమెంట్ గా భావించారని తెలిపారు. రైళ్లు ఆపాలంటే ఎంతో కసరత్తు చేయాలని త్వరగా సాధ్యమయ్యే పని కాదని అన్నారు. కేంద్ర మంత్రి నిరంతరం కేంద్ర మంత్రులతో, అధికారులతో మాట్లాడటం వల్లే ఎక్స్ప్రెస్ రైళ్ల కు హాల్టు లభించిందని తెలిపారు.సమావేశంలో ఏం ఎంసి చైర్మన్ దాసం ప్రసాద్, ఎంపీపీ మక్కా సూర్యరావు, జిల్లా బిజెపి అధ్యక్షుడు అయనపూడి శ్రీదేవి, రాష్ట్రఅధికార ప్రతినిధి ముళ్ళపూడి రేణుక, మాజీ అధ్యక్షులు నార్ని తాతాజీ, కొండేటి శివ, మండల టిడిపి పార్టీ మాజీ అధ్యక్షుడు ఆనాలా ఆదినారాయణ రావు,బిజెపి మండల అధ్యక్షుడు మామిడి శెట్టి నాగబాబు మాజీ ఎఎంసి చైర్మన్ దాసం బాబ్జి, ఆకుల చినబాబు, కె.వి.రామారావు, భోగిరెడ్డి ఆదిలక్ష్మి తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ వర్మను, ఎమ్మెల్యే రాధాకృష్ణను వివిధ సంఘాల వారు ఘనంగా సత్కరించారు.అంతకుముందు మంత్రి శ్రీనివాస్ వర్మ, ఎమ్మెల్యే రాధాకృష్ణ అత్తిలి రైల్వే స్టేషన్ కు చేరుకోగా కూటమి నాయకులు ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు.

# మంచిలి ఉపాధ్యాయునికి జాతీయ అవార్డు.



అత్తిలి -సెప్టెంబర్ 4 (ప్రభాతవార్త ) అత్తిలి మండలం మంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నేలపాటి వెంకటరమణకు జాతీయస్థాయిలో అవార్డు వచ్చింది. నేషనల్ టీచర్ ఎడ్యుకేటర్ ఎక్సలెన్స్ జాతీయ స్థాయి అవార్డు వెంకటరమణ కు ఇస్తున్నట్లు ఆ సంస్థ వారి ప్రకటించారు. గ్లోబల్ టీచర్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2025 ప్రధానోత్సవం లో భాగంగా ఢిల్లీ లో అవార్డును వెంకటరమణ చేస్తారని తెలిపారు. వెంకటరమణ ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షులుగా వ్యవహరిస్తున్నారు. 2019లో ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డును పొందారు.

# గంటా త్రిమూర్తులు కు మంత్రి సావిత్రమ్మ అభినందనలు



భీమవరం సెప్టెంబర్ 4(ప్రభాతవార్త ప్రజాసేవ పట్ల మీ నిబద్ధత తెలుగుదేశం పార్టీలో క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మీకు కృష్ణ బలిజ పూసల డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా అవకాశం కల్పించారని అంకితభావంతో సంఘీయుల పురోభివృద్ధికి కృషి చేయాలని చైర్మన్ గంటా త్రిమూర్తులను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ అభినందించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి సవితమ్మ ను మర్యాదపూర్వకంగా కృష్ణ బలిజ పూసల డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు కలిశారు. ఈ సందర్భంలో రాష్ట్రవ్యాప్తంగా సంఘీయులు నివసిస్తున్న ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నానని, ఆయా ప్రాంతాలలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మంత్రికి విన్నవించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ఒక కార్యాచరణతో ముందుకు సాగాలని చెప్పినట్లు చైర్మన్ త్రిమూర్తులు తెలిపారు.

# మావుళ్ళమ్మ పూరి గుడి వద్ద లడ్డు వేలం రూ 16 వేలు



భీమవరం సెప్టెంబర్ 4 ప్రభాతవార్త : భీమవరం శ్రీమావుళ్ళమ్మ అమ్మవారి పూరి గుడి వద్ద శ్రీ వరసిద్ధి వినాయక 25వ వార్షిక మహోత్సవంలో భాగంగా గురువారం అన్న సమారాధన నిర్వహించారు. బిల్డర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు గన్నాబత్తుల శ్రీనివాస్, చిక్కాల రాంబాబు, మరిడీ చక్రధర రావు, గంగుమోలు నరసింహం, దారపు మధు సుధన్ రావులు అన్న సమారాధనలు ప్రారంభించి మాట్లాడారు. అనంతరం 5 కేజీల లడ్డును 16,300 లకు ప్రమీల వెంకన్న బాబు వేలంపాట లో దక్కించుకున్నారు. వేలాది మంది భక్తులు స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

# కె.9 కాపు సంక్షేమ సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీ కారం

జంగారెడ్డిగూడెం, ప్రభాతవార్త: కాపులలో సమాజం పట్ల బాధ్యత గల వ్యక్తులు ఎక్కువగా ఉన్నారని మాజీ ఏఎంసీ చైర్మన్, సీనియర్ నేత జెట్టి గురునాధరావు అన్నారు. స్థానిక గుర్వాయిగూడెం మానవత కమ్యూనిటీ హాల్లో బుధవారం రాత్రి కె 9కాపు సంక్షేమ సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో కాపు ప్రముఖులు, నాయకులు ఈ వేడుకలో పాల్గొన్నారు.కె. 9 అసోసియేషన్ అధ్యక్షుడు తొమ్మిదేళ్ల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గురునాధరావు మాట్లాడుతూ కె 9 కాపుల కోసం 9 విభాగాల ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలు హర్షణీయమని అభినందించ్చారు.రాజకీయ జోక్యం లేకుండా, కేవలం సంక్షేమ దిశలో ముందుకు సాగాలని సూచించారు.విద్య, వైద్యం, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, ఇతర సంఘాలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు.మనలో మనం విభేదించుకోకుండా, కుటుంబాలను, కులాన్ని కాపాడుకుంటూ, ఆర్థికంగా ఎదగడానికి మార్గాలు అన్వేషించాలని జెట్టి అని పిలుపునిచ్చారు.

# యూరియా కొరతకుపై ఈ నెల 9న వైకాపా ధర్నా



జంగారెడ్డిగూడెం-ప్రభాతవార్త : ఈనెల 9వ తేదీన రైతులకు యూరియా అందకపోవటంపై రాష్ట్రవ్యాప్తంగా ఆర్డిఓ కార్యాలయాలు వద్ద రైతుల కొరకు యూరియా కొరకు రైతు నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు చింతలపూడి వైకాపా నియోజకవర్గ ఇంచార్జ్ కంభంపాటి విజయరాజు తెలిపారు. గురువారం చింతలపూడి నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అత్యవసర సమావేశం మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు జెట్టి గురునాధరావు కార్యాలయం వద్ద జరిగింది. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు కావున చింతలపూడి నియోజకవర్గంలో జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయం వద్ద ఈ నెల 09న నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కావున చింతలపూడి నియోజకవర్గ పరిధిలో గల రైతులు మరియు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి మాజీ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ జగ్గవరపు జానకి రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు కేసర సరిత రెడ్డి, జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షులు బొద్దు వెంకటేశ్వరరావు జిల్లా ప్రచార విభాగం అధ్యక్షులు త్సల్లా బత్తుల శ్రీనివాసరావు, మరియు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జంగారెడ్డి గూడెం మండల అధ్యక్షులు ఓరుగంటి నాగేంద్ర కుమార్,చింతలపూడి మండల అధ్యక్షులు రమేష్ రెడ్డి, ముప్పిడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు..

అత్తిలి- సెప్టెంబర్ 4 (ప్రభాతవార్త) :అత్తిలి మండలం కు చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు గా ఎంపికయ్యారు. పాలి ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ ఎల్ వి వి శర్మ, ఊరదళ్ళ పాలెం పాఠశాల సెకండరీ ఉపాధ్యాయుడు ఏ అప్పలరాజు, ఈడూరు నెంబర్ 2 పాఠశాల ఉపాధ్యాయుడు జి. రాధాకృష్ణ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వారిని మండల విద్యాధికారి ఎం వి ఎల్ కె ప్రసాద్ అభినందించారు.

# శక్తి యాప్ ను వినియోగించుకోండి

## - ఎంఈఓ బ్రహ్మచారి

చాట్రాయి, సెప్టెంబర్ 4,ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ అభివృద్ధి చేయబడిన శక్తి యాప్ ను సమర్ధవంతం గా వినియోగించుకొని బాల్య వివాహాలు, డ్రగ్స్ అబ్యూస్, సైబర్ క్రైమ్ మొదలగు వాటి నుండి రక్షణ పోందాలని చాట్రాయి మండల విద్యాశాఖ అధికారి వి ఎస్ వి బ్రహ్మచారి అన్నారు.గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చనుబండ పాఠశాలలో శక్తి యాప్ పై జరిగిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం అని చెప్పారు. నూజివీడు సబ్ డివిజన్ శక్తి టీం ఇన్చార్జి నాగభూషణరావు ఏఎస్ఐ ముసునూరు శక్తి యాప్ లో ముఖ్య విభాగాలైన డయల్ 100 చైల్డ్ మిస్సింగ్ నైట్ జర్నీ ఫ్యామిలీ కౌన్సిలింగ్ సేఫ్ ట్రావెల్ అసాంఘిక కార్యక్రమాలు శక్తి హెల్ప్ లైన్, పోక్సో 2012 చట్టం, సైబర్ సైబర్ క్రైమ్, గురించి తెలియచేశారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం రవీంద్రనాద్ ఉపాధ్యాయులు శోభన్ బాబు, నాగమణి, శక్తి టీం సభ్యులు హెడ్ కానిస్టేబుల్ విజయబాబు డబ్ల్యూ పిసి పద్మ చనుబండ సచివాలయం ఎమ్మెస్ కే విజయలక్ష్మి పాల్గొన్నారు.

# బస్ డిపో ఏర్పాటుపై మంత్రిని కోరిన ఎమ్మెల్యే రోషన్ కుమార్,

జంగారెడ్డిగూడెం-ప్రభాతవార్త :చింతలపూడి ప్రజల చిరకాల ఆకాంక్ష గుర్తించి ఆర్టీసీ బస్ డిపో మంజూరు చేయాలని శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మడిపల్లి రాంప్రసాద్ రెడ్డిని కోరారు. గురువారం సచివాలయంలో మంత్రి రాంప్రసాద్ రెడ్డిని నియోజకవర్గంలో నెలకొన్న భౌగోళిక, పరిస్థితిలు, రవాణా సౌకర్యాలు మంత్రికి వివరించారు. ఈ మేరకు అవసరమైన చర్యలు చేపడతామని మంత్రి పేర్కొన్నారని తెలిపారు.

# ప్రకృతి వ్యవసాయం సాధన లో.....


## - రైతులకు ఆదర్శంగా నిలుస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటేశ్

## - తన 6 ఎకరాల వ్యవసాయ భూమిలో పూర్తిగా ప్రకృతి సేద్యం



**ఏలూరు, సెప్టెంబర్, 4 : ప్రభాత వార్త :** ఏలూరు జిల్లా వ్యవసాయ రంగంలో ప్రకృతి వ్యవసాయానికి కొత్త దిక్సూచి చూపిస్తూ, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (DPM) వెంకటేశ్ ఆదర్శంగా నిలుస్తున్నారు. తనకు చెందిన 6 ఎకరాల భూమిని పూర్తిగా ప్రకృతి ఆధారిత వ్యవసాయానికి అంకితమిస్తూ, రసాయనాలు, కృత్రిమ ఎరువులను వాడకుండా, సంపూర్ణంగా ప్రకృతి వనరులపై ఆధారపడి సాగు చేస్తున్నారు. ఇది కేవలం పంటల ఉత్పత్తి కోసం మాత్రమే కాకుండా, భవిష్యత్ తరాల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకున్న బాధ్యతాయుత నిర్ణయం. వెంకటేశ్ ప్రకృతి వ్యవసాయం (APCNF - RySS) సిద్ధాంతాలను పాటిస్తూ, ఐదు లేయర్ మోడల్ వ్యవసాయ విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నారు. ఇందులో కొబ్బరి, కోకో, వాక, అరటి, మామిడి వంటి చెట్లను పై లేయర్ గా నాటి, మైక్రోక్లైమేట్ సృష్టించి, నేల తేమను నిల్వ చేయడమే కాకుండా పర్యావరణానికి అనుకూలమైన వ్యవస్థను నిర్మిస్తున్నారు. చెట్ల మధ్యలో బొబ్బర, నువ్వులు వంటి పంటలను సాగు చేసి, అదనపు ఆదాయం పొందుతున్నారు. అలాగే, పైనాపిల్, నేరేడు, నారింజ, మామిడి వంటి పండ్ల చెట్లను నాటి భూమిని బహుళ దశలుగా వినియోగిస్తున్నారు నెలను నిరంతరాం కప్పి ఉంచుతున్నారు. తన భూమిలో ప్రీమాన్సూన్ డ్రై సీడింగ్ (PMDS) విధానాన్ని అవలంబించడం ద్వారా వెంకటేశ్ ఎన్నో ప్రయోజనాలు పొందుతున్నారు. నిరంతర సాగు సాధ్యమవుతూ, నేలలో సూక్ష్మజీవులు పెరిగి భూమి ఆరోగ్యం మెరుగవుతోంది. సేంద్రీయ కార్బన్ స్థాయి పెరిగి పోషకాలు సమృద్ధిగా అందుతుండగా, నీటి నిల్వ సామర్థ్యం మెరుగై తక్కువ నీటితో సాగు కొనసాగుతోంది. వానపాముల సంఖ్య పెరగడం వల్ల నేల లోని సారం మెరుగై పంటల దిగుబడికి తోడ్పడుతోంది. ప్రత్యేకంగా 5000 లీటర్ల సామర్థ్యం గల ద్రవ జీవామృతం ట్యాంక్ నుండి డ్రిప్ ఇర్రిగేషన్ ద్వారా ప్రతి మొక్కకు జీవామృతాన్ని నేరుగా సరఫరా చేస్తున్నారు. ఈ విధానం ద్వారా తక్కువ నీటితో ఎక్కువ ప్రయోజనం లభిస్తోంది. అదే సమయంలో, భూమి జీవం పునరుద్ధరించబడుతోంది. వెంకటేశ్ తన భూమిలోని 30 సెంట్లలో " ఖుజిపటాలియా" అనే దేశీ వరి రకాన్ని సాగు చేస్తున్నారు. ఇది స్థానిక విత్తన సంపదను పరిరక్షించడంలో ఒక ముఖ్యమైన అడుగుగా నిలుస్తోంది. ప్రకృతి సంబంధిత నైపుణ్యం, భూమిపై ఉన్న అవగాహన, వ్యవసాయంపై అంకితభావం కారణంగా వెంకటేశ్ గారి వ్యవసాయ భూమి ప్రస్తుతం ఇతర రైతులకు, విద్యార్థులకు మరియు వ్యవసాయ అధికారులకు జీవంత శిక్షణ కేంద్రంగా మారింది. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించడానికి ప్రకృతి వ్యవసాయం సాధ్యమవుతుందని ఆయన ఉదాహరణ ద్వారా స్పష్టమవుతోంది. ఈ విధంగా వెంకటేశ్ ప్రకృతి వ్యవసాయాన్ని నూతన దిశగా తీసుకువెళుతూ, జిల్లాలో





రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ గా వెంకటేశ్ బాధ్యత ప్రకారం ప్రకృతి వ్యవసాయం పై అవగాహన కల్పించడం, కొత్త మోడళ్లను ప్రోత్సహించడం ఆయన కర్తవ్యమే. కానీ, తానే స్వయంగా తన పొలంలో ఈ పద్ధతిని అమలు చేసి, ఆదర్శంగా నిలిచారు. ధిని ద్వారా ఆయన కేడర్ కు మరియు రైతులకు స్ఫూర్తిగా మారారు. ఇప్పుడు మరింత మంది రైతులు ఈ పద్ధతిని అవలంబించాలని ఆయన ఆకాంక్షిస్తున్నారు.

# రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయించండి, ఎమ్మెల్యే రోషన్ కుమార్.

జంగారెడ్డి గూడెం-ప్రభాతవార్త, చింతలపూడి నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయించాలని రాష్ట్ర మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని చింతలపూడి ఎమ్మెల్యే రోషన్ కుమార్ కోరారు. గురువారం అమరావతి సచివాలయంలో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని కలసి చింతలపూడిలో ఉన్న రహదారులు దుస్థితి ని వివరించారు. ఇటీవలన కలిసిన భారీ వర్షాలు దెబ్బతిన్న రహదారుల ఛాయాచిత్రాలన మంత్రికి చూపించి వివరించారు. దాంతో మంత్రి జనార్ధన్ రెడ్డి స్పందించి నిధుల కేటాయింపులు ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు రోషన్ కుమార్ తెలిపారు.

# ప్రజల కోసం ప్రాణత్యాగం చేసిన ఉమేష్ చంద్ర

సంఘటన జరిగిన సంజీవ రెడ్డి నగర్ సెంటర్ తో పాటు తెనాలిలో కూడా ప్రజలు స్వచ్ఛంధంగా ముందుకు వచ్చి ఆయన విగ్రహాలను ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఉమేష్ చంద్ర సతీమణి, పశ్చిమ గోదావరి కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ నిజాయితీ పరుడైన ఒక పోలీసు అధికారిని ప్రజలు ఎప్పటికీ గుర్తు ఉంచుకుంటారనటానికి ఈ వర్ధంతి కార్యక్రమమే నిదర్శనమన్నారు. స్వచ్ఛంధంగా నివాళులు అర్పించేందుకు తరలి వచ్చిన ప్రజలకు చదలవాడ కుటుంబీకురాలిగా కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహ మాట్లాడుతూ తన తండ్రి నుండి దివంగత ఉమేష్ చంద్ర గురించి తెలుసుకుని, ప్రేరణ పొందానన్నారు. తెనాలి డిఎస్పి జనార్ధన్ మాట్లాడతూ పోలీస్ అంటే ఏలా ఉండాలన్న దానిని ఉమేష్ చంద్ర చూపారని, ప్రతి ఒక్క పోలీసు అధికారి, సిబ్బంది అదే బాటలో పయనిస్తే ప్రజల మెప్పును పొందగలుగుతారన్నారు. ప్రత్యేకించి ఉమేష్ చంద్ర ఎస్పిగా ఉన్న కాలంలో ఆయన దగ్గర పనిచేసిన అధికారులు చెప్పిన మాటలు ఆహుతులను ఆలోచింపచేసాయి. కార్యక్రమంలో తొలుత నాదెండ్ల, ఆలపాటి, చదలవాడ తదితరులు ఉమేష్ చంద్ర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ చిన్నారులు నుండి గౌరవ వందనం స్వీకరించారు. సభాకార్యక్రమం తదుపరి కలెక్టర్ నాగరాణి నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేసారు. పుర ప్రముఖులు, పోలీసు సిబ్బంది ఉమేష్ చంద్ర విగ్రహానికి పూలమాలలు వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో చదలవాడ కుటుంబీకులు భుజంగరావు, క్రాంతి, ఉమామహేశ్వరరావు, సాంకేతిక విద్యా శాఖ అధికారులు, కోస్తా జిల్లాల ప్రజలు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొన్నారు. చదలవాడ కుటుంబీకుల భావోద్వేగాలు ,అభిమానులు, స్థానిక విద్యావేత్తల ప్రసంగాలు, పలకరింపులు అక్కడి వాతావరణాన్ని మరింత గంభీరంగా, హృద్యంగా మార్చాయి.

# తెదేపా అధ్యక్షులు అశోక్ జన్మదిన వేడుకలు



**వేలేరుపాడు, సెప్టెంబర్4, ప్రభాత వార్త :** వేలేరుపాడు మండల అధ్యక్షులు అమరవరపు అశోక్ జన్మదిన వేడుకలను వేలేరుపాడు మండలం అంతట ఘనంగా నిర్వహించారు. మొదట తెదేపా కార్యాలయం నందు భారీ మొత్తంలో తరలివచ్చిన కార్యకర్తల నడుమ కూటమి నాయకుల సమక్షంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. తెదాపా కార్యాలయం నందు సందడి వాతావరణం నెలకొంది, బాణాసంచాలు కాలుస్తూ, తెదేపా కార్యాలయం నుండి రెడ్డిగూడెం వరకు భారీ సంఖ్యలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అమరవరపు అశోక్ స్వగృహమునందు సాయంత్రం వేళ కేక్ కట్ చేసి కార్యకర్తలు నాయకులు కలిసి భోజన ఏర్పాటులను చేశారు పెద్ద మొత్తంలో అభిమానులు తరలివచ్చారు. నూతనంగా చార్జ్ తీసుకున్నటువంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిని జి ప్రవీణ ఆశ శాలువా కప్పి అమరవరపు అశోక్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. జన్మదిన వేడుకల్లో కట్టం రాంబాబు, శాఖమూరి సంజీవులు, కురుమేల్ల సుధాకర్, కొమ్మన వెంకటేశ్వర్లు, మేచినేని సంజయ్, ఓలేటి బాలకృష్ణ, కరటూరి గోపాలకృష్ణ, కుకునూరు రాంబాబు సత్యనారాయణ, కోటపల్లి ముత్యాలరావు, నూపా శ్రీరాములు మరియు టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు .

# చింతలపూడి ఏఎంసీ చైర్మన్ గా చీదరాల దుర్గ పార్వతి నియామకం,



జంగారెడ్డిగూడెం-ప్రభాతవార్త :చింతలపూడి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గా చింతలపూడి తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు మధుబాబు సతీమణి చీదరాల దుర్గ పార్వతి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పలువురు దుర్గా పార్వతికి శుభాకాంక్షలు తెలిపారు.

# 'కొత్తలోక 'ను ప్రేక్షకులు ఆదరిస్తున్నారు



ప్రముఖ కథానాయకుడు దుల్కర్ సల్మాన్ కి చెందిన వేఫేరర్ ఫిలిమ్స్ నిర్మాణ సంస్థ నిర్మించిన మలయాళ చిత్రం 'కొత్త లోక 1: చంద్ర'. డొమినిక్ అరుణ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కళ్యాణి ప్రియదర్శన్, నస్లెన్ కె. గఫూర్ ప్రధాన పాత్రలు పోషించారు. తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత సూర్యదేవర నాగవంశీ, 'కొత్త లోక 1: చంద్ర' పేరుతో విడుదల చేశారు. భారతదేశపు మొట్టమొదటి మహిళా సూపర్ హీరో చిత్రంగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'కొత్త లోక 1: చంద్ర'.. కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో మాత్రమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంటోంది. భారీ వసూళ్ళను రాబడుతూ మలయాళ సినీ చరిత్రలో సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. మొదటి వారంలోనే రూ.100 కోట్లకు పైగా గ్రాస్ రాబట్టి సంచలన విజయం దిశగాదూసుకుపోతోంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో చిత్ర విజయోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ దర్శకులునాగ్ అశ్విన్, వెంకీ అట్లూరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రముఖ కథానాయకుడు, చిత్ర నిర్మాత దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ,కొత్త లోక కోసం ఇంత మంచి టీంతో పనిచేయడం సంతోషంగా ఉంది. ప్రతి ఒక్కరూ సినిమా కోసం మనసుపెట్టి పనిచేశారు. ఉత్తమ నటీనటులు, ఉత్తమ సాంకేతిక నిపుణుల మద్దతుతోనే ఇంతగొప్ప సినిమా చేయగలిగాము. అందరూ తమ డ్రీమ్ లా ఈ సినిమా కోసం పని చేశారు. కొత్త లోక సినిమాని ఆదరిస్తున్న తెలుగు ప్రేక్షకులకు కృతజ్ఞతలు. నన్ను ఎలాగైతే మీ వాడిగా భావించారో, అలాగే కొత్త లోకను కూడా మీ సినిమాగా భావించి ఆదరిస్తున్నందుకు ధన్యవాదాలుఅన్నారు.ప్రముఖ దర్శకుడు నాగ్‌అశ్విన్ మాట్లాడుతూ.. ఇలాంటి మంచి చిత్రాలను తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారు. తెలుగు ప్రేక్షకులు మరింతగా ఆదరిస్తారని నమ్ముతున్నానునని అన్నారు. ప్రముఖ దర్శకుడు వెంకీ అట్లూరి మాట్లాడుతూ... ఈ సినిమాని నమ్మి నిర్మాతగా ధైర్యం చేసిన దుల్కర్ సల్మాన్‌ని ముందుగాఅభినందించాలి. అలాగే సినిమాటోగ్రాఫర్ నిమిష్ రవి, ఆర్ట్ డైరెక్టర్ బంగ్లాన్ లను ప్రత్యేకంగా అభినందించాలి. సినిమాలో ప్రతి ఒక్కరూ అద్భుతంగా నటించారు. కళ్యాణి ప్రియదర్శన్ గొప్పగా నటించింది. ఈ సినిమా ఇంత గొప్పగా మలిచిన దర్శకుడు డొమినిక్ అరుణ్ ప్రతి ప్రశంసకు అర్హుడు. నాగవంశీ ఈ సినిమాతో విజయం సాధించడం ఆనందంగా ఉంది. అన్నారు.నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ.. ఈ సినిమా టీజర్ చూసి తెలుగులో నేనే విడుదల చేయాలి అనుకున్నాను.చిత్ర కథానాయిక కళ్యాణి ప్రియదర్శన్ మాట్లాడుతూ,నాకు ప్రేమ చూపించిన మొదటి ప్రేక్షకులు తెలుగువారే. అది నేను ఎప్పటికీ మరచిపోను. . కొత్తలోక సినిమాని తెలుగు సినిమాలా భావించి ఆదరిస్తున్నారు. ప్రముఖ యాంకర్ సుమ వ్యాఖ్యాతగా వైభవంగా జరిగిన ఈ వేడుకలో నటులు అరుణ్‌కురియన్, చందు, ఛాయాగ్రాహకుడు నిమిష్ రవి, కళా దర్శకుడు బంగ్లాన్, రచయిత్రి శాంతి, గీత రచయిత రాంబాబు పాల్గొని'కొత్త లోక 1: చంద్ర' చిత్ర విజయం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. సినిమాకి బ్రహ్మరథం పడుతున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## విడుదలకు ముందే రికార్డుల వేట



ఇంకా ట్రైలర్ కూడా విడుదల కాకముందే, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నూతన చిత్రం 'ఓజీ'ఉత్తర అమెరికా బాక్సాఫీస్ వద్దసంచలనాలు సృష్టిస్తూ, తన ఆధిపత్యాన్ని చాటుకుంది. ప్రీమియర్ ప్రీసేల్స్‌లో 1 మిలియన్ డాలర్లను రాబట్టి, ఈ సంచలనాత్మక ఘనతను అత్యంత వేగంగా సాధించిన చిత్రంగా నిలిచింది పవన్ కళ్యాణ్ స్టార్ డమ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరంలేదు. తన అసాధారణ క్రేజ్ తో ఎన్నో రికార్డులను ఖాతాలో వేసుకున్నారు. ఇప్పుడు 'ఓజీ'తుఫానుతో మరోసారి బాక్సాఫీస్ లెక్కలు సరి చేస్తున్నారు. అభిమానులతో పాటు, ట్రేడ్ వర్గాలు సైతం పవన్ కళ్యాణ్ సృష్టిస్తున్న సరికొత్త రికార్డుల పట్ల ఆసక్తిగా ఉన్నారు. ఓజాస్ గంభీర అనే శక్తివంతమైన పాత్రలో పవన్ కళ్యాణ్ కనువిందు చేయనున్న ఈ చిత్రం సెప్టెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదలకు మూడు వారాల ముందే.. ఓజీగా ఆయన బాక్సాఫీస్‌ను శాసిస్తున్నారు. ఆకలితో ఉన్న చిరుతపులిలా, పవన్ కళ్యాణ్ ఒకదాని తర్వాత ఒకటి అన్నట్టుగా రికార్డులను వేటాడుతున్నారు. ఓజీ చిత్రం నుండి ఇప్పటిదాకా విడుదలైన ప్రతి పోస్టర్, ప్రతి గ్లింప్స్ సామాజిక మాధ్యమాల్లో సంచలనం సృష్టించాయి. ఖిఓజీఖిపై అంచనాలు రోజురోజుకి పెరిగిపోతున్నాయి. పవన్ కళ్యాణ్ అభిమానులు మాత్రమే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులంతా ఈ సినిమా కోసం ఎంతగానో ఎదురుచూస్తున్నారు. 'ఓజీ'వసూళ్ల పరంగా బాక్సాఫీస్ వద్ద ప్రకంపనలు సృష్టించి, మైలురాయి చిత్రంగా నిలుస్తుంది అనడంలో ఎటువంటి సందేహం లేదు. పవన్ కళ్యాణ్ గంభీరగా గర్జించనున్న 'ఓజీ'చిత్రంలో ఇమ్రాన్ హష్మీ, ప్రియాంక అరుళ్ మోహన్, ప్రకాష్ రాజ్, శ్రియా రెడ్డి, అర్జున్ దాస్ వంటి అద్భుతమైన తారాగణం ఉన్నారు. దర్శకుడు సుజీత్ ఈ చిత్రాన్ని ఒక సినిమాటిక్ తుఫానుగా రూపొందిస్తున్నారు. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య, కళ్యాణ్ దాసరి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు..ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది.



శివానీ నాగరం

## 'ఆల్క' రూపంలో సరికొత్త థ్రిల్లర్ డ్రామా

అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న "ఆల్కహాల్" చిత్ర టీజర్ విడుదలైంది. ఈ సినిమా ప్రేక్షకులను కట్టిపడేసే, ఒక గొప్ప సినిమాటిక్ అనుభవాన్ని ఇస్తుందనే నమ్మకాన్ని టీజర్ కలిగించింది. "ఆల్కహాల్" చిత్రం ఒక ఉత్కంఠభరితమైన థ్రిల్లర్ డ్రామా అని తెలిపేలా టీజర్ ను అద్భుతంగా రూపొందించారు. మద్యం కథానాయకుడి జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో, తాగడానికి ముందు , తాగిన తరువాత అతని ప్రవర్తన, దాని చుట్టూ జరిగే సంఘటనల సమాహారాన్ని ఈ టీజర్ సూచిస్తుంది.హాస్యం మాత్రమే కాకుండా, నవరసాలను అద్భుతంగా పలికించగల నటుడిగా పేరుగాంచిన అల్లరి నరేష్,"ఆల్కహాల్" రూపంలో మరో వైవిధ్యమైన చిత్రాన్ని అందించబోతున్నారు. ఇందులో ఆయన సరికొత్త అవతారంలో కనిపిస్తున్నారు. ఈ సినిమాతో నరేష్, పూర్తిగా కొత్త మార్గంలో అడుగుపెడుతున్నట్లు కనిపిస్తోంది. ఇది ప్రేక్షకులలో ఉత్సుకతను పెంచుతుంది. సుహాస్ నటించిన ఫ్యామిలీ డ్రామా తో విమర్శకుల ప్రశంసలతో పాటు, ప్రేక్షకుల మెప్పు పొందిన దర్శకుడు మెహర్ తేజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈసారి ఆయన, ఈ సినిమాని శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై తెలుగు చిత్ర పరిశ్రమలో అత్యంత ప్రసిద్ధి చెందిన నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. "ఆల్కహాల్" టీజర్ లో సాంకేతిక నిపుణుల ప్రతిభ అడుగడుగునా కనిపించింది. ఈ చిత్రానికి గిబ్రాన్ సంగీతం అందిస్తుండగా, చేతన్ భరద్వాజ్ నేపథ్య సంగీతం అందిస్తున్నారు. ఛాయాగ్రాహకుడిగా జిజు సన్నీ, ఎడిటర్‌గా నిరంజన్ దేవరమానే వ్యవహరిస్తున్నారు.. అల్లరి నరేష్, సత్య కలయికలో పండే వినూత్న హాస్యం ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. వీరి కలయిక, ఈ మిస్టరీ మరియు థ్రిల్లింగ్ డ్రామాకు వినోద పొరలను జోడిస్తుంది. ఈ చిత్రం జనవరి 1, 2026న ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది.



## 'మటన్‌సూప్' సాంగ్ విడుదల



డిఫరెంట్ కథ, కథనాలతో రామకృష్ణ వట్టికూటి సమర్పణలో అలుక్కా స్టూడియోస్, శ్రీ వారాహి ఆర్ట్స్, భవిష్య విహార్ చిత్రాలు (బివిసి) బ్యానర్లపై రమణ్, వర్షా విశ్వనాథ్ హీరో హీరోయిన్లుగా రామచంద్ర వట్టికూటి తెరకెక్కించిన చిత్రం 'మటన్ సూప్'. విట్‌నెస్ ది రియల్ క్రైమ్ ట్యాగ్ లైన్. మల్లిఖార్జున ఎలికా (గోపాల్), రామకృష్ణ సనపల, అరుణ్ చంద్ర వట్టికూటి నిర్మాతలు గా రానున్న ఈ నూతన చిత్రానికి సంబంధిం చిన టైటిల్ పోస్టర్, మోషన్ పోస్టర్, పాటలు ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.రీసెంట్‌గా తనికెళ్ల భరణి రిలీజ్ చేసిన 'హర హర శంకరా 'అనే పాట కూడా మంచి ప్రశంసల్ని దక్కించి, మంచి వ్యూస్‌తో దూసుకుపోతోంది. ఈ క్రమంలోతాజాగా ప్రముఖ నటుడు మురళీ మోహన్ ' కల్లు కొట్టు కాడ 'అంటూ సాగే మరో మంచి మాస్ ఎనర్జిటిక్ నంబర్‌ను రిలీజ్ చేశారు. ఈ ప్రత్యేక గీతాన్ని సూరన్న రచించారు. సూరన్న, రేలారే రేలా గోపాల్, సుజాత వాసు కలిసి ఆలపించిన ఈ పాటకు వెంకీ వీణ అందించిన బాణీ ఎంతో క్యాచీగా ఉంది. ఇక లిరికల్ వీడియోని చూస్తుంటే సత్య మాస్టర్ కొరియోగ్రఫీ మరో స్పెషల్ అట్రాక్షన్ కానున్నట్టుగా కనిపిస్తోంది.సాంగ్ రిలీజ్ చేసిన అనంతరం మురళీ మోహన్ మాట్లాడుతూ,మటన్ సూప్‌టైటిల్ చాలా బాగుంది.యంగ్ టీం చేసిన ఈ ప్రయత్నానికి పెద్ద సక్సెస్ దక్కాలి. సాంగ్ చాలా బాగుంది. అల వైకుంఠపురములో సూరన్న మంచి పాటను పాడారు. జాన పద గీతాలు ప్రస్తుతం ఎక్కువ సక్సెస్ అవుతున్నాయి.'మటన్ సూప్' పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను అని అన్నారు.చిత్ర దర్శకుడు రామచంద్ర వట్టికూటి మాట్లాడుత., 'కల్లు కొట్టు కాడ' పాటను రిలీజ్ చేసిన మురళీ మోహన్‌కి థాంక్స్ ఈ పాట ఎస్ఆర్‌కే గారి వల్లే పుట్టింది. గోపాల్ లేకపోతే ఈ ప్రాజెక్ట్ ఉండేది కాదు. మా అన్న ,రామకృష్ణ నాకు ఈ ప్రయాణంలో అండగా నిలిచారు. మా హీరో రమణ్ సహకారం ఎప్పటికీ మర్చిపోలేను. మా సినిమాను పర్వతనేని రాంబాబు నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లారు. త్వరలోనే ఆడియెన్స్ ముందుకు తీసుకు రాబోతోన్నామని అన్నారు.నిర్మాత మల్లిఖార్జున ఎలికా (గోపాల్) మాట్లాడుతూ.నాలాంటి చిన్న వాళ్లను ఆశీర్వదించేందుకు వచ్చిన మురళీ మోహన్‌కి థాంక్స్.కల్లు కొట్టు కాడసాంగ్ చాలా బాగా వచ్చింది. వెంకీ వీణ మంచి బాణీని ఇచ్చారు. ఈ పాట వినగానే గ్రాండ్‌గా తీయాలని ఫిక్స్ అయ్యాం. త్వరలోనే మా 'మటన్ సూప్' చిత్రం ఆడియెన్స్ ముందుకు రాబోతోంది అని అన్నారు.నిర్మాత రామకృష్ణ సనపల మాట్లాడుతూ.,'మటన్ సూప్' చిత్రంలో 'కల్లు కొట్టు కాడ' అంటూ సాగే రెండో పాటను రిలీజ్ చేసిన మురళీ మోహన్‌కి థాంక్స్. ఇలాంటి పెద్దల సహకారం వల్లే మా లాంటి చిన్న నిర్మాతలు, మాలాంటి వాళ్లు తీసే చిన్న చిత్రాలు నిలబడుతున్నాయి. త్వరలోనే మా సినిమాను ఆడియెన్స్ ముందుకు తీసుకు రాబోతోన్నామని అన్నారు.హీరో రమణ్ మాట్లాడుతూ..'మటన్ సూప్'సినిమాలోని మాస్ సాంగ్‌ను రిలీజ్ చేసిన మురళీ మోహన్‌కి ధన్యవాదాలు. ఈ విషయంలో సహకరించిన ప్రభుకి, పర్వతనేని రాంబాబుకి థాంక్స్. రామచంద్రఈ చిత్రాన్ని బాగా తీశారు. ఈ మూవీ పెద్ద సక్సెస్ అవుతుందని నమ్మకంగా ఉన్నామని అన్నారు.నటుడు గోవింద్ శ్రీనివాస్ మాట్లాడుతూ,ఈ చిత్రంలోని'కల్లు కొట్టు కాడ' పాటను రిలీజ్ చేసిన మురళీ మోహన్‌కి ధన్యవాదాలు. ఈ చిత్రంలో రామచంద్ర నాకు మంచి పాత్రను ఇచ్చారు. సినిమా చాలా బాగా వచ్చింది. ఈ మూవీని త్వరలోనే ఆడియెన్స్ ముందుకు తీసుకు రాబోతోన్నామని అన్నారు.

## సీజన్ 4లో సందడి చేసిన జెనీలియా



సెఆహా ఓటీటీ "తెలుగు ఇండియన్ ఐడల్ తెలుగులో అతి పెద్ద సింగింగ్ షో ఆహా ఓటీటీ తెలుగు ఇండియన్ ఐడల్ సీజన్ 4 సక్సెస్ ఫుల్‌గా ప్రేక్షకుల్ని అలరిస్తోంది. ఈ సీజన్4 ఎపిసోడ్ లో తాజాగా హాసినీగా తెలుగు ఆడియెన్స్ కు గుర్తుండిపోయిన హీరోయిన్ జెనీలియా అతిథిగా పాల్గొన్నారు. జెనీలియా అతిథిగా సందడి చేయడం తెలుగు ఇండియన్ ఐడల్ సీజన్ 4కు ఒక హైలైట్ గా నిలుస్తోంది.ఈ సంగీత కార్యక్రమానికి ప్రముఖ సంగీత దర్శకులు తమన్, గాయకులు కార్తీక్ మరియు గీతా మాధురి జడ్జెస్ గా అలాగే శ్రీరామచంద్ర హోస్ట్ గా, సమీరా భరద్వాజ్ కో హోస్ట్ గా వ్యవహరిస్తున్నారు. ప్రతి శుక్రవారం, శనివారం సాయంత్రం 7 గంటలకు ఆహా ఓటీటీలో తెలుగు ఇండియన్ ఐడల్ సీజన్ 4ప్రసారమవుతోంది. ప్రేక్షకులకు వినోదాన్ని పంచుతూనే ప్రతిభ ప్రోత్సహించేందుకు ఈ తరహా రియాలటీ షోలను ఆహా అందించడంపై సర్వత్రా ప్రశంసలు వస్తున్నాయి .

## అన్నిఏజ్ గ్రూప్‌ల వారిని అలరిస్తుంది

"లిటిల్ హార్ట్స్" హిలేరియస్ రోమ్ కామ్ మూవీ, అన్ని ఏజ్ గ్రూప్ ఆడియెన్స్‌ను ఎంటర్ టైన్ చేస్తుంది హీరో మౌళి తనుజ్ "90ఎస్ మిడిల్ క్లాస్ బయోపిక్' ఫేమ్ మౌళి తనుజ్, "అంబాజీపేట మ్యారేజి బ్యాండు" మూవీతో గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ శివానీ నాగరం లీడ్ రోల్స్ లో నటిస్తున్న మూవీ "లిటిల్ హార్ట్స్". ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ బ్యానర్ పై దర్శకుడు సాయి మార్తాండ్ రూపొందించారు. "90ఎస్ మిడిల్ క్లాస్ బయోపిక్" ఫేమ్ డైరెక్టర్ ఆదిత్య హాసన్ "లిటిల్ "లిటిల్ హార్ట్స్" మూవీకి నిర్మాతగా వ్యవహరించారు. ఈ సినిమాను నిర్మాతలు బన్నీ వాస్, వంశీ నందిపాటి థియేట్రికల్ గా రిలీజ్ చేస్తున్నారు. "లిటిల్ హార్ట్స్" సినిమా ఈ నెల 5న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూలో మూవీ హైలైట్స్ తెలిపారు హీరో మౌళి తనుజ్.నేను రైటర్, డైరెక్టర్ అవుదామనే ఇండస్ట్రీకి వచ్చాను. ఇండస్ట్రీకి వచ్చాక నటుడిగా అవకాశం వచ్చింది. అలా "90ఎస్ మిడిల్ క్లాస్ బయోపిక్"తో మీ అందరిలో గుర్తింపు తెచ్చుకున్నా. "లిటిల్ హార్ట్స్" కథ విన్నప్పుడే ఇది థియేట్రికల్‌గా బాగుంటుందనినిర్ణయించుకున్నాం. ఈటీవీ విన్ వాళ్లు కూడా మా నిర్ణయాన్ని సపోర్ట్ చేశారు. ఇప్పుడు మా ప్రయత్నమంతా థియేటర్స్ కు ప్రేక్షకుల్ని రప్పించాలి. మా ప్రమోషనల్ కంటెంట్ తో "లిటిల్ హార్ట్స్" బాగుంటుందనే అభిప్రాయం ప్రేక్షకుల్లో కలిగింది. ఈ బ్యాచ్ మనల్ని థియేటర్స్‌లో నవ్విస్తారు అనే నమ్మకం ప్రేక్షకుల్లో కలుగుతోంది. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం ప్రమోషనల్ యాక్టివిటీస్ కోసం స్క్రిప్ట్ సైడ్ నేనే వర్క్‌చేశా. కొత్తగా ఉండేలా ప్లాన్‌చేశా. "లిటిల్ హార్ట్స్" లో అలాంటి కంటెంట్ ఉంది.వీలైనన్ని మంచి చిత్రాల్లో నటించాలని ఉంది. ఇప్పుడు నటుడిగా అవకాశాలు వస్తున్నాయి కాబట్టి నటిస్తుంటా. మా కుటుంబంలో ఎవరికీ సినిమా ఇండస్ట్రీతో పరిచయాలు లేవు. నేను కూడా ఇక్కడ స్థిరపడగలనని మా ఫ్యామిలీ వారికి నమ్మకం లేకుండేది. "లిటిల్ హార్ట్స్" సినిమా స్క్రిప్ట్ వరకు నా ఇన్వాల్వ్ మెంట్ లేదు. "లిటిల్ హార్ట్స్" సినిమాను మా పేరెంట్స్ ఇంకా చూడలేదు. రేపు చూపిస్తాను."లిటిల్ హార్ట్స్" చాలా ఎంటర్ టైనింగ్ గా ఉంటుంది. అన్ని క్యారెక్టర్స్ మీకు బాగా కనెక్ట్ అవుతాయి. రోమ్ కామ్ మూవీస్ లో చివరలో ఒక మంచి అనుభూతి కలగాలి. అలా ప్రేక్షకులు ఫీల్ అయితే సినిమా వారి మనసుకు హత్తుకున్నట్లు."లిటిల్ హార్ట్స్" చూశాక ప్రేక్షకులు మంచి సినిమా చూశామనే అనుభూతికి లోనవుతారు "లిటిల్ హార్ట్స్" ప్రమోషన్స్ లో మేము జెన్యూన్‌గా మాట్లాడుతున్నాం. ప్రేక్షకులకు కనెక్ట్ అవుతున్నాం. ఇలాంటి సినిమాను థియేటర్స్ లో చూస్తేనే కామెడీ ఫీల్ అవుతారు. ఓటీటీలో చూస్తే అంతగా కనెక్ట్ కారు. అందుకే థియేటర్స్ లో చూడమని కోరుతున్నాం.



మౌళి తనూజ్

## 'మిరాయ్' లో పవర్‌ఫుల్ క్యారెక్టర్ చేశా



మంచుమనోజ్

సూపర్ హీరో తేజ సజ్జా మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా విజువల్ వండర్ 'మిరాయ్'. ఈ చిత్రానికి కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించారు. రాకింగ్ స్టార్ మనోజ్ మంచు పవర్ ఫుల్ పాత్ర పోషించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ భారీ స్థాయిలో నిర్మించారు. ఇప్పటికే గ్లింప్స్, టీజర్, ట్రైలర్ మ్యాసీవ్ బజ్‌ను క్రియేట్ చేశాయి. సెప్టెంబర్ 12న ఈ సినిమా గ్రాండ్ గా రిలీజ్ కాబోతుంది. ఈ సందర్భంగా రాకింగ్ స్టార్ మనోజ్ మంచు విలేకరులు సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

. మిరాయ్ ప్రాజెక్ట్ అప్రోచ్ ఎలా జరిగింది?

కార్తీక్ ఈవెంట్ కలిసినప్పుడు మంచి స్క్రిప్ట్ వుంటే కలిసి సినిమా చేద్దాం తమ్ముడుఅని చెప్పాను.రోజు మా గేమింగ్ స్టూడియోలో వున్నప్పుడు తేజ వచ్చి మిరాయ్ గురించి చెప్పాడు, కార్తిక్‌చెప్పిన కథ చాలా నచ్చింది.

ఇందులో మీ క్యారెక్టర్ మోడరన్ రావణ అనుకోవచ్చా?

అనుకోవచ్చు. కానీ ఆడవారి జోలికి వెళ్లడు.

. డైరెక్టర్ కార్తీక్ గురించి?

కార్తీక్ గ్రేట్ టెక్నీషియన్. ఇదే కంటెంట్ ని మరో డైరెక్టర్ చేస్తే మాత్రం ఈ బడ్జెట్ లో అవ్వదు. తన అనుభవంతో కార్తీక్ హాలీవుడ్ స్థాయిలో ఈ సినిమాని తీశారు. కచ్చితంగా ఈ సినిమా ప్రేక్షకులకు నచ్చుతుందని నమ్ముతున్నాను.

నిర్మాత విశ్వప్రసాద్ సపోర్ట్ గురించి?

విశ్వ ప్రసాద్ విజన్ అప్రిషియేట్ చేయాలి. ఆయన పని రాక్షసుడు. చాలా గ్రాండ్ స్కేల్లో సినిమా తీశారు. ఎక్కడ కాంప్రమైజ్ అవ్వలేదు.ఈ సినిమా దాదాపుగా అన్ని లైవ్ లొకేషన్ లోనే షూట్ చేశాం. రియల్ లొకేషన్స్ లో గ్రాఫిక్స్ ని వాడి సినిమా ఎక్స్పీరియన్స్ ని మరింతగా అన్హాన్స్ చేశాం. ఇందులో యాక్షన్స్ అంతా లైవ్ గా వుంటుంది.ట్రైలర్ రిలీజ్ అయిన తర్వాత ఎలాంటి రెస్పాన్స్ వచ్చింది?

నా లైఫ్ లో హైయస్ట్ రెస్పాన్స్ వచ్చిన ట్రైలర్ ఇది. ఇనిషియల్ డేస్ లో మిస్టర్ నూకయ్య, నేను మీకు తెలుసా సినిమాలకు కూడా చాలా అద్భుతమైన స్పందన వచ్చింది. అయితే ఈ స్కేల్లో సినిమా రావడం, ప్రపంచంలో నలుమూలల నుంచి రెస్పాన్స్ రావడం చాలా ఆనందాన్నిచ్చింది.

## క్రేజీ యాక్షన్ ఎంటర్ టైనర్

శివకార్తికేయన్ హై ఆక్టేన్ యాక్షన్ ఎంటర్టైనర్ మదరాసి. ఎ.ఆర్. మురుగదాస్ దర్శకత్వంలో శ్రీ లక్ష్మీ మూవీస్ నిర్మించిన ఈ ప్రతిష్టాత్మక వెంచర్ ఇప్పటికే టీజర్, ట్రైలర్, రెండు చార్ట్‌బస్టర్ సింగిల్స్ తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. ఈ చిత్రం సెప్టెంబర్ 5న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా హీరో శివకార్తికేయన్ సినిమా విశేషాల్ని పంచుకున్నారు.

ఫస్ట్ టైం ఎ.ఆర్. మురుగదాస్ తో వర్క్ చేయడం ఎలా అనిపించింది ?

మెగాస్టార్ చిరంజీవి, సూపర్‌స్టార్ మహేష్‌బాబు లాంటి పెద్ద స్టార్స్ ని డైరెక్ట్ చేసిన డైరెక్టర్ మురుగదాస్. చాలా కూల్ గా ఉంటారు. చాలా క్లారిటీ ఉంటుంది. ఆయన నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. ఈ సినిమా షూటింగ్ అంతా చాలా పాజిటివ్ ఎక్స్పీరియన్స్ ఇచ్చింది. ఆయనతో కలిసి వర్క్ చేసినందుకు చాలా సంతోషంగా ఉంది. సాలిడ్ ఫిల్మ్ ఇచ్చారు.

ఈ సినిమాలో రుక్మిణీ వసంత్ పాత్ర ఎలా వుంటుంది?

ఈ సినిమాలో లవ్, యాక్షన్ రెండు పిల్లర్స్. అందులో లవ్ పోర్షన్ అద్భుతంగా రావడానికి కారణం రుక్మిణి. ఈ సినిమాలో తన పాత్ర చాలా కీలకం. కథకి ఎమోషన్ యాడ్ చేసే రోల్ అది. తన పెర్ఫార్మెన్స్ సినిమాకి బిగ్ ఎసెట్.

మదరాసి సినిమా ఎలా ఉండబోతోంది?

మదరాసి కథ చాలా కొత్తగా వుంటుంది. హై వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్ ఉన్నాయి. ఎమోషన్, యాక్షన్, కాన్వాస్ పరంగా బిగ్ ఎక్స్పీరియన్స్ ఇచ్చే సినిమా ఇది.ఈ సినిమాలో యాక్షన్ బ్లాక్స్ ఆడియన్స్ ని మెస్మరైజ్ చేస్తాయి. యాక్షన్‌లో మ్యాడ్ నెస్ వుంటుంది. అది ఆడియన్స్ కి చాలా డిఫరెంట్ ఎక్స్ పీరియన్స్ ఇస్తుంది.బిగ్ స్క్రీన్ పై సినిమా సెలబ్రేట్ చేసుకునేలా వుంటుంది .



# పోషకాల పంటలు పండిస్తూ..

నెలల పిల్లలు రక్తహీనతతోనూ... ఐదేళ్ల చిన్నారుల్లో 40 శాతం మంది తక్కువ బరువుతోనూ బాధపడుతున్నారు. ఇక మహిళలు, గర్భిణుల సంగతైతే చెప్పనక్కర్లేదు. పోషకాహార లోపం, దీర్ఘకాల, వారసత్వ వ్యాధులతో ఎటు చూసినా అనారోగ్య సమస్యలే... ఈ పరిస్థితులను అధిగమించడానికి అక్కడి మహిళలంతా ఏం చేశారంటే...



ఒడిశాలోని కొరాపుట్ జిల్లాలో గిరిజన గ్రామాలే ఎక్కువ. అసలే కరువు పీడిత ప్రాంతం... దానికి తోడు అనారోగ్యాలు. అవగాహనా లోపంతో అనారోగ్య సమస్యల్ని శాపాలుగా భావించే వారే ఎక్కువ. ఇలా అగమ్యగోచరంగా ఉన్న వాళ్ల జీవనశైలిలో ఒక నివేదిక పెను మార్పులు తెచ్చింది. 2023లో ఎంఎస్ఎస్ స్వామినాథన్ ఫౌండేషన్... కొరాపుట్లోని కొన్ని గ్రామాల్లో హెల్త్ సర్వే నిర్వహించింది. ఆ సర్వేలో గిరిజనుల్లో సగానికి పైగా అనారోగ్యాలతో బాధపడుతున్నట్లు వెల్లడైంది. దీనికంతటికి కారణం పోషకాహార లోపమని తేలింది. అడవిలో దొరికే ఆకులు, అలమ వారికి ఆహారం మరి. దీనివల్ల తరానికి తరం తుడిచిపెట్టుకుపోయే పరిస్థితి ఉంది. అది మారాలంటే స్థానికుల్లో, సమస్యపై అవగాహన రావాలి. అందుకే మహిళలందరినీ ఓ చోట చేర్చిందా సంస్థ. వారిలో చైతన్యం కలిగిస్తూనే, ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని సేంద్రియ వ్యవసాయం చేయడం ఎలానో నేర్పింది.

**2వేల మంది మహిళలు...** పది మంది మహిళలతో మొదలైంది ఈ ప్రయాణం. వీళ్లంతా గృహిణులే. పెరట్లో, చుట్టు పక్కల, వ్యవసాయ భూముల్లో... ఇలా తమకు వీలైనన్నిచోట్ల పండ్లు, కూరగాయలు, వరి లాంటివి పండించడం మొదలుపెట్టారు. ఎన్జీవోలు, ప్రభుత్వ సంస్థలు ఇచ్చిన శిక్షణను అందించారు. రెండు సెంట్ల భూమైనా, ఎకరాలు సేద్యం చేస్తున్నా... అంతా సేంద్రీయ పద్ధతిలోనే పండాలని నిశ్చయించు కున్నారు. అందుకు అను గుణంగా ప్రణాళికలు వేసుకుని...అనతి కాలంలోనే సేద్యాన్ని రూపొందించారు. వారి కృషి, దిగుబడి, సమస్యలను అధిగమించే తీరు చూసిన చుట్టుపక్కల మహిళలు ఒక్కొక్కరుగా పని నేర్చుకోవడం మొదలు పెట్టారు. ఇప్పుడు 2వేల మందికి పైగా సేంద్రియ వ్యవసాయాన్ని మహిళలు చేస్తున్నారు. బెడ్లను ఏర్పాటు చేసుకుని తక్కువ స్థలంలోనే ఇంటికి కావాల్సిన కూరగాయలు పండిస్తున్నారు. దాంతో ఎక్కడ చూసినా న్యూట్రీ గార్డెన్లతో సస్యశ్యామలంగా ఉన్నాయా గ్రామాలు. ఇదంతా అక్కడి మహిళల కృషికి నిదర్శనమే. పోషకాహార లోపాన్ని అధిగమించడానికి ప్రయత్నిం చూనే... అధిక దిగుబడి వచ్చినప్పుడు ఆర్థికం గానూ లబ్ధి పొందుతున్నారు. తరవతి తరాలు కూడా ఈ స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలనే ఆలోచనతో.... స్థానిక పాఠశాలల్లోనూ వ్యవసాయ విద్యను పాఠాలుగా నేర్పుతున్నారు. ▢

# విద్యాబోధనలో గురువుల పాత్ర

**సమాజంలో అన్ని రుగ్మతల నుంచి బయటపడేందుకు ఉపాధ్యాయుల బోధనలు ఎంతో కీలకం.తల్లిదండ్రుల తరవాత గురువుల స్థానం ఎంతో కీలకం. అందు వలననే సమాజనిర్మాణంలో వారిదే కీలక పాత్ర.సమాజ నిర్దేశకులు గురువులే. మారుతున్న కాలానుగుణంగా విద్యాబోధనలో మార్పులు రావాలే కానిగురువులపై భావనలో మార్ప రానీయకూడదు.**

విద్యాబుద్ధులు నేర్చుకున్న ప్రతి ఒక్కరూ గురువుపై అమితమైన ప్రేమానురాగాలు కలిగి ఉండాలి. సమాజంలో గురువులకున్న గురుతర బాధ్యతలను ఎప్పటికీ విస్మరించకూడదు. ప్రస్తుతము ప్రభుత్వ పాఠశాలలో కూడా మౌలిక వసతులు మెరుగుపడు తున్నాయి, కావున విద్యావిధానంలో కొత్త సాంకేతిక మార్పులు వస్తున్నాయి. వాటికనుగుణంగా విద్యాబోధనలో మార్పు అనివార్యము.



విద్యార్థులను తీర్చిదిద్దములో గురువుల పాత్ర కీలకం. మట్టిని విగ్రహంగా మార్చినట్టే పిల్లలకు ఉత్తమ విద్యను అందించి వారిలో ప్రతిభను వెలికి తీయడం, క్రమశిక్షణ గల విద్యాబోధన అందించడం ద్వారా ఉన్నత స్థానానికి చేరుకునేలా తీర్చిదిద్దే బాధ్యత గురువులదే. గురువులు అంకితభావంతో పనిచేయడంతో బాటు చెడ్డపేరు రాకుండా మంచి ప్రవర్తన కలిగివుండాలి. విద్యర్థుల్లో ఇమిడి వుండే ప్రతిభను వెలికి తీసే పనిని తమ ప్రాథమిక బాధ్యతగాగుర్తించి ఉపాధ్యా యులు పని చేయాలి. ఉపాధ్యాయులు దేశభవిష్యత్తుకు మంచి భరోసా కలిగించేవారుగా ఉండాలి. ప్రతి ఒక్కరి జీవితంలో ఉపాధ్యాయుల పాత్ర ప్రముఖంగా ఉంటుంది. అప్పుడే ప్రతి ఒక్కరూ తమ గురువులను జీవితాంతం గుర్తు పెట్టుకుంటారు. తమ విద్యార్థులనుప్రేమతో, అంకిత భావంతో తీర్చిదిద్దే గురువులను తమ విద్యార్థుల నుంచి మంచిగౌరవం పొందుతారు.విద్యార్థులు తమ భవిష్యత్తును నిర్మించుకుని ఆశయాలను సాధించే దిశగా వారిని తీర్చిదిద్దే అంశంలో గురువులు స్ఫూర్తి దాయకంగా ఉండాలి. వారి పాత్ర కీలకం. చదువు పై విద్యార్థులకు శ్రద్ధ, ఆసక్తి పెంపొందించడం గురువుల విధి, తమ ప్రవర్తన, నడవడిక, బోధన ద్వారా గురువులు తమ విద్యార్థుల భవిష్యత్తుకు రూపకర్తలుగా పనిచేయాలి. ప్రతి విద్యార్థి విభిన్న సామర్థ్యాలు, ప్రతిభ, మనస్తత్వం, సామాజిక నేపథ్యం కలిగి ఉంటారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి గురువుల పాత్ర కీలకం. జ్ఞానం ఆధారంగా న్యాయమైన సమాజాన్ని నిర్మించడంలో సహాయపడే విద్యను విద్యార్థులకు గురువులు అందించాలి. విద్యార్థులు రాజ్యాంగ విలువల పట్ల నిబద్ధతను పెంపొందించుకునే విధంగా గురువులు విలువలతో కూడిన పాఠాలు బోధించాలి. దేశాభివృద్ధిలో గురువుల





పాత్రచాలా కీలకంగా ఉంటుంది. మన కొత్త తరం ఆలోచనలు రూపు దాల్చే అంశంలో ఉపాద్యాలు పాత్ర కీలకం. భారతదేశ భవిష్యత్తును రూపొందించ డానికి అవిశ్రాంతిగా కృషి చేస్తున్నారు గురువులు లేదా ఉపాధ్యాయులు. ఆదర్శవంతంగా, ఉపాధ్యాయు లందరూ తమ తరగతి గది వాతావరణం విద్యార్థులందరినీ ప్రేరేపించే ప్రదేశంగా వుండాలని కోరుకుంటారు. అలా చేయడం ద్వారా విద్యార్థులు చెప్పే పాఠాలయందు నిమగ్నమై వుంటారు. ఏ సమాజానికైనా అవసరమైనవి సామాజిక, ఆర్థిక, రాజకీయ, నైతిక, వైజ్ఞానిక, మానసీయ విలువలు.ఇవే ఆ సమాజ స్థితిని, నాగరిక స్థితిని , నాగరిక స్థాయిని అంచనా వేసే సాధనాలుగా నిలుస్తాయి. అంతటి ప్రాముఖ్యత కలిగిన ఈ విలువలు సాధనాలుగా పెంపొందించేది విద్యారంగమే. విద్యారంగానికి కీలకమైన, మూలస్తంభాలు ఉపాధ్యాయులే. వారివలననే పైన చెప్పినవన్నీ సాధ్యమవుతాయి.మారిన సామాజిక విలువలు. విలువలతో కూడిన విద్య, సమాజాభివృద్ధికి బాటలు వేస్తుంది. మానవత్వానికి, ప్రకృతికి అర్థం చెప్పే ఆ జీవన ప్రక్రియ విద్య.ప్రాచీనభారత విద్యావ్యవస్థ వ్యక్తిత్వ నిర్మాణం, విలువలుల, నైతిక, నిస్వార్థ జీవన విదానాలను నేర్పింది. సామాజిక అభివృద్ధికి దోహదపడింది. ఈ ప్రక్రియలో గురువులదే ప్రత్యేక స్థానం. ఉత్తమ ఫలితాల కోసం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు సమాజాలసుందర అనుసంధానం జరగాలి. విద్యార్థులతో సాంగత్యం, జీవితాల పరిశీలన, మానవ విలువలపై చర్చ, సామాజికసమకాలీన అంశాలపై స్పందన, తాత్విక ఆలోచనల పరంపర ఇవి ఉపాధ్యాయుడికి అవసరం. భోదించే వాడు ఉపాధ్యా యుడు. స్వీకరించే వాడు విద్యార్థి. స్వీకరించాలంటే బోధించ డానికి గురువు దగ్గర ఏదో ఉండాలి. అనుభవాలు, పరిశీలనలు, విజ్ఞానం ఏదైనా కావచ్చు. అందుకే గురువులు సమా జానికి ఆదర్శంగా ఉండాలని కోరుకుంటారు. ఆ రకంగానైనా సమాజం ఉపాధ్యాయుడిని గౌరవించి నట్టే. విద్యాలక్ష్యాల సాధనలో బాధ్యతతో పురోగమ సమాజానికై ఆరాటపడే నిత్య అన్వేషి, క్రమశిక్షణ గల సైనికుడే నేటి సమాజంలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా రాణించ గలడని చెప్పక తప్పదు.

**- ఎ.ఎస్.ఎస్**

# మూడ్ లేదా.. మార్కెట్‌కి వెళ్లండి..



**మానసిక స్థితి సరిగా లేనప్పుడు... ఉన్న చోటు మారితే పరిష్కారం దొరకుతుందని, మనసుకు సాంత్వన కలుగుతుందని మానసిక నిపుణుల సలహా. కానీ అందరికీ అలా వెళ్లే వీలుంటుందా?**

అందులోనూ ఇంత బయట పనులుచేసే అమ్మాయిలకీ మహిళలకీ అస్సలే ఉండదు. . అలాంటప్పుడు... ఒక సంచి తీసుకుని... కూరగాయల మార్కెట్‌కి వెళ్లండి. చిన్నచిన్న సంతోషాల్ని వెతుకుతూ... రూపాయి, రూపాయిని లెక్కించుకుంటూ నిర్మలంగా ఉంటే కష్టజీవులు అక్కడ ఉంటారు. తరతమ భేదం లేకుండా చక్కటి నవ్వుతో పలకరిస్తారు. ఒడిలో చిన్న పిల్లలతో ఎండనకా, వాననకా వాళ్లు పడే శ్రమ చూస్తే... మనదీ ఓ కష్టమేనా అనిపిస్తుంది. ఆశావాదానికీ రేపటి జీవితం బాగుండాలంటే తాపత్రాయానికీ చిరునామా వాళ్లు. వేలు సంపాదిస్తున్నా మనకు లేని ప్రశాంతత... వాళ్లలో కనిపిస్తుంది. ఉన్న, వచ్చినదాంట్లో సర్దుకోవడమెలాగో ఒక్కసారి వాళ్లతో మాట్లాడితే అర్థమవుతుంది. పైగా బేరసారాలు చేస్తూ ఒక్కొక్క వస్తువు కొంటుంటే... ఎంత ఆత్మసంతృప్తి. డిజిటల్ డెలివరీలు పనికొస్తాయా దానిముందు. అందుకే మనసు బాగో కుంటే.. ఒక్కసారి మార్కెట కి వెళ్లి రండి! ▢

# కురులకు బిర్యానీ ఆకు

పావు కప్పు కొబ్బరినూనెలో రెండు బిర్యానీ ఆకులు వేసి వేడి చేయండి. తరవాత దించి, గోరువెచ్చగా అయ్యాక తలంతా పట్టించి, మృదువుగా మర్దన చేయాలి. ఓ గంటయ్యాక తలస్నానం చేస్తే సరి. దీనిలోని యాంటీ ఆక్సిడెంట్లు మాడుమీద నూనెలు అతిగా విడుదలవ్వకుండా చేస్తాయి. యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు చుండ్రును దరిచేరనీయవు. దురద, యాక్నేలను తగ్గించడంతోపాటు వాటి కారణంగా వచ్చే దుర్వాసనకీ చెక్ పెడతాయి. అంతేకాదు బిర్యానీ ఆకులోని విటమిన్లు, ఎసెన్షియల్ ఆయిల్ హెయిర్ ఫాలికల్స్ మీద ప్రభావం చూసి, కురులు వేగంగా పెరిగేలా చేస్తాయి. వర్షంలో తడిచాక జుట్టు గడ్డిలా తయారవుతుంది. షాంపూల్లోని రసాయ నాలు,కాలుష్యం, హెయిర్ స్టైలింగ్ ఉత్పత్తులూ ఇందుకు కొంత కారణమే. ఈ సమస్యకీ బిర్యానీ ఆకు మంచి మందు. ▢



# పిల్లలు అలర్జీలకు దూరంగా..

**వర్షాకాలంలో జ్వరాలతోపాటు పిల్లలకు అలర్జీల ప్రమాదం పొంచి ఉంటుంది. వాతావరణ, పరిసరాల ప్రభావం తోపాటు ఆహారం కూడా కొన్నిసార్లు అలర్జీకి దారి తీస్తుంది. దీన్ని నిరోధించ లంటే జాగ్రత్తలేంటో తెలుసుకుందాం..**

సురక్షితమైన ఆహారానికే పెద్దపీట వేయాలి. ముందుగా పిల్లలకు అలర్జీ ఏ ఆహారం తీసుకుంటున్నప్పుడు వస్తుందో గుర్తించాలి. సాధారణంగా గుడ్లు, గింజలు, పాల ఉత్పత్తులు, గోధుమలు, సోయా వంటివి అలర్జీలకు దారి తీస్తాయి. పండ్లు, కూర గాయలు, బియ్యం వంటివాటివల్ల ప్రమాదం తక్కువ ఉంటుంది. అలాగే ప్యాక్ ఫుడ్స్ కొనేటప్పుడు వాటి లేబుల్స్‌ను క్షుణ్ణంగా చూసి అలర్జీకార కాల్లేని, గడువు తేదీ దాటని వాటిని పరిశీలిచుకుని మరీ



ఎంచుకోవాలి. తాజాగా అప్పటికప్పుడు వండిన ఆహారాన్ని అందిం చాలి. ఇంట్లో తయారుచేసే కూరగాయల సూప్స్, బాగా ఉడికించిన కూరలతో భోజనం ఏర్పాటు చేయాలి. తాజా పండ్ల సలాడ్ ఇవ్వడం మంచిది.

**ప్రత్యామ్నాయాలు..** పాలవల్ల అలర్జీ సోకుతుందని గుర్తిస్తే వాటికి ప్రత్యామ్నాయంగా ప్రస్తుతం అందుబాటులో ఉన్న బాదం, ఓట్ మిల్క్‌కని అందించాలి. గుడ్డుకు బదులుగా చియా గింజలు ఇవ్వొచ్చు. పిల్లలకు కావాల్సి ప్రొటీన్లు అందుతాయి. అలాగే బీన్స్, చిక్కుళ్లు వంటివన్నీ చేర్చి విటమిన్లు, ఖనిజలవణాలన్నీ కలిసేలా సమతుల ఆహారాన్నివ్వాలి. భోజనానికి సమయపాలన పాటించడం, ఆహారపు విలువలపై అవగాహన కలిగించడం మంచిది. అలాగేన నిల్వ ఉంచిన ఆహారానికి దూరంగా ఉంచడం శ్రేయస్కరం. ▢

# మంత్రం.. యంత్రం.. తంత్రం !

**మంత్రం దేవతా శబ్దరూపం.** దైవానుగ్రహం పొందటానికీ, ఆధ్యాత్మిక ఉన్నతికీ మంత్రాలను జరిపించటం వేదకాలం నుంచి వస్తున్న సంప్రదాయం. మంత్రాల్లో కొన్నిఉపకారం చేసేందుకు ఉద్దేశించినవి. కొన్ని విధ్వంససాధనాలుగా, ఆయుధాలుగా ఉపయోగపడేవి. అక్షరాల సంఖ్యను బట్టి మంత్రాలకు పేర్లున్నాయి. 6 అక్షరాలంటే బాల, 12 వర్ణాలుంటే కౌమారి, 15 అక్షరాల మంత్రాన్ని యౌవని, 24 అక్షరాలుంటే వృద్ధ అంటారు. అక్షరాల పరిమితి లేకుంటే అది మాలామంత్రం. మంత్రానికి రేఖారూపామైన చిహ్నం యంత్రం. ఇది దేవతను ఆవహించి ఆరాధించే కేంద్రం, ఆలంబన, బీజాక్షరాలతో కూడిన చక్రం. సరళరేఖలు, త్రిభుజాలు, బహు భుజాలు, వృత్తాలు, కోణాలతో రూపొందిన యంత్రంలో ఆయా దేవతాశక్తుల బీజాక్షరాలుంటాయి. ఇవి రాగిరేకులపై లిఖించి ఉంటాయి. ఆలయాల్లో విగ్రహాన్ని ప్రతిష్ఠించేటప్పుడు పీఠం దిగువన విధిగా యంత్రం ఉంటుంది. అందులో ఆ దేవతకు సంబంధించిన బీజాక్షరాలుంటాయి. మంత్ర, యంత్ర రెండింటి శక్తి కలిగింది విగ్రహం. ఇక ఆరాధన, ఉపాసనా ప్రక్రియ, విశేషాలను తెలియజేసేది తంత్రం. అంటే మంత్ర, యంత్ర ఉపాసనా జ్ఞానమే తంత్రం. ఒక్కమాటలో చెప్పాలంటే దేవతలూ, ప్రకృతి శక్తులను వశం చేసుకోవడానికి ఉద్దేశించిన మంత్రాలు, చక్రాలు తదితర అంశాల వివరణే తంత్రం. ఇవన్నీ శాస్త్రీయ నిరూపణలతో కూడిన పదాలు. మన మహర్షులు సాధనతో వీటిని ఆవిష్కరించారు. ▢



ఆధ్యాత్మికం

# మొక్కలకు సేంద్రియ ఎరువులు !



**కంపోస్ట్...** వంటింటి వ్యర్థాలతోనే కంపోస్ట్ తయారు చేసుకోవచ్చు. ఓ డబ్బా తీసుకుని మొదట పొరగా కార్బన్ కోసం బ్రౌన్ వేస్ట్... అంటే ఎండిన ఆకులూ కొమ్మలు, బ్రౌన్‌పేపర్ స్థాపన వేయాలి. తర్వాత లేయర్లో నైట్రోజన్ని విడుదల చేసే కూరగాయలు పండ్ల తొక్కలు, కాఫీ పొడి వంటివాటిని పేర్చాలి. చివరగా కాసిని నీళ్లు చల్లి మూత పెట్టేయాలి. దీన్ని రోజుకొకసారి తెరిచి కర్రతో తిప్పుతూ ఉంటే... 23నెలలకు కంపోస్ట్ సిద్ధమవుతుంది. ఇది మొక్కకు అవసరమైన పోషకాల్ని నెమ్మదిగా విడుదల చేస్తూ మట్టిని సారవంతంగా మారుస్తుంది.

**వ్యర్థాలతో...** ఆవుపేడ, కోళ్ల వ్యర్థాలు మొక్కల మొక్కలకు అందిస్తే... నేలను సారవంతం చేయడంతోపాటు మట్టిలో తేమను నిలుపుతాయి. ముఖ్యంగా వాటి ఎదుగుదలకు కీలకమైన నైట్రోజన్, పొటాషియం వంటి వాటికి తగినంతగా లభిస్తాయి. అయితే, అలాగని అతిగా వాడితే ఆకులు మాడి పోయినట్లు అవుతాయి. దాన్ని గమనించుకుని నెలరోజులకు ఒకసారి అందిస్తే చాలు.

చేప పొట్టు ఎనుల్షన్... ఫిష్ మీల్ లేదా ఎమల్షన్ రెండు చేప పరిశ్రమలోని ఉప ఉత్పత్తులే. వీటిలో ఫిషిమీల్ సాధారణంగా పౌడర్ లేదా గ్రాన్యూల్స్ రూపంలో ఉంటుంది. దీన్ని మట్టిలో కలుపుతారు. ఫిష్ ఎమల్షన్ అనేది నీటిలో కరిగించిన ద్రవం... దీన్ని నీటిలో కలిపి పిచికారీ చేస్తారు. ఈ రెండు ఉత్పత్తుల్లోనూ నైట్రోజన్, పొటాషియం, భాస్వరం పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎదుగుదలలో కీలకంగా పనిచేస్తాయి. చీడపీడలనూ ఎదుర్కొంటాయి.



**సోయాబీన్ మీల్...** సోయా ఉప ఉత్పత్తుల నుంచి ఇది తయారవుతుంది. స్లో రిలీజింగ్ ఫెర్టిలైజర్ కావడంతో భూమిలోకి పోషకాలు నెమ్మదిగా విడుదలవుతాయి. మొక్కలు ఆరోగ్యంగా ఎదుగుతాయి.

**బోన్ మీల్..** ఎండబెట్టి, పొడిచేసిన ఎముకలతో తయారుచేసిన ఈ మీల్‌లో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది ఆరోగ్యకరమైన వేర్ల పెరుగుదలకు అవసరమైన పోషకం దీన్ని దుంపలు, వేరు కూరగాయాల్ని నాటడానికి ఎక్కువగా వాడతారు. పోషకాల లోపంతో బాధపడే మొక్కలకూ ఎరువుగా వినియోగిస్తారు. వీటితో పాటు కూరగాయలను ఉడకబెట్టిన నీరు, కోడిగుడ్డు పెంకులు, బియ్యం కడిగిన నీళ్లు, టీ కాఫీపొడులు, అరటి పండు తొక్కలు, పుల్లటి మజ్జిగ-బెల్లం మిశ్రమం వంటివన్నీ ఎరువులుగా వేయొచ్చు.

# తెలుసుకుందాం..

అమెరికాకు చెందిన ఓ మహిళ (పేషెంట్ ఎస్.ఎమ్)కు భయం అంటే తెలియదట. ఆమెలో భయానికి కారణమయ్యే మెదడు భాగం దెబ్బతినటం వల్లే ఈ పరిస్థితి. అంతేకాదు, ఇతరుల్లోని భయాన్నీ తను గుర్తించలేదట. అయితే, మిగతా భావోద్వేగాలు, జ్ఞాపకశక్తి, తెలివితేటలు మాత్రం ఎప్పటిలానే ఉండేవి.

# చకచకా చేసేయొచ్చు !

**బరువు తగ్గడానికో.. మధుమేహంవల్లో లేదా** ఇతర కారణాల మూలంగానో చపాతీలు తినేవాళ్లు ఎందరో ఉంటారు. ఇవి తినడానికి ఎంతో రుచిగా ఉంటాయి.కానీ పిండి కలపాలంటేనేకాస్త విస్తుగ్గా ఉంటుంది. ఆ పనిని సులువు చేసేందుకు వచ్చిందే సిలికాన్ నీడింగ్ అండ్ రోలింగ్ మ్యాట్ గిన్నెలో పిండి కలుపుతుంటే రొట్టెల పీట మీద చపాతీ చేస్తున్నప్పుడూ చేతులతోపాటు, పీటకూ పిండి అతుక్కుపోతుంటుంది. కానీ ఈ సిలికాన్ మ్యాట్ మీ దగ్గర ఉంటే ఇక అలాంటి సమస్యే ఉండదు. పిండి కలపడం,



రొట్టె చేయడం కూడా చకచకా అయిపోతాయి. చాలా సౌలభ్యంగా ఉండే ఈ మ్యాట్ నచ్చితే మీరూ ఒకటి కొనుక్కోండి. పైగా దీన్ని శుభ్రం చేయడం కూడా చాలా తేలిక. ▢



# వరల్డ్ నం.1 బుమ్రా



బౌలర్ల ఐసిసి ర్యాంకింగ్స్

టాప్ లేపిన ముగ్గురు హీరోస్





**న్యూఢిల్లీ:** బౌలింగ్‌లో భారత్‌తో పాటు, వివిధ దేశాలకు ప్లేయర్లు టాప్ రేపారు. ఐసీసీ విడుదల చేసిన బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో ముగ్గురు ప్లేయర్లు సత్తాచాటారు. ఈసారి మూడు ఫార్మాట్‌లు టెస్ట్, వన్డే, టీ20లలో ముగ్గురు వేర్వేరు బౌలర్లు ప్రపంచంలో నంబర్ 1 స్థానానికి చేరుకున్నారు. టెస్టుల్లో భారత్‌కు చెందిన జస్ప్రీత్ బుమ్రా, వన్డేల్లో దక్షిణాఫ్రికాకు చెందిన కేశవ్ మహారాజ్, టీ20లో న్యూజిలాండ్‌కు చెందిన జాకబ్ డఫీ అగ్రస్థానంలో ఉన్నారు. భారత ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా ప్రస్తుతం టెస్ట్ క్రికెట్‌లో నంబర్ 1 బౌలర్‌గా నిలిచాడు. అతడి వద్ద 889 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. బుమ్రా కెరీర్‌లో అత్యధికంగా 908 రేటింగ్ పాయిం ట్లను 2025లో ఆస్ట్రేలియాపై సిడ్నీ టెస్టులో సాధించాడు. తన స్పెషల్ బౌలింగ్ శైలి, పర్ఫెక్ట్ యార్కర్లకు బుమ్రా ప్రసిద్ధి. అతని బౌలింగ్‌తో ఎన్నోసార్లు మ్యాచ్‌ను మలుపు తిప్పి భారత్‌కు విజయాన్ని అందించాడు. ముఖ్యంగా విదేశీ పిచ్‌లపై అతడి ప్రదర్శన టీమిండియాకు పెద్ద బలంగా మారింది. ఇక వన్డేలో కేశవ్ మహారాజ్ సత్తా చూపించాడు. వన్డే ర్యాంకింగ్స్‌లో దక్షిణాఫ్రికా స్పిన్ బౌలర్ కేశవ్ మహారాజ్ నంబర్ 1 స్థానంలో ఉన్నాడు. ప్రస్తుతం అతనికి 671 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. అతని కెరీర్‌లో అత్యధికంగా 741 రేటింగ్ పాయింట్లను 2023లో కోల్‌కతాలో ఆస్ట్రేలియాపై సాధించాడు. మహారాజ్ తన కంట్రోల్డ్ బౌలింగ్, బ్యాట్స్‌మెన్‌లపై ఒత్తిడి పెంచేందుకు పేరుగాంచాడు. వన్డే క్రికెట్‌లో తన ఖచ్చితత్వం, ఓర్పుతో అనేక కీలక మ్యాచ్‌లలో తన జట్టుకు ఆధిక్యాన్ని అందించాడు. అలాగే టీ20లో నంబర్ 1 స్థానాన్ని జాకబ్ డఫీ కైవసం చేసుకున్నాడు. టీ20 అంతర్జాతీయ బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్ జాకబ్ డఫీ మొదటి స్థానానికి చేరుకున్నాడు. అతని ఖాతాలో 717 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. అతని కెరీర్‌లో అత్యధికంగా 750 రేటింగ్ పాయింట్లను 2025లో హారారేలో దక్షిణాఫ్రికాపై సాధించాడు. డఫీ తన వేగవంతమైన బౌలింగ్, స్వింగ్, డెత్ ఓవర్లలో కంట్రోల్డ్ కు పేరుగాంచాడు. అతని బౌలింగ్‌లో వైవిధ్యం బ్యాట్స్‌మెన్‌లను ఇబ్బంది పెడుతోంది.

## వరల్డ్ నంబర్ 1గా షూటర్ సురుచి



**న్యూఢిల్లీ:** ప్రపంచ నంబర్ 1 మహిళా ఎయిర్ పిస్టల్ షూటర్‌గా 19 ఏళ్ల సురుచి సింగ్ నిలిచింది. తాజా ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఈ ఘనత సాధించిన ఏకైక భారతీయ షూటర్‌గా రికార్డుకెక్కింది. ప్రపంచ కప్‌లో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చిన తర్వాత, భారత యువ షూటర్ సురుచి తన కెరీర్‌లో తొలిసారిగా మహిళల ఎయిర్ పిస్టల్‌లో ఈ ర్యాంక్‌ను సాధించింది. 4162 పాయింట్లతో సురుచి ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. ఆ తర్వాతి స్థానాల్లో ఉన్న ముగ్గురు చైనా షూటర్లను అధిగమించింది. ఈ సంవత్సరం ఆమె సీనియర్ అంతర్జాతీయ అరంగేట్రం చేసి వరుసగా 3వ్యక్తిగత ప్రపంచకప్ టైటిళ్లను గెలుచుకోవడంద్వారా తన కెరీర్‌కుఅద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చింది. ఈ విజయం భారత షూటర్ సురుచికి తన తొలి ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు సిద్ధమవుతున్న తరుణంలో ఆత్మవిశ్వాసాన్ని మరింతగా పెంచుతుంది. ఇకపారిస్ ఒలింపిక్స్ పతక విజేత మనుభాకర్ ప్రస్తుతం మహిళల ఎయిర్ పిస్టల్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 1988 రేటింగ్‌తో ఆరో స్థానంలో ఉంది. అలాగే ఆసియా ఛాంపియన్ అయిన సిఫ్ట్ కౌర్ సమ్రా, మహిళల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్ విభాగంలో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో మొదటి మూడు స్థానాల్లో ఉన్న ఏకైక భారతీయ షూటర్. ఆమె ప్రస్తుతం 3034 రేటింగ్‌తో ప్రపంచంలో రెండవ స్థానంలో ఉంది. నార్వేకు చెందిన మ్యూనిచ్ ప్రపంచ కప్ ఛాంపియన్ జీనెట్ హెగ్ డ్యూస్టాడ్ తర్వాత ఆమె ఉంది.




## హాకీ ఆసియా కప్.. కొరియాతో భారత్ మ్యాచ్ డ్రా

**న్యూఢిల్లీ:** హాకీ ఆసియా కప్-2025, సూపర్ 4లో కొరియాతో జరిగిన మ్యాచ్‌ను భారత్ 2-2తో డ్రా చేసుకుంది. పురుషుల ఆసియా కప్ రాజ్‌గిర్ 2025లో భారత పురుషుల హాకీ జట్టు విజయయాత్రకు అవాంతరం ఏర్పడింది. కొరియా తమ తొలి సూపర్ 4 గేమ్‌ను 2-2తో డ్రాగా ముగించింది. భారత్ తరపున హార్దిక్ సింగ్ (8), మన్దీప్ సింగ్ (53) గోల్స్ సాధించగా, కొరియా తరపున జిహున్ యాంగ్ (12), హైయోన్ హాంగ్ కిమ్ (14) గోల్స్ చేయడంతో, భారత్ ఒకే ఒక్క పాయింట్‌తో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. రెండవ మరియు ఏడవ నిమిషాల్లో వరుసగా రెండు పెనాల్టీ కార్నర్‌లను గెలుచుకోవడం ద్వారా భారత్ ఆరంభాన్ని ఇచ్చింది.

8వ నిమిషంలో, సుఖ్జీత్ సింగ్ మిడ్‌ఫీల్డ్‌లో బంతిని గెలిచి హార్దిక్ సింగ్ (8)కి ఆడాడు. కొరియా వరుసగా 2 గోల్స్ చేసి పోటీలో ఆధిక్యాన్ని సంపాదించుకుంది. 12వ నిమిషంలో జుగ్‌రాజ్ సింగ్ చేసిన ఫౌల్ కారణంగా కొరియాకు పెనాల్టీ స్ట్రోక్ లభించింది. జిహున్ యాంగ్ (12) షాట్‌తో కొరియా పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుంది. రెండవ క్వార్టర్ రెండు జట్ల మధ్య హోరాహోరీగా సాగింది. 22వ నిమిషంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ లాంగ్ పాస్ ఆడగా కొరియా గోల్ కీపర్ బలమైన సేవ్‌తో ఎదుర్కొన్నాడు. మూడవ క్వార్టర్ కూడా కొరియా స్వల్ప ఆధిక్యంలో నిలిచింది.

53వ నిమిషంలో, సుఖ్జీత్ సింగ్ కొరియా రక్షణ ద్వారా మన్దీప్ సింగ్ (53) కు సరైన పాస్ ఇచ్చి ఆటను మళ్ళీ సమం చేశాడు. ఆ తర్వాత భారతదేశం మరియు కొరియా రెండింటికీ పెనాల్టీ కార్నర్లు వచ్చాయి, కానీ వారు విజయ గోల్ సాధించలేకపోయారు. రెండు జట్లు చాలా పోటీతత్వంతో నాలుగు క్వార్టర్ల తర్వాత డ్రాగా ముగించాయి.

## యుఎస్ ఓపెన్‌లో సెమీఫైనల్‌కు బాంబ్రీ జంట

**న్యూఢిల్లీ:** యుఎస్ ఓపెన్-2025లో పురుషుల డబుల్స్ విభాగంలో యుకీ భాంబ్రీ-వీనస్ జోడీ తొలి గ్రాండ్ స్లామ్ సెమీఫైనల్‌కు చేరుకుంది. న్యూజిలాండ్‌కు చెందిన మైఖేల్ వీనస్‌తో కలిసి భంబ్రీ అనుభవజ్ఞులైన ద్వయం నికోలా మెక్టిక్-రాజీవ్ రామ్‌లపై 6-3, 6-7, 6-3 తేడాతో మూడు సెట్ల విజయాన్ని నమోదు చేశాడు. ఇండో కివీ జంట నాల్గవ గేమ్‌లో తొలి బ్రేక్ సంపాదించి, ప్రత్యర్థులపై ప్రారంభంలోనే ఒత్తిడి పెంచడంతో మ్యాచ్‌కు మంచి ఆరంభం లభించింది. వారు మ్యాచ్‌లో తొలి బ్రేక్ పాయింట్‌ను వదులుకోవడంతో తదుపరి ఆటలోనే వారికి సవాలు ఎదురైంది, కానీ చివరికి వారు దానిని కాపాడుకుని తమ ఆధిక్యాన్ని కొనసాగించారు. తొమ్మిదవ గేమ్‌లో ఇండో కివీ జంట మరో బ్రేక్ పాయింట్ అవకాశాన్ని కాపాడుకుంది. కొద్ది పోరాటం తర్వాత మ్యాచ్ యొక్క ప్రారంభ సెట్‌ను కైవసం చేసుకున్నారు. రెండు జతలు ఒక్కొక్క బ్రేక్ కోల్పోవడం, ఇతర సర్వింగ్ గేమ్‌లలో కూడా సుఖంగా కనిపించకపోవడంతో రెండవ సెట్‌లో కూడా సర్వ్‌లతో ఈ పోరాటం కొనసాగింది. అయితే, రెండు జతలు ఒకరి బలమైన రిటర్న్ గేమ్‌ను మరొకరు రద్దు చేసుకున్నారు మరియు రెండవ సెట్‌లో టైబ్రేక్‌ను బలవంతంగా సాధించారు, దీనిని రాజీవ్ మరియు మెక్టిక్ 8-6 తేడాతో గెలుచుకున్నారు. చివరి సెట్‌లో ఏడవ గేమ్ వరకు ఎటువంటి బ్రేక్‌లు ఇవ్వలేదు. కానీ, పరిస్థితులు మారిపోయాయి, ఇండోకివీ జంట చివరి సెట్‌ను గెలుచుకుని కీలకమైన 5-3 ఆధిక్యాన్ని సాధించింది, ఏడు బ్రేక్ పాయింట్లను కాపాడుకుని చివరికి గేమ్‌ను కైవసం చేసుకుని చివరి నాలుగు స్థానాల్లో చోటు సంపాదించాడు.



## క్వాలిఫయర్స్‌లో విజయంతో ప్రారంభించిన భారత్

### 2-0 తేడాతో బహ్రెయిన్ ఓటమి



**న్యూఢిల్లీ:** ఎఎఫ్‌సి అండర్ 23, ఆసియా కప్-2026 క్వాలిఫయర్స్ ప్రచారాన్ని భారత్ విజయంతో ప్రారంభించింది. ఖతార్‌లోని దోహాలో గురువారం జరిగిన మ్యాచ్‌లో బహ్రెయిన్‌పై 2-0 తేడాతో భారత్ ఫుట్‌బాల్ జట్టు గెలుపొందింది. గ్రూప్ బీ యొక్క మొదటి ఆటలో భారత్ మూడు పాయింట్లను నమోదు చేయడంతో ముహమ్మద్ సుహైల్, చింగాంగ్‌బామ్ శివల్డో సింగ్ రెండు గోల్స్ చేశారు. 31వ నిమిషంలో సుహైల్ అద్భుతమైన సోలో స్ట్రైక్‌తో భారత్‌కు ఆధిక్యాన్ని అందించాడు. రెండవ అర్ధభాగంలో, సయ్యద్ మహమూద్ అల్మూసావి ఆఫ్‌సైడ్ కారణంగా గోల్ చేయకపోవడంతో, బహ్రెయిన్ ఈక్వలైజర్ కోసం తీవ్రంగా ప్రయత్నించింది. చివరి నిమిషంలో శివల్డో చేసిన గోల్‌తో భారత్ మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. కాగా బ్లూ కోల్ట్స్ ఈ టోర్నమెంట్‌కు ఎప్పుడూ అర్హత సాధించలేకపోయింది. చరిత్ర సృష్టించే ప్రతిభ ఉన్న భారత జట్టుకు ఇది జీవితకాల అవకాశం. గ్రూప్ విజేతలు మరియు 11 గ్రూపుల నుండి ఉత్తమంగా రెండవ స్థానంలో నిలిచిన నాలుగు జట్లు ఎఎఫ్‌సి అండర్ 23 ఆసియా కప్ 2026కి అర్హత సాధిస్తాయి. సౌదీ అరేబియా ఇప్పటికే ఆతిథ్య దేశంగా టోర్నమెంట్‌కు అర్హత సాధించింది. క్వాలిఫయర్స్‌లో మిగిలిన 15 స్థానాల కోసం మొత్తం 44 జట్లు పోటీపడుతున్నాయి, ఒక్కొక్కటి నాలుగు గ్రూపులుగా విభజించబడ్డాయి.

## జిఎస్టీ మార్పులు రియాల్టీ, నిర్మాణరంగాలకు ఊతం!




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** కేంద్రం ప్రభుత్వం జీఎస్టీలో మార్పులు చేస్తూ ప్రకటించిన రెండు శ్లాబుల నిర్ణయం రియల్ ఎస్టేట్‌కు ఊతం లభిస్తుందని రియాల్టీ రంగ అంచనా. నిర్మాణరంగంలోని పలు వస్తువుల ధరలకు సంబంధించిన శ్లాబ్‌ను మార్చడంతో ఇన్‌పుట్ ఖర్చులు తగ్గుతాయని పేర్కొంటున్నారు. భారత్, ఆగ్నేయాసియా, పశ్చిమ ఆసియా, ఆఫ్రికా సీబీఆర్ఈ అధ్యక్షుడు, సీఈవో అన్షుమాన్ జీఎస్టీ మార్పుతో వ్యయ ప్రభావాలను హైలెట్ చేశారు. సిమెంట్, స్టీల్, ఇతర ఇన్‌పుట్స్ సాధారణంగా మొత్తం నిర్మాణ వ్యయంలో 40నుంచి 45 శాతం వాటా కలిగి ఉంటాయని తెలిపారు. దాంతో తగ్గింపు ప్రాజెక్ట్ ఖర్చులను గణనీయంగా తగ్గిస్తుందని పేర్కొన్నారు. డెవలపర్లు ఇప్పుడు పొదుపులో కొంత భాగాన్ని గృహ కొనుగోలుదారులకు బదిలీ చేయవచ్చని, దాంతో గృహాలను కొనుగోలు చేసే అవకాశం పెరగడంతో అన్నిరంగాల్లో డిమాండ్‌ను పెంచుతుందన్నారు. పండుగ సీజన్‌లో సరైన సమయంలోనే జీఎస్టీ సంస్కరణలు వచ్చాయి. గృహాభివృద్ధి, మౌలిక సదుపాయాల ఆధారిత ఆర్థిక వృద్ధిపై ప్రభుత్వ విస్తృత దృష్టికి ప్రభుత్వ చర్యలు ఊతమిస్తాయని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. హీరానందాని గ్రూప్, నరేడ్కో నేషనల్ చైర్మన్ నిరంజన్ హిరనందని కేంద్రం నిర్ణయాన్ని భారతీయ వినియోగదారులకు 'పండుగ కానుక'గా, ఆర్థిక వ్యవస్థకు వ్యూహాత్మక ప్రోత్సాహకంగా అభివర్ణించారు. 'అందరికీ గృహనిర్మాణం' అనే ప్రభుత్వ కల సాకారానికి ఊతమిస్తుందని తెలిపారు. డెవలపర్లకు మాత్రమే కాకుండా వినియోగదారులకు, గృహనిర్మాణ రంగానికి దేశ దీర్ఘకాలిక వృద్ధికి ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఇలాంటి అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ, నరేడ్కో జాతీయ అధ్యక్షుడు జీ హరిబాబు మాట్లాడుతూ జీఎస్టీ హేతుబద్దీకరించడం రియల్ ఎస్టేట్,నిర్మాణరంగం, అనుబంధ రంగాల పరిశ్రమలకు ఉపశమనం కల్పిస్తుందని హరిబాబు తెలిపారు.

## మారుతి సరికొత్త 'విక్టోరిస్'

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3:** కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ..దేశీయ మార్కెట్లోకి సరికొత్త 'విక్టోరిస్' మోడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. మధ్యస్థాయి ఎస్‌యూవీ సెగ్మెంట్‌ను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ నయా మాడల్‌ను ప్రవేశపెట్టినట్టు కంపెనీ ఎండీ, సీఈవో హిసాచీ టకెచి తెలిపారు. ప్రస్తుతం సంస్థ ఫ్రాంక్స్, బ్రెజ్జా, జిమ్నీ, గ్రాండ్ విటారా మాడళ్లను దేశీయంగా విక్రయిస్తున్న విషయం తెలిసిందే. గడిచిన నాలుగేండ్ల కాలంలో కంపెనీ మొత్తం విక్రయాల్లో ఎస్‌యూవీ వాటా మూడింతలు పెరిగి 8.9 శాతం నుంచి 28 శాతానికి ఎగబాకిందన్నారు. ఈ నేపథ్యంలో ఎంట్రీఎస్‌యూవీని ప్రవేశపెట్టినట్టు చెప్పారు. హ్యుందాయ్ క్రెటా, కియా సెల్టోస్, హోండా ఎలివేట్‌లకు పోటీగా సంస్థ ఈ నూతన మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ కారు ధర సంస్థ వెల్లడించలేదు. అయినప్పటికీ ఈ కారును తీర్చిదిద్దడానికి రూ.1,240 కోట్ల మేర పెట్టుబడి పెటినట్టు ప్రకటించింది.

## జిఎస్టీతో ఇవి కార్ల సేల్స్‌కు బూస్టప్..!



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** జీఎస్టీ రేట్‌శ్లాబ్‌ల హేతు బద్దీకరణతో విద్యుత్ కార్లకు మంచి మద్దతు లభించింది. దీనివల్ల ఇఎంఐల భారం కూడా తగ్గుతుందని, కార్ల మొత్తం విలువలపై విధించే జీఎస్టీ కూడా ఐదుశాతానికి కుదించడంతో దేశంలో విద్యుత్ వాహనాలకు డిమాండ్ పెంచే లక్ష్యంతోనే కేంద్రం ఈనిర్ణయం తీసుకుందని అంచనా. ప్రస్తుతం 18శాతం ఉన్న జిఎస్టీని ఇకపై ఐదుశాతానికి తెచ్చారు. అయితే చిన్న స్థాయి పెట్రోలు డీజిల్‌కార్లనుంచి పోటీ మాత్రం తప్పదన్న అంచనాలున్నాయి. ఈకార్లకు 18శాతం జీఎస్టీ అమలవుతోంది. జీఎస్టీ మండలి సమావేశానికి ముందు విద్యుత్‌కార్లు 20 లక్షలు, 40 లక్షలు పైబడిన వాటికి 18శాతం ఉంటుందని, 40లక్షల కార్లకు 28శాతం ఉంటుందన్న అంచనాలు వెలువడ్డాయి. అయితే అందరి అంచనాలు తల్లకిందులుచేస్తూ ఈవీ పరిశ్రమకు మద్దతిస్తూ ఐదుశాతానికి తెచ్చింది. ఈవీకార్లపై ఐదుశాతం జిఎస్టీని వసూలు చేయడం అనేది కర్బన ఉద్గారాలను తగ్గించేదిశగా కేంద్రం వెళుతోందని తెలుస్తున్నదని, ఇది స్వాగతించాల్సిన తరుణమని టాటా ప్యాసింజర్‌విద్యుత్‌కార్ల విభాగం ప్రెసిడెంట్ శైలేష్‌చంద్ర అన్నారు. మహీంద్ర మహీంద్ర ఈడీ సిఇఒ రాజేష్ జెజూరికర్ మాట్లాడుతూ ఐదుశాతం జీఎస్టీ ఆమోదనీయ నిర్ణమని అన్నారు. భారత విద్యుత్ ఆటోమొబైల్ డివిజన్‌కు ఈ నిర్ణయం ఇపుడు ఎంతో అవసరం అని ప్రభుత్వం ఈదిశగానే నిర్ణయించిందన్నారు. నిజానికి టాటామోటార్స్,వమీంద్ర అండ్ మహీంద్రాలే దేశంలో ఈవీఇకార్ల ఉత్పత్తిలో ముందున్నాయి. అయితే లగ్జరీ కార్ల తయారీ సంస్థలు వోల్వో కార్ ఇండియా జ్యోతి మల్హోత్ర మాట్లాడుతూ ఈవీ విబాగంలో ఐదుశాతం జిఎస్టీ విధింపు అనేది విద్యుత్ ఇంధనాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నట్లయిందన్నారు.



వాణిజ్యం

### దీపావళి కొనుగోళ్లకు కేంద్రం

## జిఎస్టీ గిఫ్ట్!

**ముంబయి,సెప్టెంబరు 4:** జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణతో రానున్న దీపావళి సామాన్లు అందుబాటుధరల్లోకి వస్తాయని ట్రేడర్లఅంచనా. ఇక పండగ విక్రయాలు కొంతమేర ఊపందుకుంటాయని అంచనా. ప్రత్యేకించి మిఠాయి బాక్సులు, పూజా సామగ్రినుంచి ఆభరణాలు, వంటింటి సామాన్లు కార్లు ఇలా ఒకటేమిటి దీపావళి షాపింగ్‌కార్ట్‌లో అన్నీ కూడా కొంత ధరలు తగ్గుతాయని అంచనా. జీఎస్టీ మండలి ప్రకటించిన జీఎస్టీ 2.0 సంస్కరణలు పన్నుల వలయాన్ని మరింత సులభతరంచేసింది. ఒకరకంగా చెప్పాలంటే దీపావళి గిఫ్ట్ అనే బడా పారిశ్రామికవేత్తలు కూడా పేర్కొంటున్నారు. కేవలం రెండే రెండు శ్లాబ్‌లు అంటే ఐదు, 18శాతం మాత్రమే ఉంటాయి. 40శాతం మాత్రం విలాసవస్తువులకోసం కొత్తశ్లాబ్ సృష్టించారు. దీపావళి బాస్కెట్‌లో మిఠాయిలు, పండుగ తినుబండారాలు మరింత చౌక అవుతాయి. యుహెచ్‌టి పాలు, పన్నీరుపై జీఎస్టీ తొలగించగా వెన్న, నెయ్యి, జున్ను వంటి వాటిని 14నుంచి ఐదుశాతానికి తెచ్చారు. ఇక తీపితినుబండారాలు, కన్ఫెక్షనరీ ఉత్పత్తులు,చాకొలేట్లు, కోకో ఆధారిత ఉత్పత్తులు, ఐస్‌క్రీమ్‌లు గతంలో 18శాతం ఉంటే ఇపుడు ఐదుశాతానికి వచ్చాయి. ఐస్‌క్రీమ్, ఇతర శీతల ఉత్పత్తులుకూడా ఐదుశాతానికి వచ్చాయి. స్నాక్స్, నమ్‌కీన్స్ భుజియా, మిక్సర్లు, పాస్తా, బిస్కట్లు, కేకులు, పాస్ట్రీస్, బేకరీ ఉత్పత్తులు అన్నీ కూడా ఐదుశాతం కిందకే వచ్చాయి. డ్రైఫ్రూట్స్ అంటే ఆలమండ్స్, పిస్తాచియోస్, క్యాష్యూస్, డ్రైడ్ ఫిగ్స్, డేట్స్, సిట్రస్ పండ్లు 12శాతం కాకుండా ఐదుశాతానికి వచ్చాయి. పండ్ల రసాలు, జామ్‌లు, స్క్వాష్‌లు, కొబ్బరినీళ్లు వంటి కూడా ఐదుశాతానికి వచ్చాయి. కొవ్వొత్తులు, చేతితయారీ కొవ్వొత్తులు, హరికేన్ లాంటర్లు, ఇతర లైటింగ్ ఉత్పత్తులు కూడా ఐదుశాతానికి చేరాయి. చెక్క, రాయి, ఇత్తడి, సిరమిక్, గ్లాస్, ఇతర లోహ విగ్రహాలు, సుందరీకరణ ఉత్పత్తులుకూడా ఐదుశాతంలోనే ఉన్నాయి. ఇక కాస్మెటిక్స్, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులు సబ్బులు, షాంపూలు, హెయిరాయిల్, టూత్‌పేస్ట్, టాల్కమ్ పౌడర్, షేవింగ్‌క్రీమ్‌లపై ఐదుశాతం జీఎస్టీమాత్రమే ఉంటుంది.

## జిఎస్టీ మార్పులు స్వాగతించిన కార్పొరేట్ దిగ్గజాలు



**ముంబయి, సెప్టెంబరు 4:** ప్రధాని మోదీ ప్రకటించిన దీపావళి కానుక అద్భుతంగా ఉందని, ప్రతి భారతీయుడికి ఇది అతిపెద్ద దీపావళి కానుక అని దిగ్గజ పారిశ్రామికవేత్త హర్ష్ గోయెంకా కొనియాడారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ చేశారు. ప్రతి భారతీయుడికి ఇది అతిపెద్ద దీపావళి గిఫ్ట్. నిత్యావసర వస్తువులు, విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు చెందిన పరికరాలపై జీఎస్టీ తగ్గింది. ఇప్పుడు కిరాణ సామగ్రి తక్కువగా దొరుకుతుంది. ఆరోగ్య సంరక్షణ ఖర్చు చాలా వరకు తగ్గుతుంది. విద్య అందుబాటు ధరలో లభిస్తుంది. రైతులకు మద్దతు లభిస్తుంది. మొత్తంగా తదుపరి జీఎస్టీ అంటే జీవన సౌలభ్యం + ఆర్థిక వ్యవస్థకు ఊతం అని హర్ష్ గోయెంకా పోస్ట్ చేశారు. సోషల్ మీడియా వేదికగా ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా సైతం స్పందించారు. వేగవంతమైన సంస్కరణల వినియోగం, పెట్టుబడులు వృద్ధికి మార్గాలు. వీటి ద్వారా ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తుంది. ప్రపంచ వేదికలపై భారత దేశ స్వరం ఎక్కువగా వినిపిస్తుంది. ఈ సందర్భంగా లే.. మేలుకో గమ్యం చేరే వరకు విశ్రమించొద్దు అనే స్వామి వివేకానంద మాటలు గుర్తు చేసుకోవాలి. దయచేసి మరిన్ని సంస్కరకణలు తీసుకురండి అని సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ చేశారు. ఆటోమొబైల్ రంగానికి మంచి ఊతం లభిస్తుందని, జిఎస్టీ తగ్గింపులతో విద్యుత్‌కార్ల కొనుగోళ్లకూడా పెరుగుతాయని మహీంద్ర అంచనావేసారు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.